THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204703
LIBRARY
UNIVERSAL

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T83·1 L39B Accession No. T276

Author లక్ష్మీనరసింహం.

Title భారతకథామంజరి

This book should be returned on or before the date last marked below.

శ్రీ

భారతకథామంజరి

[దేశమాత నుండి పునర్ముద్రితము.]

ఇది

చిలకమర్తి లక్ష్మీనరసింహముచే

రచియింపఁబడినది.

మూఁడవకూర్పు 1000

రాజమహేంద్రవరము

మట్టే సుబ్బారావుచే

శ్రీవిద్యానిలయ ముద్రాక్షరశాలయందు

ముద్రించి ప్రకటింపఁబడియె.

1919.

స్వామ్యసంకలితము.] [వెల 8 అణాలు.

భారతకథామంజరి

శంఖలిఖితులు

బాహుదానదీతీరమున శంఖుఁడు లిఖితుఁడు నను నన్నదమ్ము లిద్దఱు పుణ్యాశ్రమము కల్పించుకొని యందుఁ జక్కని పర్ణశాలలు నిర్మించుకొని తపస్సు చేసికొనుచుండిరి. ఆయాశ్రమమునఁ దియ్యనిపండ్లు నొసఁగు వృక్షము లనేకములు గలవు. ఆయన్నదమ్ము లిద్దఱు సంతుష్టులై యాఁకలి యగునప్పుడు చెట్లొసంగెడు పరిపక్వఫలంబులఁ దినుచు దాహమైనప్పుడు నదీజలంబులం ద్రావుచుఁ బరమనిష్ఠాగరిష్ఠులై, యన్నగా రెఱుఁగకుండఁ దమ్ముఁడు పండ్లు గోయఁగూడ దనియుఁ దమ్మునితోఁ జెప్పకుండ నన్న ఫలములు స్వీకరింపఁ గూడదనియుఁ దమలోఁ దా మొక నియమ మేర్పఱచుకొని కాలక్షేపము సేయుచుండిరి. అట్లు కొంతకాలము గడువ శంఖుఁ డాశ్రమమున లేనిసమయమున లిఖితుఁడు చెట్లనుండి కొన్ని ఫలములు కోసి భక్షించెను. శంఖుఁ డింటికి వచ్చి చెట్లు చూచి "యీపండ్లెవరు భక్షించి" రని తమ్ము నడిగెను.

“నేనే భక్షించితి” నని, లిఖితుఁ డుత్తరమిచ్చెను. అప్పుడు శంఖుఁ డిట్లనియె. “అయ్యో! తమ్ముఁడా! మన మేర్పఱుచుకొన్న నియమముప్రకారము నీవు నాకుఁ దెలియకుండఁ బండ్లు కోయఁగూడదుకదా! ఏల నాతోఁ జెప్పక పండ్లు కోసి భక్షించితివి? ఇది దొంగతన మగును. నీవు దొంగ వైతివి. దొంగతన మనఁగా నన్యులసొత్తు నపహరించుటయే కాదు. అన్నదమ్ములకుఁ గాని తండ్రికొడుకులకుఁ గాని మిత్రులకుఁ గాని సామాన్యమైనసొత్తు నొకనికిఁ దెలియకుండ మఱి యొకఁడు తీసికొని యనుభవించుట చౌర్య మగును. జనకుని ధనము కుమారుఁడు, తనయుని ధనము తండ్రి చెప్పకుండ గ్రహింపఁ గూడదు. మననియమమునకు విరుద్ధముగ నీవు నాకుఁ దెలియకుండ ఫలముల ననుభవించితివి. కావున నీవు చోరుఁడవు. ఇందువలన నీకుఁ బాపము కలదు. పాపపరిహారమునకు రెండుమార్గములు కలవు. బ్రతికియున్నకాలమున రాజదండన మనుభవించుట, మరణానంతరమున యమదండన మనుభవించుట. రాజదండన మనుభవించినవారికి యమదండన ముండదు. కావున మనదేశమును బాలించుచున్న సుద్యుమ్నమహారాజువద్దకు నీవు పోయి, నీచేసినపాప మాతనికి విన్నవించి నేరమునకుం దగినదండనము సేయుమని ప్రార్థించి యాతనిచే దండితుఁడవై రమ్ము; అప్పుడు నీవు నిష్కలుషుఁడవై యుందువు. అట్లు చేయవేని మరణానంతరము నీకు నరకంబె యగు. రాజదండన కోర్వవచ్చును; కాని యమ

దండన సహింపఁ జాలము. కావున సత్వరము రాజుదగ్గఱ కరుగుము ” అని శంఖుఁ డానతిచ్చుటయు లిఖితుఁడు తన చేసిన కార్యమునకు విషాదమొంది సుద్యుమ్న మహారాజు పట్టణమున కరిగి .యాతని యంతఃపురమున కావల నిలువంబడి తనరాక భూపాలునకుఁ దెలుపు మని ప్రతీహారులను వేఁడెను. వా రట్లు చేసిరి. రాజు మంత్రులతోఁ గలిసి యర్ఘ్యము, పాద్యముఁ బట్టుకొని బ్రాహ్మణునివద్దకు వచ్చి యేమి కావలయు నని యడిగెను. లిఖితుఁడు తన చేసిన యకార్యంబును దనయన్న చేసిన యుపదేశంబును మహారాజునకు విన్నవించి దొంగను దండించిన విధమునఁ దన్ను దండింప వలసిన దని యాతనిం బ్రార్థించెను. సుద్యుమ్నుఁడు వాని మాటలు విని భయంపడి యిట్లనియె. “దేవా! మీరు పరమ తపోధనులు. బ్రహ్మజ్ఞానసంపన్నులు. నిర్వికారమనస్కులు. ధర్మశాస్త్రకర్తలు. మీరుచేసినది పాపము కాదు. మీ రన్యుల సొత్తు హరింపలేదు. ఆయా శ్రమములో మీ కుభయులకు ఫలముల ననుభవించు స్వాతంత్ర్యము కలదు. కావున మీరు చేసినది నేరము కాదు. ఇంత చిన్నతప్పునకు మిమ్మెట్లు దండింతును ? ఇది నిజముగ దోషమైనను బ్రాహ్మణుల దండింపరాదు. దండింతు నేని నాకు నరకం బగు నని వెఱపు కలుగుచున్నది. నన్నీదుష్కార్యమునందు నియోగింపవలదని ప్రార్థించుచున్నాఁడ” ననవుడు లిఖితుఁడు రాజున కిట్లనియె

"రాజా! తప్పునకుఁ జిన్న పెద్దలు లేవు. నేను చేసినది తప్పక తప్పు. తప్పు కానియెడల ధర్మసూక్ష్మవేత్త యగునాయన్న నన్ను నీకడకుఁ బంపఁడు. పంపినను వచ్చువాఁడను కాను. నేను తప్పక దండ్యుఁడను. తప్పుచేసినను బ్రాహ్మణులను దండింపఁ గూడ దంటివి; అట్లనఁగూడదు. రాజుదృష్టికి బ్రాహ్మణుఁడు, చండాలుఁడు సమానముగ నుండవలయును. నేరము చేసినప్పుడు నేరస్థులను రాజు నిష్కరుణుఁడై దండింప వలయు. జాతిభేద మొక్కడ నెంచఁ గూడదు. సకలశాస్త్రం బుల నెఱింగి సకలధర్మరహస్యంబులఁ దెలిసి, లోకులకు ధర్మోపదేశంబులు సేయు నావంటి విజ్ఞానులు నేరములం జేయ రాదు. విద్యావిహీనులు నేరములు చేసినప్పుడు వారిని దండించుటయు, విద్వాంసులు నేరములు చేసినప్పుడు వారిని విడుచుటయు, ధర్మము కాదు. క్షమింప వలసివచ్చినప్పుడు యుక్తాయుక్త మెఱుఁగక దోషములు చేసిన మూర్ఖులనే క్షమింప వలయును. తెలిసి చేసినవిద్వాంసులను దప్పక దండింప వలయును. నీ కిందు దోషములేదు. నీ సద్గతులకు భంగము కలుగదు" ఆమాటలు విని సుద్యుమ్నుఁడు మనసులో నిష్టము లేకపోయినను దప్పకపోవుటచే లిఖితుని రెండు చేతులు నఱికించెను. లిఖితుఁడు తనకుఁ బాపవిమోచనము కలిగిన దని పరమానందభరితుఁడై రాజును దీవించి పరుగు పరుగున శంఖునికడ కరిగి రాజసన్నిధిని జరిగినవృత్తాంత మెఱిఁగించి

తన మొండిచేతులఁ జూపెను. శంఖుఁడు దనసోదరునియవస్థకు మనమునఁ గొంత విచారించి “తమ్ముఁడా! పరమపవిత్రమైన మనవంశ మిప్పుడు నిష్కళంక మైనది. నీచేతుల నెత్తుటితో దొంగతనపుమచ్చ కడిగివేసితివి. మనపితృదేవతలు మన ధర్మనిరతికి మిగుల సంతసింతురు. ఇప్పుడే పోయి బాహుదానదిలో స్నానముచేసి పితృతర్పణంబుఁ జేయు”మని పలికెను. అట్లు కాక యని లిఖితుఁడు బాహుద కరిగి యందు మునిఁగి లేచునప్పటికి చేతు లెప్పటియట్ల వచ్చెను. లిఖితుఁ డాశ్చర్యము నొంది యన్నకడ కరిగి యావృత్తాంతముం దెలిపెను. మరల మొలిచిన సోదరునిచేతులం జూచి శంఖుఁడు సంతసించి “తమ్ముఁడా! ఇది మన తపఃప్రభావము. ఈశ్వరానుగ్రహము మనపైఁ గలదు. మనతపములు ఫలించె. మనము నిష్కళంకచరిత్రుల మైతిమి” అని యతనిం గౌఁగిలించుకొని పర్ణశాలకుం గొనిపోయెను.

మూఁడు చేఁపలు.

ఒకసరస్సున మూఁడు చేఁపలు వసియించి యుండెను. అందొకదానిపేరు దీర్ఘదర్శి. రెండవదానిపేరు ప్రాప్తకాలజ్ఞుఁడు. మూఁడవదానిపేరు దీర్ఘసూత్రుఁడు. ఆమూఁడు

మత్స్యంబులు మిక్కిలి పొందుగలిగి యాచెఱువునందు యథేచ్ఛంబుగ సంచరించుచుం గాలక్షేపముం జేయుచుండ వేసఁగి సమీపించెను. అప్పుడు దీర్ఘదర్శి తక్కిన రెండు మీనములం జూచి యిట్లనియె. "మిత్రులారా! వేసఁగి దాపగుచున్నది. ఎండలు మెండగుచున్నవి. మనసరోవరంబునం గలజలమంతయుఁ గ్రమక్రమంబున నింకిపోవును. కొలను నిర్జల మైనవెనుక మానము చేయునది లేదు. ఏవేఁటకాండ్రో పట్టి భక్షింతురు. అట్టియాపద రాకమున్నె జలముండు సమృద్ధిగఁ గలకొలను జేరి సుఖింతము. కావున రండు. కార్యము పాకము దప్పనీయకుఁడు," అనవుడు నవ్వి ప్రాప్తకాలజ్ఞం డిట్లనియె. దీర్ఘదర్శి ఏమిరా యోడ్చుచున్నావని యడుగ నెల్లుండి మావాఁడు గొట్టునని యనినట్లు వేసఁగి వచ్చి నీరెప్పుడో యెండిపోవు ననియు నెన్నఁడో వేఁటకాండ్రు వచ్చి చుట్టుముట్టి పట్టుకొందురనియు నప్పుడు మానము తప్పించుకొని పారిపోవుట కవకాశముండ దనియు బెంగపెట్టుకొని యిప్పుడు విచారించుచుంటివా? ఆపద వచ్చినప్పుడు దానికిఁ బ్రతీకారముఁ జేసికొనుట బుద్ధిమంతుల లక్షణముకాని ముందుగానే దిగులుకొని ప్రస్తుతము పడుచున్న సుఖమును వదలుకొని దేశాంతరంబులకుం బోవుట భావ్యము కాదు. నీమాట చొప్పున మఱియొక జలాశయంబునకుఁ బోవుద మనుకొనుము. అదియు నింకిపోఁగూడదా. అక్కడమాత్రము మనము వేఁటకాండ్రపాలు కాఁగూడదా. కావున మన మిచ్చటనె యుండి

నిజముగ నట్టియుపాయము మనకు సంభవించినపక్షమున సమ
యోచితము లగునుపాయములచేత దానిం బాపుకొందుము.
పట్టిభయము పడక యూరకుండుము.'' ఆయుభయులపలు
కులు విని దీర్ఘసూత్రుఁ డీతెఱంగున పలికెను. ''మిత్రు
లారా! మీయిరువురపలుకులు నాకు నంగీకారములే. అందు
దీర్ఘదర్శి మాటలు నా కించు కేనియు సమ్మతములు కావు.
అతఁడు తననీడఁ జూచి తానే భయపడును. ఈజలాశ
యము మహాసముద్రమంత యున్నది. ఇదియేమి, ఇంకి
పోవుట యేమి! ఇది యింకినపక్షమునఁ బ్రపంచమునఁ
గలనదులు సముద్రములుఁ గూడ నింకిపోవును. అట్టియా
పద సంభవించినపక్షమున జగంబున జలాశయములె యుం
డవు. అదియునుగాక కాకున్నది కాక మానదు. మనము
వేఁటకాండ్రచేతులఁ బడి మృతినొందవలసినయోగ మున్న
పక్షమున నే దేశాంతరమున కరిగి యేసరస్సులో నుండి
నను నక్కడ తప్పక చచ్చి తీరుదుము. బ్రతుకవలసిన యోగ
మున్నపక్షమున నీళ్ళు లేనిచెఱువులో నుండినను బ్రతుకు
దుము. అక్కడొకదైవ మిక్కడొకదైవ ముండునా?
బ్రహ్మవ్రాఁత యెట్లుండునో యట్లు జరుగును. కావునఁ
బుష్కలంబుగ జలంబులు గలయీకొలను విడిచి మన మన్య
ప్రదేశములకుఁ బోవలదు.'' అని పలుక దీర్ఘదర్శి ''మీ
వాక్యములు నాకు రుచింపవు. దీప మున్నపు డిల్లు చక్కఁ

బెట్టుకొనవలయు. ఆపద వచ్చునని తెలిసి సమయోచితము లగునుపాయముల గాదక వచ్చుననియు రానున్నది రాక మానదనియు నపాయస్థలంబున నుండుట వివేకలక్షణము గాదు. మీయిష్టమైన మీ రిటనుండుఁడు. నే నిదె పోవు చున్నాఁడ." నని జలసమృద్ధంబగు వేఱొక్క కాసారంబు నకుం జనియెను. తక్కిన మీనంబులు రెండు దానిం బరిహసించుచు నక్కడనె యుండెను. అంతట గ్రీష్మకాలము భయంకరమై ప్రాపించెను. మడువులో నున్న నీ రంతయు నింకిపోయెను. చెఱువులో చేఁప లన్నియు బయలుపడెను. వేఁటకాండ్రు మిక్కిలి సంతోషముతో మడువుఁ జొచ్చి యూఁతలతో, గాలములతో, వలలతో యథేచ్ఛముగ మత్స్యంబుల నన్నిఁటిని బట్టుకొనిరి. అప్పుడు ప్రాప్తకాలజ్ఞుఁడు తనలో "హా! దైవమా! ఏమిగతి. దీర్ఘదర్శిమాటలు వినక చెడి పోతినే" యని యించుక యాలోచించి మనంబున నొక్క యుపాయంబు దోఁప దానిననుసరించి నీటియొడ్డునఁ బల్లెవాఁడు వైచిన చేఁపలగుదిదాపునకుఁ బోయి యాగుదిత్రాటిని నోటితోఁ గఱచుకొని చచ్చినట్లు నటించెను. బెస్తవాఁడు గుదిలోని చేఁపల నన్నిఁటిని మఱియొక కొలనులో బురద పోవుటకయి యుసుముచుండ నప్పుడు ప్రాప్తకాలజ్ఞుఁ డది యెఱిఁగి కఱచిన త్రాడు వదలి లోతునీటం బడి ప్రాణములు దక్కించుకొనియె. దీర్ఘసూత్రుఁడు వేఁటకాఁడ్రి బారిం బడక యెట్టకేలకుఁ బశ్చాత్తాపము నొంది కార్యము మించుటచేఁ జేయు

నది లేక దుఃఖించుచుఁ బ్రాణముల విడిచెను. ఈవిధంబు గనె భవిష్యత్కాలమున వచ్చెడు నాపదల ముందుగా నెఱిఁగి వానిం బరిహరించుకొను బుద్ధిమంతులు దీర్ఘదర్శివలె నిరంతరాయసుఖంబులం బడుచుందురు. రాఁబోవు నాపదల నెఱుఁగలేనివారు సమయోచితంబు లగు నుపాయంబులకొఱకు వెదకుచు నుపాయంబులు దొరకినప్పుడు బ్రతికి ప్రాప్తకాలజ్ఞునివలె సంశయజీవను లగుచుందురు. దీర్ఘదృష్టియు సమయోచితం బగు నుపాయంబును లేనివారు దీర్ఘసూత్రునివలె నిధనము నొందుచుందురు.

పిల్లి, ఎలుక

ఒకయడవిలో నొకమఱ్ఱిచెట్టుమీఁద లోమశుఁ డను పిల్లి వాసముఁ జేయుచుండెను. ఆవృక్షముక్రింద నొకకలుగులో పలితుఁ డను పేరు గల యెలుక యొకటి కాపురముండెను. ఒక మాలవాఁడు ప్రతిదినము సాయంకాలమునందు వేఁటకై యా వనమునకుఁ బోయి యా చుట్టుప్రక్కల వలలు నురులు పన్ని పోయి యా రాత్రి యయ్యు

రులఁ జిక్కిన జంతువులను సంహరించుటకయి మరునాఁడుదయమున నక్కడి కేగుచుండును. ఒక్కనాఁటి రాత్రి యామూలఁ జెప్పటియట్లు యురులు పన్నిచన నర్ధరాత్రమున మఱ్ఱిమీఁద నున్న పిల్లి యాహారము నిమిత్తము క్రిందికి దిగి యిటునటుఁ దిరుగుచు విధివశంబున నయ్యురులలోఁ దగులొక్కని విచారించుచుండెను. ఎలుక కలుగులో నుండి పైకి రాఁ దలఁచి తల యెత్తి యిటు నటు తొంగిచూచి తన సహజశత్రువయిన మార్జాలము బంధమునఁ దగుల్కొనుట చూచి నిర్భయముగఁ దిరుగవచ్చు ననుకొని పైకి వచ్చెను. అంతలో దాని దురదృష్టవశమున నొక గుడ్లగూబయు ముంగియు నచ్చటికి వచ్చెను. మూషికము వానిం గాంచి భయమున గడగడ వడఁకి కొండొకవడికి ధైర్యముఁ దెచ్చికొని గూబబారినుండియు ముంగి బారినుండియుఁ దప్పించుకొనుటకు మహాపదలో నున్న మార్జాలము నాశ్రయించుటయే ముఖ్యకర్తవ్య మని నిశ్చయించి, దానిం జేరం జని యిట్లనియె. “ పిల్లీ ! నీ విప్పుడు గొప్ప విపత్తులో నున్నదానవు. నీకు నావలన సహాయము గావలసి యున్నది. నాకును నొక యాపద సంభవించినది. ముంగియు గూబయు నన్నుఁ గబళింపఁ జూచుచున్నవి. కావున నాకు నీ వలన సహాయము కావలసి యున్నది. ఈ యురులఁ దెగఁ గొఱికి నిన్ను నేను రక్షించెద. ఆ రెండుజంతువులబారినుండి నన్ను నీవు కాపాడుము. సహజవైరమును విడిచి వర్తింపుము,

అందువలనఁ బరస్పరప్రాణరక్షణ మగును." అనవుడు మూషికమునకు మార్జాల మిట్లనియె. "అయ్యో! యింత కంటెను మేలు కలదా? నీయంతట నీవువచ్చి నాకు మహోపకారము సేయుదు నని చెప్పుచుండ నేను వల దందునా? నీవు నాయొద్ద నుండుము. ముంగియు గూబయు నీవంక తేఱిచూడఁ జాలవు నాపేరు వానికి సింహస్వప్నము గాదా? భయపడకుము." నావుడు మూషికము మిక్కిలి సంతసించి దానియొద్దకుం జనియె. ముంగియు గూబయు నాశాభంగము నొంది పిల్లి యొద్ద నున్నయెలుక నేమియుంజేయఁ జాలక తొలఁగి పోయెను. పిమ్మట నెలుక యురులు గొఱుకక నిటు నటు తారుచు జాగుసేయుచుండుట పిల్లి చూచి యిట్లనియె. "మిత్రమా! ఉరులు వేగముగఁ గొఱుకుము. తెల్లవాఱ వచ్చుచున్నది. వేఁటకాఁడు వేవనె బయలుదేరును. నే నురిలోఁ దగుల్కొనియుండ వాఁడు వచ్చిన కడు మోస మగును. కావున నాకుఁ బ్రత్యుపకారము కార్యము మించకుండఁ జేసి రక్షింపుము. కృతఘ్నత మహాపాతకము." అని రోమశుండు పలుకఁ బలితుఁడు "మిత్రమా! నేను కృతఘ్నుఁడను గాను. కాలము మించకుండ నుపకారముఁ జేసెద. మాలవాఁడు వచ్చునప్పటికి నీకు బంధమోక్షముం జేసెద. ఇప్పటినుండి చేయ నేల? నీ వనుమానపడవలదు. నాకు మేలుచేసినవానిని వేఁటకాని కొప్పగించి యూరకుండఁ గలనా? భయముదక్కి వర్తింపుము." అని యూరడఁ బలికెను. ఎలుక తనకుఁ బ్రత్యుపకారము

సేయునో సేయదో యని సంశయాక్రాంత మై మార్జాలము వగచుచుండ నంతలో వేటకాఁ డరుదెంచెను. పిల్లి దీనవాక్యములతోఁ దనకు విడుదల చేయు మని ప్రార్థించెను. మూషికము మిక్కిలి వేగమున నయ్యురులు గొఱికి తన కలుగులోనికిఁ బాఱిపోయెను. మార్జాలము సత్వరమున మఱ్ఱిచెట్టెక్కి కూర్చుండెను. వేటకాఁ డక్కడకుఁ బోయి తనప్రయత్నము నిష్ఫల మగుటకు మీఁదుమిక్కిలి యురులు కొఱుకంబడి చెడిపోవుటకు మిక్కిలి వగచియుస్సురనుచుం బోయెను. అనంతరము మార్జాలము మూషికముం బిలిచి “ప్రియమిత్రమా! లేక లేక మన కిరువురకుం జెలిమి కలిగెను. వచ్చుచుఁ బోవుచు నున్నప్పుడేగదా చుట్టఱికము. నూతన మైత్రివలనఁ గలిగెడు సుఖంబుల ననుభవింప వేమి? నాకడకు రావేమి? కష్టసుఖంబులు సెప్పవేమి? ఇష్టాగోష్ఠి చెప్పికొందము రమ్ము. నావలన నీకు భయంబు లేదు. మనవైరంబులు తుదముట్టినవి. పరస్పరోపకారంబున స్నేహబంధము దృఢ మైనది. రమ్ము! రమ్ము” అని పిలిచెను. అప్పలుకులకు మూషికము మెల్లన నిట్లనియె. మిత్రమా! నీకు నే నాహారపదార్థమను. రాత్రియంతయు నీయురులలోఁ దగుల్కొని యాహారము లేక మలమల మాడుచుండెడి కతమున నన్నొక చల్దిముద్దగఁజేసి గుటుక్కని మ్రింగఁ దలఁచి నీవింత ప్రేమతోఁ బిల్చుచుంటివి. అంతేకాని నామీఁది ప్రేమచేఁ గాదు. నామీఁదను నాజాతిమీఁదను నీకును నీజాతి

కిని నెంత ప్రేమమో నే నెఱుఁగనా? నీవొకవేళ నాచేసినయు పకారముఁ దలఁచి నాకుఁ గీడు దలఁపక యుండినను నీచుట్టం బులు నన్ను బ్రతుకనిత్తురా? సహజశత్రువులతోఁ గాల వశంబున నవసరము గలిగి యొకప్పుడు మైత్రి సమకూ ర్చుకొనవలసి వచ్చును. ఆమైత్రి శాశ్వత మని యెంచక బుద్ధిమంతులు మిక్కిలి మెలఁకువతో వర్తింపవలయును. పగవారి నెప్పుడు నమ్మరాదు. నమ్మినట్లుయుండి కార్యసాధ నముఁ జేసికొనుట ధీమంతుల లక్షణము. నాకొకమేలు నీవు చేసితివి. నీకొక యుపకారము నేను చేసితిని. మనమైత్రి యిం తతో సమాప్తమైనది. నన్ను ఇఁకఁ బిలువకుము. నాయంత నేను వచ్చి నీనోటఁ బడుటకు నేనంత వెఱ్ఱిదానను గాను" ఆమాట లువిని మార్జాల మిది నామాయలోఁ బడునదిగాదు. మిక్కిలి గడుసుది యని నిరాశఁ జెంది యథేచ్ఛం బోయెను. ఎలుకయు దానివలన భయంబులేక సుఖం బుండెను.

విశ్వామిత్రుఁడు, మాలవాఁడు

తొల్లి త్రేతాయుగద్వాపరయుగముల సంధిఁ బం డ్రెండుసంవత్సరములు వాన లేక గొప్ప కఱవు సంభవించెను. ఆద్వాదశవర్షకాలములో నదులు చెఱువులు బావులు పూర్తిగ నిగిరి పోయెను. వ్యవసాయములు చెడెను. చెట్లెండిపోయెను భూమి నిస్సార మయ్యెను. నీరు మేఁత లేక పశువులు మందలు మందలుగఁ జచ్చెను. దొంగలు పెచ్చు పెరిగిరి. ప్రజలను రక్షింపవలసినరాజులె దొంగ లై ధనధాన్యంబులు దోపించిరి. అధర్మము హెచ్చెను. బలవంతుఁడు బలహీనుని నాశనము చేసెను. యజ్ఞములు దేవతాపూజలు నడుగంటెను. వర్ణాశ్రమధర్మము చెడిపోయెను. అన్నము లేక జనులు గుంపులుగుంపులుగఁ జచ్చిరి. పల్లెలు పట్టణములు పెనుఁగు పెంటలయ్యెను. ప్రపంచమంతయు నతిభయంకర మై యుండె. ఆదుష్కాలమునందు విశ్వామిత్రమహాముని తన కాహార మెందును లభింపమి పండ్లు, దుంపలు, కాయలు తన కిమ్మని జనుల నడిగి యడిగి పడయఁజాలక యాఁకలి కోర్వలేక మిక్కిలి బాధపడుచు బలహీనతచేఁ దూలిపడుచు నడవి యెందేని పోయి యొకమాలపల్లెఁ జేరెను. అక్కడ నొకమాలఁ బశువుల ప్రేగుల ప్రోవులు మఱియొకమాలఁ బందిడొక్కలు, వేఱొకచోటఁ గుక్క పు

ఱ్ఱెలు, నింకొకచోటఁ బోళ్ళగుట్టలు, నింకొక చెంత నెముకలత
ట్టలు వానికిఁ గనఁబడెను. దుస్సహమైనదుర్గంధ మందుండి
వెడలుచుండెను. అచ్చట నేదేని యించుక మాంసము దొరకు
నేమో యని యతఁడాస పడి యచట విశ్రమించెను. క్షుధాన
లమున కోర్వఁజాలక మిక్కిలి బాధ పడుచున్న యాతని కొక
చోఁ గుక్కమాంసము కనఁబడెను. అది చూచినతోడనే
యతఁడు బ్రహ్మానందభరితుఁడై దానిని సమీపించె. మాల
వాండ్రింతకుముందె యొక్క కుక్కం జంపి తిత్తియొలిచి యూరు
టకై గాలిలోఁ బెట్టి పండుకొనిరి. మాలవాండ్రు పూర్వకాల
మునందు శునకమాంసమే మిక్కిలిగ భక్షించెడువారని పురా
ణములయం దున్నది. శ్వపాకుఁ డనియు, శ్వపచుఁడనియు,
మాలవానికి నామములు గలవు. కుక్కను దినువాఁ డని యాశ
బ్దముల కర్థము. అప్పు డర్ధరాత్ర మయ్యెను. మాల లందఱు
నిద్రించుచుండిరి. చండాలురు చూడకుండఁ గుక్కమాంసమును
గడించి తిని యాఁకలి దీర్చుకొని ప్రాణరక్షణముఁ జేసికొనవలె
నని విశ్వామిత్రుఁడు కృతనిశ్చయుఁ డయ్యెను. వసిష్ఠుని ధిక్క
రించి, మహాతపంబు గావించి పరమేష్ఠిని మెప్పించి బ్రహ్మ
ర్షి యై మహేంద్రునితోఁ బ్రతిఘటించి త్రిశంకునకుఁ బ్రతి
స్వర్గము గల్పించి సృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేయ సంకల్పించిన
తపోధనచక్రవర్తి యగువిశ్వామిత్రుఁడు కాలవశమునఁ బేరాఁ

కలి కోర్వలేక కుక్కమాంసమును దినఁ దలఁచి దానిని దొం గిలించి పుచ్చుకొన వలయు నని సంకల్పించె గదా ! పొట్టకూ టి కై మనుష్యుఁడు చేయఁదగిన పని చేయరాని పని యనక స్థితి మారినపుడెల్ల యకార్యములఁ జేయును. అట్లు నిశ్చయిం చుకొని యామహర్షి దానిం జేకొనునప్పటికి దానిపక్కను బండుకొని నిద్రించుచున్న మాలవాఁడు మేల్కని యెవఁడు వాఁ డని కేక వేసెను. "నేను విశ్వామిత్రుఁడ" నని యతఁ డుత్తరమిచ్చెను. చండాలుఁ డా పలుకులు విని విశ్వామిత్రుని వంటి మహాత్ము లట్టిసమయమున వెలివాడకు వచ్చినందులకు మిక్కిలి విషాదపడి భయము గదురఁ గన్నుల నీరు నెట్టుకొని స్వామీ ! ఏల మీవంటిమహానుభావు లీచండాలవాటికకు రావలసె ? దారి తప్పి వచ్చితిరా ? కావలయు నని వచ్చితి రా ? వచ్చిన కార్య మేమి సెలవిండు " అని చేతులు జోడించి ప్రార్థించెను. అనవుడు విశ్వామిత్రుఁడు గద్గదస్వర ముతో ని ట్లనియె. "ఎన్నిదినములనుండియో నా కాహారము లేదు. ఆఁకలిచేఁ బ్రేవులు మాడిపోవుచున్నవి. బలహీనమగుట చేత నంగములు స్వాధీనమగుట లేదు. కన్నులు తిరుగుచు న్నవి. మేను తూలుచున్నది. ఎందటి నడిగినను బట్టె డన్న మైన నాకు దొరకినది కాదు. మీ రెల్లరు నిద్రించు చుండుటచే నీ కుక్కమాంసమును దొంగిలించి ప్రాణరక్ -ణముఁ జేసికొనవలయు నని తలంచితిని. " అనవుడు మాల

వాఁడిట్లనియె. “ దేవా ! కడజాతివాఁడను. మూర్ఖుఁడను; నేను మీకు ధర్మము లుపదేశింపఁజాలను. అయినను నావిన్నపమొక్క టాలకింపుఁడు. కుక్క యధమజంతువు. దానిమాంసమధమాధమము. దొంగిలించుట మహాపాతకము. ఎల్లవిధములచేతను నింద్యమైన యాకర్మమును దేవరవారివంటి మహాత్ములు చేయఁదగునే ? మీరు జాతముచేత క్షత్రియులు. మహిమచే బ్రహ్మర్షులు. ఇంద్రాదులను గడగడ వడఁకఁ జేసిన తపశ్శాలులరు. మీరె యిట్లు చేయ మానవుఁ డెవ్వఁడిఁక నీతిమార్గమున మెలంగును ?” అనవుడు విశ్వామిత్రుఁడు వాని కిటు ప్రత్యుత్తర మిచ్చె. “ ఓరీ ! ప్రాణ లు పోవుచున్నవి. ఆపత్కాలమునందు మనుష్యుఁ డేపదార్థ మాపదార్థ మనక యెల్లపదార్థముల భుజింపఁదగు. ప్రాణము పోవుచున్నప్పుడు దానినిల్పుకొనుటకై చేసినదొంగతనము దొంగతనముకాదు. ఇదియేపరమధర్మసారము. ఇఁక నొక్క నిముసమైన నేనిలువఁజాల. నన్ను నీవడ్డగింపకుము. నన్ను నీవు కరుణింపుము,” అని విశ్వామిత్రుఁడు పలుకుటయు మాలవాఁడు మారు పలుక లేక “ స్వామీ ! మీచిత్తమువచ్చినట్లు చేయుఁ” డని యూరకుండెను. ఆమహాత్ముఁడు శునకమాంసమును దిని ప్రాణరక్షణముఁ జేసికొనెను. అనంతరము వానలు కురిసెను. పంటలు పండెను. జనులు సుఖించిరి.

కపోతము, కిరాతుఁడు.

ఒక కిరాతుఁడు వేఁటకు వెడలి కొన్ని పక్షులం బట్టుకొని సంచిలోఁ బెట్టుకొని యడవిలోఁ దిరుగుచుండఁగా గొప్ప గాలివాన వచ్చెను. అరణ్యమంతయు జలమయమయ్యెను. ఆ బోయకు నిలుచుటకైన నించుక తావు దొరకదయ్యె. వాని కట్టుకొన్న బట్టలు తడిసిపోయెను. చలిచే వాఁడు గజగజ వడఁకుచు గుబురుగానున్న యొకచెట్టుక్రింద కరిగి యొక రాతిపైఁ గూరుచుండి "నాప్రాణరక్షణార్థమై యీవృక్షము నీడనున్న సమస్తభూతములఁ గొలిచెద. కరుణించి రక్షింపుఁ" డని ప్రార్థించెను. ఆచెట్టుతొఱ్ఱలోనున్న మగపావురము తనపెంటి రాకపోవుటచే మిక్కిలి విషాదమునొంది యిట్లు వగవఁజొచ్చెను. "అయ్యో ! నాప్రియురా లెక్కడి కరిగినది ఇంతప్రొద్దు పోవువఱకు నెక్కడ నుండునదికాదు. నన్ను బాసి క్షణమైన నుండనోపదు. వేఁటకాండ్రవలలోఁ జిక్కియుండునా ? వానదెబ్బకుఁ జచ్చియుండునా ? అది లేనినాఁడు నాజన్మమేల ? అనుకూలమైన భార్య వోయినపిదప బ్రతుకుటకంటె బలవన్మరణము మేలు. హా ! యెందు వెదకుదు ? ఏమిసేయుదు ? అది లేకపోవుటచే నాతొఱ్ఱ పాడువారినది. ఎవరిచేతఁ జిక్కెనో ? ఏమిపాట్లు పడుచున్నదో ? దైవమా ? యేమి తెరువు ?" అని దుఃఖించుచుండ దాని యాలాపములను

వేఁటకానిసంచిలో నున్న యా పెంటిపావురము విని సంతో
షించి యిట్లనుకొనియెను. “అహాహా! యిప్పుడుకదా నాజ
న్మము ధన్యమైనది. ఏయిల్లాలిసుఖ త్త్రమై మగఁడు శోకించునో
యాయిల్లాలు మిక్కిలి ధన్యురాలు. భార్యసమక్షమున లేనప్పు
డా సుగుణంబులఁ దలఁచి భర్త శోకించెనేని యాసుపతి మన
స్సున కెక్కిన భార్యయని చెప్పవచ్చును. నాజీవితముయొక్క
పరమార్థము నేను పొందితి” నని తలంచి యాసంచిలో
నుండి పక్షిభాషణంబులతోఁ దనభర్త నుద్దేశించి యిట్లనియె.
“నే నీవేఁటకానివలలోఁ దగుల్కొంటి. నాకు మరణకాల
మాసన్నమైనది. వినశ్వరంబగుటకు విచారించిన ఫలంబు లేదు.
మరణమెప్పుడో యొకప్పుడు రాక మానదు. దానికై వగవ
వలదు. జన్మమెత్తినందుకు లోకోపకారముఁ జేసి మృతి
నొందవలయును. పరోపకారము సేయనిజన్మము వ్యర్థము;
కావున నీవు నాకొఱకై వగవక ధైర్యము చిక్కఁబట్టి నీయింటి
కభ్యాగతుఁడై! వచ్చియున్న యీబోయవానికేదైన నీయోపి
నయుపకారము సేయుము. చలిచే నీతఁడు వడఁకు చున్నాఁడు.
కాలుసేతులు వంకరపోవు చున్నవి. ఉపేక్ష జేసినపక్షమున
మృతి నొందవచ్చును. ఎట్లయినఁ బాప మీతని రక్షింపుము”
అని తనయిల్లాలు వలుకుటయు మగపావురము దానిమాటల
కచ్చెరు వడి, విచారించినఁ గార్యంబు లే దని తెలిసికొని
యది తన కుపదేశించిన పరమధర్మము ననుష్ఠింపఁ దలఁచి
బోయ నుద్దేశించి “అయ్యా! నీవు మాయింటి కతిథివై

వచ్చితివి. నీవు మిక్కిలి డస్సినట్లు కనంబడు చున్నాఁడవు. నీ కేమి కావలయునో చెప్పుము. నా యోపినకొలఁది సాయ మొనర్చి నీయాపదఁ బాపఁ గడంగెద!" యని మనుష్యభాష ణములఁ బలుక సంతసించి యాకిరాతుఁడు "డతిసీతమున బాధ పడు చున్నాఁడను. చలిచే నాచేతులు కాళ్ళు స్వాధీనము లవుట లేదు. మాటయు వచ్చుట లేదు. వెంటనే చలి బాధ మాన్పు" మని వేఁడుకొనెను. ఆపలుకులు విని యాపులుఁగు తొఱ్ఱ విడిచి చుట్టుప్రక్కలనున్న యెండు పుల్లలు ముక్కునఁ గఱచికొని తెచ్చి ప్రోవుగాఁ బెట్టి దగ్గఱ నున్న పల్లియకుం బోయి నిప్పునకొఱ్ఱ యొకటి ముక్కునం దగిలించుకొని తెచ్చి యాపుల్లల ప్రోవునం బెట్టి మంటఁజేసి చలి కాఁచుకొనుమని బోయతోఁ జెప్పెను. కిరాతుఁడు పర మానందభరితుఁడై చలిమంట కాఁగి సీతుబాధ బాపికొని సం తుష్టుఁడై పులుఁగుం జూచి "మిత్రమా! చలిబాధ తొలఁ గినది. ఆఁకలి మిక్కుటముగ వేఁచుచున్నది. దీనిని భరింపఁ జాల కున్నవాఁడ. సీతుబాధఁ దీర్చినట్లె యాఁకలిబాధ గూడ నీవే తీర్పవలయు" నని చెప్పెను. కపోత మాతనియార్తిఁ జూచి కడు జాలి నొంది యిట్లనియె. "అయ్యా! మా బ్రతు కొకబ్రతుకు గాదు. మావంటివార మున్నను లేకపోయినను బ్రపంచమునకు వెలితి లేదు. ఇప్పుడు నేను నీ కాహార మయ్యెద. సందేహింపక భక్షింపుము. 'పరోపకారార్థ మిదం శరీర' మను వాక్యము పెద్దలు చెప్పఁగా విని యది యాచరణ

మానసం బెట్టుటకు సమయము నిరీక్షించు చుంటిని. ఇదే సమయము వచ్చినది. ఈకార్యముచేత శరీరము పావన మగు ” నని యెంచుచున్న యాయగ్నికిఁ బ్రదక్షిణముఁ జేసి యామంటఁ బడి మృతి నొందెను. ఆకపోతముయొక్క యౌదార్యమును సాహసమును జూచి బోయఁడు నిశ్చేష్టుఁడై తెల్లఁబోయి చూచెను. ఆఁకలిబాధ వానికి మందగించెను. ఆశ్చర్య మధిక మయ్యెను. మనంబు పరిపరివిధంబులం బోయెను. తలఁపులు గుంపులు గుంపులై మనస్సు నావరించెను. కిరాతభావ మడఁగెను. దానిస్థానమున వైరాగ్య మంకురించెను. అప్పుడు వాఁ డిట్లు తలపోసెను. “ఆహాహా! మూఁడులోకములయం దెక్కడనైన నిట్టిపౌరుషము గలదె? ఈపక్షికిఁ గలకారుణ్యము ప్రపంచమున నేజంతువునకైనఁ గలదె? పులుఁగుల నెల్లఁ బట్టి చంపి తినునట్టి నావంటి కిరాతునకుఁ దనభార్యను సయితము బట్టుకొన్న దురాత్మునకుఁ దనశరీర మర్పించిన యీపక్షి దాతృత్వమున బలిచక్రవర్తికంటె, కర్ణునికంటె, దధీచికంటె, మిన్న యని చెప్పినది పొగడిత కాదు. పక్షి యేమి? కిరాతుఁ కేమి? శరీర మిచ్చుటయేమి? మహర్షుల చరిత్రమైన నింత యద్భుతముగ నుండదు. ఈపక్షి ముందర మనుష్యుఁ డెందుకు? మానవజన్మ మెత్తి వర్తనముచేత నే బశువునైతిని. పక్షిజన్మ మెత్తి యిది జ్ఞానసంపత్తిని, లోకోపకారపరాయణతను, మనుష్యులతలఁ దన్నినది. ఇటువంటి నిరపరాధములైన పులుఁగులను, జక్కని జంతువులను

నిష్కారణముగఁ జంపి తినునట్టి మనుష్యునిజన్మ మెందుకు ? ఈపాడు పొట్టకై యిన్నిజంతువుల నేలఁ జంపవలె ? ఛీ ! నా జన్మము కాల్పనా ? ఇఁక ముందు నేను నాక్రూరచేష్టలు మాని భూతదయ గలిగి వర్తించెద. పక్షి పరమగురువై వట్టిమాటలతోఁ గాక క్రియారూపమున గొప్ప ధర్మంబుల బోధించెను. దీనిని నేను భక్షింపను. నాశరీరమును గూడ దీని వలె నగ్నిహోత్రమున కాహుతిఁ జేసెద ! హా! పరమేశ్వరా! యీవఱకు చేసినమహాపాతకములు క్షమింపుము ! అనుతాప ప్రాయశ్చిత్తముఁ జేసికొనుచున్నాఁడ. ఇఁకముందు పరమ దయాళుఁడనై వర్తించెద !" యని విచారించి తనయధీనమం దున్న పక్షులనన్నిటి విడిచిపెట్టి వలసైత మవ్వలఁ బాఱ వైచి జ్ఞానోదయసంపన్నుఁడై గమ్యస్థానముఁగాఁగ కాయుడ విం బడి ముందుగ్గ గీముకొనుటచే శరీరము నెత్తురు కాఱుచు న్నను దెలియక చని చని యొక కార్చిచ్చునం బడి మృతి నొందెను. తన పెనిమిటిచావుఁ జూచి దుఃఖపరవశయై యాఁడుపావురము "హా! ప్రాణేశ్వరా! నీవు లేనిబ్రతుకు నాకెందుకు ? మన మెన్నడును కలిసి యాఁడిన మాటలు చేసినసంచారములు, ననుభవించినసౌఖ్యములుఁ జెప్పరాని ముచ్చటలు నేను మఱవఁ జాలను! కాన నీతోడ నే వచ్చెద" నని యామంటలోఁ బడి మేనుఁ బాసెను. పరోపకారార్థమై ప్రాణములు విడిచినకపోతము, భార్యాసమేతముగఁ బరమ పదము నొందెను. పశ్చాత్తాపమహాగ్నిచేఁ బరిశుద్ధుఁడైన కిరాతుఁడును ముక్తుఁ డయ్యెను.

గ్రద్ద, నక్క

నైమిశ మనునొక పట్టణము కలదు. అందొక బాలుఁడు మృతినొందెను. ఆశవమును దీసికొని చుట్టములు శ్మశానమునకుఁ బోయి చూచి చూచి చేతులారఁ బాఱవైవఁజాలక వాని నక్కడఁ బెట్టుకొని మహాదుఃఖపరవశులై విలపించుచుండిరి. అప్పు డొక గ్రద్ద యాకాశమునుండి క్రిందికి దిగి వచ్చి యేడ్చుచున్న యాజనులతో నిట్లనియె. “మీరు భయము విడిచి యీవిధంబున విచారింపఁ దగదు. పొద్దు గ్రుంకుచున్నది. సూర్యుఁ డస్తమించినతరువాత నిచ్చోట మనుష్యు లుండఁ దగదు. భూతములు, పిశాచములు, రాక్షసులు చీకటి పడినతోడనె శవంబులఁ దీసికొని తినుటకై యరుదెంచును. ఆసమయమున వానికంటికి బ్రతికి యున్న మనుష్యులు కనుపడిన నవి తప్పక చంపి తినును. బ్రతికి యున్నవారు చచ్చినవారితోఁ బోవుదురె ? ఇంత వెఱ్ఱి కలదా? మీరు విలపించినయెడ మృతిఁ జెందినబాలుఁడు మరల బ్రతుకునా ? లోకవృత్తము మీరు చూచుట లేదా ? ఎంతదుఃఖమున్న నంత దుఃఖపడుదురా ? దేనికైన మితి యుండవలెను. బాలుఁడు మీవాఁడు కాఁడు. మీవాఁడైన బ్రతికియె యుండును. జననమరణములు సమస్తజంతువులకు సహజములైనవి. అందుచేత మీరు విచారింపక వైరాగ్యము గలిగి

శవము నిచ్చుటఁ బాఱవైచి గాఢాంధకారము గ్రమ్మకమునుపె యింటికిఁ బోయి స్నానములు చేయుఁ" డనిగ్రద్ద మంచియుపదేశము చేయుటయు బంధువు లందఱు దానిమాటలు సత్యము లగుటంజేసి శవము నక్కడ విడిచి బయలుదేఱి కొన్ని యడుగులదూర మరుగునప్పటికి నక్క యొకటి బొక్కలోనుండి విస విస వచ్చి వారిం జూచి యిట్లనియె. "అయ్యయో! మీ రెంతబుద్ధిహీనులు, గ్రద్దమాట నమ్మి మోసపోయి బాలకుని విడిచి వచ్చుచున్నారా? బాలునిమొగముమీఁద కళయైన మాఱలేదు. పున్నపుఁజందురునివలె నున్న యాబాలుని విడిచి పోవుట మీకు కాఁ ట్లాడు చున్నవి! పాఱవైచుటకు మీకుఁ జేతు లెట్లాడినవి? ముఖము వైఖరి చూడ నీతఁడు చచ్చినట్లు తోఁచదు. ప్రాణము కడఁబట్టి యుండవచ్చును. అందుచే మరల బతుకి వచ్చును; ఒకవేళ బ్రతుకకపోయిన నను శోకము పోవునట్లు మీఁదఁ బడి నాలుగుగడియ లేడువ నైన వద్దా? గట్టిగా నేడ్చినయెడల దుఃఖము కొంత శమించును. ఏమైనను మీరింతవేగముగాఁ బోఁ గూడదు. ప్రొద్దు గ్రుంకినపక్షమున వచ్చినభయ మేమి? మనుష్యుఁ డొక్కఁడే యున్నపక్షమున భూతపిశాచములు మీఁదికి వచ్చును; కాని పదిమంది యున్నప్పుడు సాహసించి మీఁదికి రావు. ఒకవేళ వచ్చినను నేమి! ముద్దులుమూటగట్టుచున్న చక్కనిచుక్క పోఁగా లేనిది మీరు పోయిన నేమి? తక్కినమాటలుండఁగా బాలుఁడు నవ్వుచుఁ బండుకొని నట్లున్నాఁడు గాని మృతి

నొందినట్లు లేదు. శరీర మింకను వెచ్చఁగా నున్నది. కావున మరల జీవింపవచ్చు నని నాకింకను ధైర్యము కలదు. అందుచేత మీరు కొంతసే పిచ్చట నిలువుఁ" డని చెప్పి నక్కవారల వెండియు శవముకడకు రప్పించుటఁ జూచి గ్రద్ద వారలనుద్దేశించి యిట్లు పలికెను. "ఏమిది త్రుళ్లమారి నక్కమాటలు విని మీరు మరలి వచ్చితిరా! మీకన్న మూర్ఖులు లోకమం దుండరు. బాలుని మొగమునఁ బ్రేతకళ యావహించినది. బ్రతికి యున్నప్పుడేనుఁగు దంతమువలెనున్న వాని మేను నలుపెక్కినది. కనుగొనుట లేదా? చేతులు కాళ్ళు బిఱ్ఱబిగిసినవి. యముఁడు నిర్దయుఁడై! పసిపిల్లవాని ప్రాణములు హరించె. ఇంక వెడవెడ యాసలు విడిచి గృహంబునకుం జని స్నానములు చేసి బాలునికి సద్గతులు గలుగుటకై బ్రాహ్మణులకు దానములు సేయుఁడు. చచ్చినవా రెచ్చటనయిన మరల బ్రతుకుట మీరు వింటిరా? చాలుఁజాలు! లేనిపోని భ్రమలు పడక సత్వర మింటి కరుగుఁడు." అనవుడు గ్రద్దమాట లధిక్షేపించి జంబుక మిట్లనియెను. "అన్నన్నా! ఈమోసగాండ్రకే దినములు గాని మంచివారికి దినములు కావు. అల్లారుముద్దుగ నున్న యీచిన్నబిడ్డ ముఖపద్మముఁ జూడ పీనుగులను బీకికొని తిను నావంటిదానికే కన్నులనీరు వచ్చుచున్నది. మీ రింత ఱాతిగుండెవారలైనా రేమి? గ్రద్ద మాటలా మీకు పథ్యములు? నావంటిదానికి నయితము జాలిఁ గొలుపుచున్న యీచిన్నపాపనిఁ గూర్చి మీ రింత

కఠినహృదయులు గా నేల? కొంచెము ప్రయత్నముఁ జేసి చూడరాదా? నామాట నిజము కాకపోయినపక్షమున నప్పుడే యొక యేర్పడి పోవచ్చు ఇంతలో నేమి వచ్చినది." అనుటయు గ్రద్ద వారింజూచి "నేను పుట్టి పండ్రెండువందలసంవత్సరము లైనది. ఈనడుమ నెందఱో పిన్నలు, పెద్దలు, స్త్రీలు పురుషులు మృతినొందిరి; కాని వారిలో నొక్కఁడైన బ్రతికి వచ్చుట నేను గని విని యెఱుఁగ. జంతువులు జన్మాంతరము నొంది మరల వచ్చును గాని, యీశరీరంబున బ్రతికి మరల వచ్చుట యసంభవము. బాలునియందలి గాఢప్రేమచేత నక్క లోకవిరుద్ధము లైనమాటలు చెప్పినను మీరు దాని యసంభవము లని యెంచక మోసపోవు చున్నారు. కావున జాగు సేయక వెడలుం" డని వచియింప వారు శిశువును విడిచినడువ సాగిరి. నక్క వారిమార్గమున కడ్డముఁ బోయి "ఇసుకదోఁచకున్న నొకరు చెప్పిన విని నేర్పైన నుండవలయు. రెండును లేనివారు మీవలెనే చెడుదురు. పూర్వకాలమున రఘురాముఁడు చచ్చినబ్రాహ్మణకుమారుని బ్రతికింపలేదే! సృంజయునికుమారుఁడు మృతినొంద వానిని నారదుండు బ్రతికించి పుణ్యముఁ గట్టుకొనలేదే! చచ్చిపోయినవా రందఱు బ్రతికి వత్తురని నేను చెప్పుట లేదు. చుట్టము లదృష్టవంతులైన యెడఁ గోటి కొకరు బ్రదుకు చుందురు. ఆయదృష్టము మీ కేల పట్టఁగూడదు? రండు! రండు!" అని నొక్కిచెప్ప వారు మఱలివచ్చి పాపనిశవంబు చుట్టును జేరి పెద్దపెట్టున నేడ్వఁ

వాడఁగిరి. అపుడు సూర్యుఁడస్తమించెను. చీఁకటులు నలు దెసలుఁ గ్రమ్మెను. గ్రద్ద నిరాశఁ జెంది పోయెను. నక్క మిక్కిలి సంతోషముతో నిలిచి యుండెను. గ్రద్ద రాత్రివేళ సంచరించుటకు వీలు లేదు; కావున పొద్దు గ్రుంకకముందే శవమును బాడుచుకొని తినుటకై తనలాభమే చూచుకొని వారల సాగనంపఁ బ్రయత్నించెను. నక్కకు రాత్రియెక్కువ వీలుగా నుండును; కావున పొద్దు గ్రుంకి చీఁకటి పడునంత వఱకు నీ బంధువులు నేనో యొకవంక చెప్ప యాపుటకై ప్రయత్నించెను. చిట్టచివరకు నా ప్రయత్నములు నెఱవేఱ వేఁక వీ రెప్పుడు పోవుదురా, శవము నానోట నెప్పుడు పడునా యని నక్క యుప్పొంగుచు నుండెను. అప్పుడు శ్మశానసంచారి యగు పరమేశ్వరుఁడు శంకరుడు పసవి పసవి యేడ్చుచున్న వారికడకుఁ బోయి మీరు వరము లిచ్చెద కోరుఁడని యనుగ్రహించెను. పుత్రశోకము లేకుండ రక్షించి బాలుని బ్రదికింపుమని వారు ప్రార్థించిరి. అట్లుగాక యని భక్తవత్సలుఁడు బాలునకుఁ బ్రాణదానముఁ జేసెను. పరమానందభరితులై బంధువులు గృహంబునకుఁ జనిరి. ఆఁకలిబాధచేత గదా గ్రద్దయు నక్కయు దురాలోచలు చేసి దుర్వ్యాపారంబునం బ్రవర్తిల్లెనని జాలినొంది మహేశ్వరుఁడు వాటి కాఁకలియు దప్పియు లేకుండ వర మిచ్చెను.

గాలి, బూరుగుచెట్టు.

హిమవత్పర్వతమునందు గొప్పశాల్మలీవృక్ష మొకటి యుండెను. అది మిక్కిలి ముదురుచెట్టు. కొమ్మలు పొడుగుపాటివి. మ్రాను గట్టిది. బలమైనది. వేళ్ళు నేలలోతుగా నాటుకొనియుండెను. కలహప్రియుఁ డగు నారదమహాముని యొకనాఁ డాదారినిఁ బోవుచు నచ్చట నిలిచి యాబూరుగు చెట్టుం జూచి యిట్లు పలికెను. "ఓబూరుగ! నీ వింతపొడవు వెడలుపు గలిగి యెంతో నేల నావరించి యున్నదానవు. పక్షు లెన్నో నీ కొమ్మలలో గూండ్లు కట్టుకొని హాయిగా బ్రతుకుచున్నవి. మృగములు, మనుష్యులు నీ నీడం జేరి యెండవేళ సుఖపడుచుందురు. ఇట్లు విధముల నీజన్మము లోకోపకారముగా నున్నది. కావున నిన్నొక ప్రశ్న మడుగ వేడుక పొడముచున్నది. నాజోలి నీ కెందుకనక దానికిం దగిన యుత్తరము చెప్పుము. ఎన్నో గాలివానలు వచ్చి వెళ్ళినవి. నీకన్నఁ బెద్దచెట్లు నీకన్న దృఢము లైనవృక్షములు నేలం గూలినవి. నీవు గూలకపోవుటకుఁ గారణ మేమి? వాయుదేవుఁడు నీకు దగ్గఱచుట్టమా; లేక ప్రాణమిత్రుఁడా! కాని యెడలఁ బేదదాన వగు నీజోలికి రా నని జాలిచేత వాయుదేవుఁడు ప్రతిజ్ఞఁజేసెనా? నీవృత్తాంత మేమో నాకు సవిస్తరముగఁ దెల్పి నావేడుకఁ దీర్ప వలయునని కోరుచున్నాఁడను."

అనవుడు బూరుగచెట్టు గర్వమున నారదున కిట్లనియె. “మునీంద్ర! వాయుదేవుఁడు నాకు బంధుఁడుగాఁడు. స్నేహితుఁడు గాఁడు. నామీఁద జాలిచేత నన్నతఁడు విడువలేదు. నన్ను విడువుమని చేతులు జోడించి యతనిని నేను వేఁడుకొనలేదు. నే నట్లు వేఁడుకొనుదానను గాను. వాయువు నాశ్రయించి దాని కాళ్ళు పట్టుకొని దాని దయచేత బ్రతుకవలసిన యవసరము నాకు లేదు. నాకంటె వాయువు మిక్కిలి బలహీనుఁడు. నాలోఁ బదునెనిమిదవయంశమున కైనను వాయుదేవుఁడు పోలఁడు. నాబల మెక్కడ? అనిలదేవుని బల మెక్కడ? అతని చేత నైనపక్షమున నన్నిపాటికే నేలఁ గూల్చివేయును. చేతఁ గాక యూరకున్నాఁడు” అని సగర్వముగఁ బలికిన బూరుగు మాటలు విని నారదముని నవ్వి “ఓశాల్మలీవృక్షమ! ఏమిబింక పుమాట లాడుచున్నావు! వాయుదేవునిశక్తి నీవెఱుఁగ వని తోఁచుచున్నది. మహాపర్వతములు సైతము పెద్దగాలిపెట్టునకు నిర్మూలింపఁ బడఁ గలవు. అట్టియెడ నీవంటి యొకచెట్టు లెక్కయేమి? కావున నీ గర్వోక్తులు కట్టిపెట్టి వినయముగ బ్రతుకు” మని హితోపదేశముఁ జేసెను. నావుడు వానిపలుకు లాలకించి శాల్మలితరు విట్లు ప్రత్యుత్తర మిచ్చెను. “నారద! ఎఱుఁగనివాఁడ వెఱుఁగనియట్లుండక యూరక యిట్లు పలుక నేల? గాలిదేవర నాజోలికి రాకపోవుటచేఁ దనపరువు దక్కించుకొనుచున్నాఁడు. ఒక్కసారి నామీఁదికి వచ్చెనా వాని గర్వభంజన మగును. వెనుకటి పేరుప్రతిష్ఠ లన్నియు నశిం

చును. అందుచేతనే చూచి చూచి నాపైకి రాఁడు." అట్లు పలుకుచున్న భూరుహముగర్వోక్తులు విని నారదుఁడు వెండియు నిట్లనియె. "ఈబిరుసుమాటలు మరచిపోకుము. నీబీరము లన్నియు వాయుదేవునికిఁ దెలియక పోవు. అతఁడు నీమీఁదికి రాకపోఁడు. వచ్చినప్పుడు ధైర్యము చిక్కఁబట్టి నిలువుము." అని యచ్చోటు వాసి యామహర్షి తరలిపోయి తిన్నఁగా వాయుదేవునియొద్ద కరిగి తనకును శాల్మలీవృక్షమునకు జరిగిన వృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు చెప్పెను. అది విని వాయుదేవుఁడు మండిపడి కోపవశంబున నోఁగలేకుఁగక తిన్నఁగాఁ జెట్టుకడకుఁ బోయి తిరస్కారభావముతో దానిఁ జూచి యిట్లనియె. "ఏమే బూరుగా! నీవు మహాధైర్యశాలి వఁట! పర్వతములకంటె బలమైనదాన వఁట! ఇంతదాన వని యెన్నఁ డెఱుఁగ నైతిని. ఎప్పటినుండి నీ కింత బలము వచ్చె? కల్పవృక్షముల కెల్ల గొప్పదానివలెఁ గన్పడుచున్నావు. నీ తల బిరుసెక్కినది. చేటుకాలము వచ్చుటచేత నీవిట్లు వ్రేలుచుంటివి. నీలో నేను పదునెనిమిదవయంశమునకు నైన బోల నని నారదునితోఁ జెప్పితివఁట! ఒకనాఁడు బ్రహ్మదేవుఁ డీమార్గమునం బోవుచు డబ్బాటుగ నీ నీడను నిలిచె. బ్రహ్మదేవుఁడు నిలుచుటచేత మిక్కిలి పావన మైనదాన వని గౌరవముచే నీజోలికి రాక నిన్ను విడిచితిని గాని నీబలమున కోడి గాదు. నీశక్తికి జంకి కాదు. దయఁ దలఁచి విడుచుటచేత నీ విట్లు తెగనీల్గుచుంటివి. రే పీ పాటికి నీ యవస్థ యెట్లుండునో

చూచుకొనుము. కాచుకో. ఱేపటియుదయమునఁదప్పక వచ్చెద" నని కఠినోక్తులు పలుకు వాయువుం జూచి బూరుగు చెట్టు మునుపటికంటె నెక్కువ గర్వముతో నీతెఱంగున భాషించెను. "ఓహోహో! నీ బెదరింపుల కిక్కడ బెదరువారు లేరు. అన్ని చెట్లవంటిదాన ననుకొని నన్ను జడిపించుచున్నావు కాఁబోలు. నీ వెఱ్ఱియాగడము లిక్కడ సాగవు. పాతాళలోకము వఱకు వేళ్ళు నాటుకొనియున్న శాల్మలీవృక్షమును నేను. చూడు నా దెబ్బ. నీవు కాదు. నిన్నుఁ బుట్టించిన జేజేలు వచ్చినను భయపడుదానను గాను. ఱేపు వచ్చినను భయపడుదానను గాను. రేపు వచ్చినను సరె. ఇప్పుడువచ్చినను సరే. 'వినాశకాలే విపరీతబుద్ధి' యనునట్లు నీవు చెడిపోవుకాలము వచ్చినది" అట్లు పలికిన బూరుగు తేలికమాటలను మనంబున మిక్కిలి కోపించి మరునాఁడు విజృంభించి దానిని నిర్మూలనముఁ జేయ వచ్చునని తలంచి మారుతుఁ డరిగెను. అతఁడు పోయిన తరువాత వృక్షము పశ్చాత్తాపము నొంది తనలో నిట్లు విచారింపఁ దొడఁగెను. "అయ్యయ్యో! నా యంతరమును మారుతునియాంతరమును నెఱుఁగక మహాబలుఁడగు వాయుదేవునితోఁ బంతగించి యిచ్చవచ్చిన తెఱంగునఁ బేలితిని. అతనిధాటికి నే నాఁగఁ గలనె? గడ్డపాఱలు గొట్టుకొని పోవుచున్నప్పుడు గడ్డిపఱకలు నిలుచునా? కులశైలములను గూల్పఁజాలిన గాలిదేవునెదుట నే నేమి, నిల్చు టేమి! నారదమునితో నేల బింకములు పలికితిని? వాయు వన్నట్లు నాకు చేటుకాలమే వచ్చి

నది. అయిన నిప్పుడు విచారించి యేమి చేయుదును. చెడిన కార్య మెట్లో కూడదీసికొన వలయును. వాయుదేవుఁడు వచ్చి నన్నేమి చేయును. కొమ్మల విఱుచును. ఆకులు రాల్చును. ఆపని నేనే చేసి వాయుదేవున కవకాశము లేకుండఁజేసెద.” అని యారాత్రి తన కొమ్మలు తానే విఱుచుకొని తన యాకులు తానే దుల్లగొట్టుకొని, తన కాయలు తానే రాల్చుకొని మోడై యుండెను. మఱునాఁ డుదయమున వాయుదేవుఁడు వచ్చి మోడువడియున్న యాచెట్టుం జూచి నవ్వి యేమే! శాల్మలి యీగతి నున్నదానవు. నేజేయవలసిన పని నీవే చేసికొంటివి. ఇంక నేను వేఱే నిన్ను శిక్షింప నేల? నాతో విరోధము సాధించినందుకు నా ప్రయత్న మక్కఱ లేకయే నీకుండఁగినశిక్ష యైనది. ఇఁక ముందు బుద్ధిగలిగి బ్రతుకుము. తనలావు నెదిరిలావు నెఱుఁగక బీరములు పలుకువాఁడు నీవలెనె చెడిపోవు. ఇఁకమీఁద నెన్నఁ డిటువంటి తెలివి మాలిన పనులం జొరకుము. అని బుద్ధులుచెప్పి దాని మౌర్ఖ్య మునకు క్షమించి నిర్మూలింపక చల్లగ నరిగెను. దుర్బలులైనవారు ప్రబలులైనవారితోఁ గయ్యమునకుఁ గాలుద్రవ్వి గిల్లి కలహంబులం దెచ్చుకొని తనసామర్థ్యముఁ బఱులసామర్థ్యము నెఱుఁగక యిట్లె భంగపడుదురు.

నాడీజంఘునికథ

మధ్యదేశమున గౌతముండను బ్రాహ్మణుండు గలఁడు. అతఁడు చిన్ననాఁట వేదాధ్యయనముఁ జేయక దల్లిదండ్రులు చెప్పినట్లు వినక దుస్స్వభావములు మరగి ఆఱ్రిగుఁబోతయి మాంసముఁ దిని వర్ణభ్రష్టుఁడై బోయదాని నొకతె నుంచుకొని దానివలన సంతానముఁ గని నిరంతరము భోగపరాయణుఁడు గావునఁ దనకుఁ దనయుంపుడుకత్తెకు దానిబిడ్డలకు సుఖానుభవమునిమిత్తము ధనము కావలసియున్నందున దాని సంపాదించుట కయి యెన్నో యుపాయము లాలోచించెను. వర్తకము చేయుటవలన ధనము సంపాదింప వచ్చునని నిశ్చయించుకొని యామష్టబ్రాహ్మణుఁడు బేహారమునకై జనుకొందఱుకోమట్లఁ గలిసి యొక యడవిఁ బోవుచుండఁగా నొక మదపుటేనుఁగు వర్తకుల మీఁది కుఱికి తొండముతోఁ గొట్టియుఁ గాళ్ళతో నేల రాచియుఁ గోఱలతోఁ బొడిచియు, సనేకుల సంహరించెను. "పాపీ చిరాయు" వనునట్లు మష్టబ్రాహ్మణుఁడు దాని బారినుండి తప్పించుకొని కొంతద వ్వరిగి యరిగి యెట్టకేలకు విశాల మగునొక వఱ్ఱిచెట్టుకడకుఁ బోయి దాని నీడను విశ్రమించెను. ఆవటవృక్షముమీఁద నాడీజంఘుఁడను పేరుగల యొక కొంగ చిరకాలమునుండి నివసించి యుండెను. అది బ్రహ్మదేవునికి మిక్కిలి ప్రియ మయినది.

మఱ్ఱిపేడను విశ్రమించిన యా బ్రాహ్మణుం జూచి కొక్కెర "అయ్యా! మీ దేయూరు? ఎందుండి యిటకు వచ్చుచున్నారు? ఇట్లు వచ్చుటకుఁ గారణ మేమి?" యని యడిగెను. అడుగుటయు నతఁ డా కొక్కెరతోఁ దాను బ్రాహ్మణుఁ డగుటయు మ్లేచ్ఛావాసంబునం జెడిపోవుటయు ధన మార్జించు నిమిత్తము వెడలుటయు, శత్రులను మదపుటేనుఁగు చంపుటయు లోనుగాఁ గల తనవృత్తాంతము సమగ్రముగఁ జెప్పెను. అది విని యా కొక్కెర నాతనియెడ జాలిపడి యాకాశగంగలో నున్నరుచివంతమగు చేఁపం దెచ్చి పక్వముఁ జేసి యడవిలోఁ గల మంచిపడ్ల నేర్చి తెచ్చి తిను మని యాతని కిచ్చి మెత్తని చిగుళ్ళతోఁ బాన్పు రచియించి పండుకొ మ్మని చెప్పి తాను నా రాత్రి నిద్దురవోయి మఱునాఁటి యుదయమున మేల్కాంచి భూసురున కిట్లనియె. "అయ్యా! పేదతనము వాపుకొనుటకు మనుష్యునకు నాలుగు ముఖ్యకారణములు గలవు. మొదటిది బుద్ధి. రెండవది మిత్రము. మూఁడు, నాలుగులు, వెండి బంగారములు. నేను నీకు మిత్రుఁడనైతి గాన నావలన నీవు దారిద్ర్యముఁ బోఁగొట్టుకొనఁ గలవు. పనికిమాలిన పక్షి పేదతన మెట్లు పోఁగొట్టఁగల దని తలంపకుము. ఇక్కడికి మూఁడు యోజనములదూరమున మధువజ్ర మనుపట్టణము గలదు. దానిని విరూపాక్షుఁ డను రాజు పాలించుచుండును. అతఁడు జన్మముచేత రాక్షసుఁడు. కాని సద్గుణసంపన్నుఁడు. నాకు మిక్కిలి ప్రాణమిత్రుఁడు. నీ వతనియొద్దకుఁ బోయి

నాడీజంఘుని మిత్రుఁడ నని చెప్పి నీకుఁ గావలసిన ద్రవ్యమడు
గుము. సంశయింపక యతఁ డిచ్చును. నీ దారిద్ర్య విచ్ఛిన్న
మగును. మహారాజువలె నీవు బ్రతుకవచ్చును.'' అని బకము
పలుకుటయు విప్రుఁడు మిక్కిలి సంతోషించి బయలుదేఱి
కొంగ చెప్పిన దారిని మఘువద్రపురమునకుఁ జని, రాక్షసరాజు
దర్శనముఁ జేసి కొక్కెర తన్ను పంపె నని చెప్పెను. అతఁడా
నేల వేలుపును దేఱి చూచి "యితని వాలకముఁ జూడ నధమ
బ్రాహ్మణుఁడు వలెఁ గనఁబడుచున్నా" డని తనలోఁ దలంచి
బ్రాహ్మణుని పూర్వవృత్తాంత మడిగి తెలిసికొని తా నను
కొన్న దంతయు నిజముగ గ్రహించి దుష్టబ్రాహ్మణుఁడై
నను తన మిత్రుగ పంపున వచ్చుటఁ జేసి యతనిని సత్కరింపఁ
దగు నని నిశ్చయించుకొని వేదవేత్తలైన బ్రాహ్మణులతోఁ
గలిపి సంతర్పణము సేసి, ధనము, బంగారము, రత్నములు
మొదలగునవి విశేషముగా నిచ్చి యతఁడు భోజనముఁ జేసిన
బంగారుపళ్ళెముఁ గూడ నతని కిచ్చి, విలువగల క్రొత్త బట్ట
లిచ్చి ప్రీతిపూర్వకముగ సత్కరించి పంపెను. బ్రాహ్మణుఁ
డా ధనభారము మోయలేక మోయలేక మెడ, వీపు, మూ
పులు నొప్పులు పట్టునట్లుగ మోసి తెచ్చి యెట్టెటో తన
మిత్రమగు కొక్కెర యున్నమఱ్ఱికడకుఁ బోయెను. అట్లు
ధనము మోయుట చేతను, మార్గాయాసముచేతను మిక్కిలి
డస్సి వచ్చిన యాబ్రాహ్మణునిం జూచి కొక్కెర మిక్కిలి
జాలిపడి తన ఱెక్కలతో వాని యాయాసము బోవ విసరి

చేఁపలు పండ్లు దెచ్చి యిచ్చి పానుపు సమకూర్చి నిదురింపుచ్చి తానును నిద్రించెను. అది నిద్రించుటఁ గని యా పరమదురాత్ముఁడు తనలో ‘‘నేఁడు కడుపు నిండినది. రే పుదయమున బయలుదేఱి పోవునప్పుడు దారిలో నాకాహార మెక్కడ లభింపఁగలదు. ఈకొంగ క్రొవ్విననది దీని శరీరమునందు మాంసము విశేషముగాఁ గలదు. దీనిం జంపి మాంసము ప్రయాణము నిమిత్తము సంగ్రహించెద’’ నని తలంచి పాపనిశ్చయుఁడై బట్ట బిగియఁగట్టుకొని దుడ్డుకఱ్ఱ చేతఁబట్టుకొని చెట్టెక్కి మెడమీఁద వక్షముమీఁద గొట్టి కొక్కెరం జంపి దిగివచ్చి యీకలఁదీసి పొఱవైచి కోసి, మాంసము సంగ్రహించి తెల్లవారినతోడనే ప్రయాణ మైపోయెను. అచ్చట విరూపాక్షుఁడు కొన్ని దుశ్శకునములం గని యేమి కీడుమూడునో యని విచారించుచు నిట్లనుకొనియెను. ‘‘నామిత్రుఁడగు నాడీజంఘుఁడు ప్రతిదిన మిచ్చటి కీపాటికి వచ్చుచుండును. ఇప్పటికి జాము ప్రొద్దెక్కినది. రాకపోవుటకుఁ గారణ మేమి చెప్పుమా ? పాపకర్ముఁడైన యాబ్రాహ్మణుఁ డేమియుఁ జేసియుండఁడు కదా? వాఁ డట్టివాఁడే. నామనస్సు కీడు శంకించుచున్నది. ఏమి దైవమా’’ యని విచారించి సేవకులం బిలిచి పక్షివార్త యేమయ్యెనో తెలిసికొని రమ్మని పంపించెను. వారును జని పులుగుం గానక మాంస మొలిచినదాని డొక్కం గని రాజునకు సమర్పింప నంత నాదురాత్ముని పట్టుకొ మ్మని యానతిచ్చెను. మెఱికలవంటి రక్కసులు పరుగు పరుగునం జని మార్గమధ్య

మునఁ బరమనీచుఁ డగు నాబ్రాహ్మణునిం బట్టుకొని విఱిచి కట్టి విరూపాక్షునికడకుఁ దెచ్చిరి. "ఈదురాత్ముని జంపి మీ రెల్ల భక్షింపుఁ" డని యారాక్షసులకు విరూపాక్షుఁ డాజ్ఞ నిచ్చెను. అప్పుడు రాక్షసులు కన్నులు మూసికొని చేతులు జోడించి "స్వామీ! మేము నరమాంసము తినునట్టి రాక్షసులమే కాని యెంతటిరాక్షసుల మైనను మే మీ దురాత్ముని మాంసముఁ దినఁ జాలము. తన కుపకారము జేసిన వానిని జంపిన పరమనీచుని ముట్టఁగూడ" దని విన్నవించుకొనిరి. అనవుడు విరూపాక్షుఁడు "మీరు తినుండు, తినక పొండు! ఈదురాత్ముని నాయెదుటకుఁ దీసికొని రా వల" దని పలికి పెడ ముగముఁ బెట్టుటయు దానవులు వాని నూరిబైటకుం గొంపోయి కొఱత వేసి మేను ముక్క ముక్కలుగఁ గోసి మాంసము కుక్కలకుం బాఱవైచిరి. కుక్కలామాంసమును వాసన జూచి ముట్టక దూరముగాఁ దొలఁగి పోయెను. కృతఘ్నునిమాంసము కుక్కలకు ముట్టవుగదా! అనంతరము విరూపాక్షుఁడు బ్రాహ్మణుండు మాంసముఁ దీసికొని పాఱవైచినకొంగడొక్క తెప్పించి దాని కగ్నిసంస్కారముఁ జేయించెను. అపుడు దేవేంద్రుఁ డక్కడకు వచ్చెను. విరూపాక్షుఁ డతనిం జూచి నామిత్రుఁ డగు నాడీజంఘుని నా కిమ్మని యడిగెను. అప్పు డింద్రుఁ డి ట్లనియె. "నీమిత్రుఁడు బ్రహ్మదేవునికి మిత్రుఁడు. ఇతని మరణంబున కతఁ డెంతో యుత్తలపడు చుండును నీవు నీ మిత్రుని కగ్నిసంస్కారముఁ జేయించితివి.

ఇది మంచి పని. శ్మశానమునందు నీమిత్రునిచితివద్ద కొక్క-యావు వచ్చి దూడకు పాలిచ్చెను. పాలనురుగు దూడ నోటిమీఁదినుండి గాలికిం జెదరి చితిపైఁ బడెను. వెంటనే నాడీజంఘుఁడు బ్రతికి శరీరముతో మరల వచ్చెను. ఇది బ్రహ్మదేవుని మాహాత్మ్యము. అని యింద్రుఁడు చెప్పుచుండఁగానే నాడీజంఘుఁడు విరూపాక్షుని దగ్గఱకు వచ్చి దర్శించెను. విరూపాక్షుఁడు పరమానందభరితుఁడయ్యెను. నాడీజంఘుఁడు పరమదయాళు వగుటచేఁ దన కారణమునఁ జచ్చి పాశబద్ధుఁడై నరకమునకుం గొనిపోఁబడుచున్న బ్రాహ్మణునిదుర్దశకు విచారించి వానిని బ్రతికింపు మని యింద్రుని ప్రార్థించెను. పక్షియోగ్యతకు సంతోషించి యింద్రుఁ డట్లు బ్రాహ్మణుని బ్రతికించెను. విరూపాక్షుఁ డిచ్చిన సొమ్ము మోసికొని బ్రాహ్మణుఁడెప్పటియట్ల తనయింటికిం జనియెను. కృతఘ్నత మహాపాతకమనియు మిత్రద్రోహ మంతకంటె దారుణపాతక మనియు నీకథవలన మనము దెలిసికొన వలసినఫలితార్థము.

*

—చిరకారి—

గౌతముఁడను నొక బ్రాహ్మణుఁడు గలఁడు. అతని కొక్కఁడే కొడుకు. ఆకుమారుని పేరు చిరకారి. ఎవ్వరే కార్యముఁ జేయుమని యతనితోఁ జెప్పిననాఁడు చిరకాలము మిక్కిలి విచారించి పిమ్మట నా కార్యముఁ జేయును. అందుచేత నతనికి చిరకారి యని పేరు గలిగెను. తండ్రి యొకనాఁడు చిరకారిం బిలిచి "కుమారా! నీ తల్లిఁ జంపివేయుము. నేను సాయంకాలము తిరిగి వచ్చునప్పటికీ పనిఁ జేయవలయు" నని యాజ్ఞాపించి తన పనిమీఁదఁ బోయెను. చిరకాల మాలోచించి కాని యే కార్యమునుఁ జేయని వాఁడగుటచే చిరకారి దీర్ఘవిచారసముద్రమందు మునిఁగిపోయి యెటుఁ జేయఁజాలక చింతింపఁ జొచ్చెను. ఉయ్యాలలోఁ గూర్చున్నవానివలె వాని మనస్సు ముందునకు వెనుకకు నూఁగసాగెను. "తండ్రియాజ్ఞ మీఱఁ దగునా! కావున జనకుని పనుపు చేసెద" నని యొకమాఱు తలంచెను. ఛీ! ఛీ! కోపావేశమున శరీరము మఱచి తండ్రి యేదో చేయఁగూడనిపని చెప్పినంతమాత్రమున మాతృజీవితం జంపఁ దగునా యని వేఱొకమాఱు తలంచెను. జనకుని యాజ్ఞ మీఱుట మహాపాతకము కాదా యని యింకొకసారి తలపోయును. అమ్మో! తల్లిని నఱుకుట

మాతృవధ మహాపాతకము కాదా యని మఱియొకమాఱు తలపోయును. అయ్యో! కుమారుఁడన్నివిధములచేత స్వాతంత్ర్యము లేనివాఁడుకదా యనియు నాబుద్ధి నే నుపయోగించి నాయిచ్చవచ్చినట్లు నేఁ జేయఁగూడదా యనియు నాతఁ డెడనెడ దలంచెను. ఈవిజ్ఞాపలోఁబడి మరల నీవిధముగఁ జింతించెను. తండ్రిమాటచేసి తల్లిని వధింతునా, తల్లిని రక్షించుకొఱకుఁ దండ్రిని తిరస్కరింతునా? తల్లి జన్మకారణముగదా! ఎట్లు చంపుదు. తల్లి పెంచినది కదా? తండ్రిమాత్రము కని పెంచలేదా? ‘‘ఆత్మావై పుత్రనామాసి’’ యను వేదవాక్యప్రకారము తండ్రియే పుత్రరూపమున మరల జన్మించుచున్నాఁడు. నేను చేయుట యనఁగా నతఁడు చేయుట. తండ్రి యాజ్ఞ జేసినవానికి సమస్తపాపములు నశించు నని పెద్దలవలన వినియుంటి. తండ్రియే తపము. తండ్రియే ధర్మము తండ్రియే విద్య. తండ్రియే దైవము. తండ్రికిమించిన విద్యలు లేవు. అతనిని మించిన దేవతలు లేరు. అతని కిష్టమైనకార్యముఁ జేసిన దేవతలందఱు సంతోషింతురు. తండ్రివలె తల్లిమాత్రము కాదా? ‘‘నమాతుః పరదైవతః’’ వ్యాసు మాటలబద్ధములా? కాలుసేతులు, ముక్కు, చెవులు, నోరు, కనులు మొదలగు నవయవంబులతో నిండిన యీ స్థూలదేహము నకు మాతగాక కారణ మెవ్వరు? అదియునుగాక దుర్భరమయిన గర్భఖేద మనుభవించి ప్రసవవేదనలఁ పాలై కనిపడరాని యిడుమలం బడి

హేయము లేనియుపచారములం జేసి, పెంచినతల్లిని మఱచు టెట్లు? తండ్రి బిడ్డనవ్వుచున్నప్పు డెత్తుకొని ముద్దాడునేకాని మలమూత్రంబులలోన పొరలుచున్నప్పుడు దరికిరాఁడు. ధనము సంపాదించి యిచ్చునేగాని యన్నము స్వయముగాఁ బెట్టఁడు. నీరు పోయఁడు. బిడ్డతోఁ బడుపాటులన్నియుఁ దల్లియేపడును. అందుచేతఁ దల్లిదండ్రు లిరువురిలోఁ దల్లియే యధికురాలని ధర్మ శాస్త్రంబులు చెప్పుచున్నవి. చిన్నవాఁడైనను ప్రౌఢవయస్కుఁడైనను ముసలివాఁడైనను కొడుకు తల్లికి సమానుఁడే. ప్రేమ మెప్పుడు నొక్కటియె. కొడుకు గ్రుడ్డియగుఁగాక! చేర డేసి నేత్రములు గలవాఁడగుఁగాక! మూఁగ యగుఁగాక! మహావక్తయగుఁగాక! చెవిటియగుఁగాక! మంచిశ్రోత్రములు గలవాఁడగుఁగాక, రూపసి యగుఁగాక, కురూపి యగుఁగాక! ధనికుఁడగుఁగాక. పేదయగుఁగాక సుగుణుఁడగుఁగాక, దుర్గుణుఁడగుఁగాక! పండితుఁడగుఁగాక! పామరుఁడగుఁగాక, తల్లికి కుమారునియందు ప్రేమ యొక్కవిధముగనే యుండును. ఆకొడుకే తల్లి కానందహేతువు. అతఁడే స్వర్గము. అతఁడే మోక్షము. అతఁడు లేనిచో నామెకు లోకమే లేదు. బ్రతుకే లేదు ఇది మనుష్యులయందే కాదు. పశువులు పక్షులు మొదలగు క్షుద్రజంతువులయందు నయితము మాతృప్రేమ మిక్కిలి స్పష్టముగఁ గనఁబడు చుండును. ఎప్పుడు తల్లి మృతి

నొందునో యప్పుడే మనుష్యులకు సమస్తము పోవును. అప్పుడే బిడ్డఁ డసమర్థుఁ డగును. అప్పుడే దుఃఖితుఁ డగును. అప్పుడె జగము శూన్యమై తోఁచును. భాగ్యవంతునకుఁ బేదకుఁ దల్లి వలన లాభము సమానమే. అట్టి తల్లిం జంపుట పాపసముద్రములో మునుఁగుట. నరకమునకు మెట్లు పెట్టుకొనుట. కావున నీమె నే నెట్లు చంప నోపుదు? కటికవాఁడైన నట్టిపనిఁ జేయునె?" యని విచారించుచు నెంతకుం దెంపు లేక యేపని జేయక హేతువాదము సేయుచుండు నంతలఁ సాయంకాల మయ్యె. తండ్రియు మిక్కిలి పశ్చాత్తాపము నొంది "అయ్యో! తల్లిని నిష్కారణముగఁ జంపుమని యాజ్ఞాపించి వచ్చితి. పితృవాక్య పరిపాలనమే పరమ ధర్మమని యీపాటి కతఁడు మాతృవధము జేసి యుండఁడు గదా? యెఱుఁగక పోయి చెప్పితిని. 'ప్రమాదో ధీమతామపి' యనుమాట నాయందు సార్థకమైంది." అని కన్నుల నీరు పెట్టుకొని మరల తన కుమారునిం దలంచి వాఁడు చిరకారిగదా! త్వరపడి యేకార్యముం జేయఁడు. కావున నే జెప్పినంతమాత్రమున నీ దుష్కార్యమునకు దొరకొనఁడని ధైర్యము దెచ్చుకొని, వినవిననడచి పర్ణశాలకుం బోయెను. అతనిం జూచినతోడనే చేఁతనున్న యాయుధము దూరముగఁ బాఱవైచి, చిరకారి యెదురుగాఁ జని తండ్రి పాద

ములపయిం బడి నీ యాజ్ఞ నెఱవేర్పనైతి. మహాపరాధముఁ జేసితి క్షమింపుమని వేఁడుకొనెను. భార్యయు నమస్కరించి ప్రక్క నిలువంబడెను. గౌతముఁడు కుమారుని లేవనెత్తి భార్య బ్రతికియున్నందునకు సంతోషించి యిట్లనియె. "పుత్రక! నేను రోషావేశంబున నిచ్చిన యాజ్ఞ పాటింపక యుంటివి. మే లయ్యె. నీవు చిరకారి వగుట నా కప్రతిష్ఠ కలుగకపోయె; నా తపంబు నిందంపాలు గాకపోయె. ముని జనంబులలో నా కపయశంబు రాకపోయె. పరమేశ్వరుఁడు మనపాలిట నున్నాఁడు. నాయాజ్ఞ నెఱవేర్పనందుకు నీవు విచారింపకుము." అని మొదట తాను విడిచిన దుఃఖబాష్పము లానందబాష్పములుగా నతఁడు దారాపుత్రులఁ గలిసి సుఖంబుండెను. దుష్కార్యముఁ జేయుమని తండ్రి చెప్పినను, గురువు చెప్పినను జేయఁగూడ దని యీకథా ఫలితార్థము.

మరణకారణము.

గౌతమి యనునొక బ్రాహ్మణస్త్రీ కలదు. ఆమె కుమారుఁడు పాముకఱచి మృతినొందెను. ఆమె జ్ఞానసంపత్తి గలది. జ్ఞానమెంత యున్నను బిడ్డబంధుమరణమువలన దుఃఖము రాకమానదు. ఆ కారణమున గౌతమి చచ్చిపడియున్న కొడుకుంజూచి కన్నీరు కాలువలు గట్ట నేడ్చుచుండ నొకబోయఁ వాఁడు దారిం బోవుచు నామెదుఃఖకారణ మెఱిఁగి యాపాముం బట్టుకొని త్రాటితోఁ గట్టి గౌతమి కడకుఁ దెచ్చి “యవ్వా! దీని నేమిసేయు మందువు. ఈపాడుపాడపామువలన నీకుమారుఁడు మృతినొందెను. దీని నేమిసేయు మందువు? దుడ్డుకఱ్ఱలతోఁ దల చితుకఁ బొడుతునా? కత్తితో రెండుముక్కలుగ నఱకుదునా?” యని యడిగెను. కిరాతుఁడుఁ దనయెడఁ గల్గిన యభిమానమునకు సంతోషించియు వాఁడు చేయఁ దలంచిన పని తనమనమునకు సరిపడనందున గౌతమి “అన్నా! యీ పామును విడిచిపెట్టుము. దానిజోలి మన కేల” యని ప్రత్యుత్తర మిచ్చెను. అనవుడు బోయ యచ్చెరువడి “యీపాము నీ కుమారునిం జంపినది. దీనిం జంపవద్దనెద వేమి” యని యడిగెను. అందుకు గౌతమి యిట్లనియె,—“విధివశముచేత వచ్చినయాపదలను భరింపలేక మూర్ఖులు దుఃఖ సముద్రమున

మునిఁగిపోవుదురు. జ్ఞానులు కారణమూలం దెలిసికొని దుఃఖసాగరమున మునిఁగిపోక దేలుచుందురు. అదియునుఁ గాక సీపామును జంపినమాత్రమున నా కుమారుఁడు బ్రతుకునా? దీనిని జంపుట వ్యర్థము కావున విడిచిపుచ్చుము" అనవుడు నాకిరాతుఁడు నామనసు మిక్కిలి మండుచున్నది. నీవేదాంతములు నాకు సరిపడవు. నిష్కారణముగ బాలుని ప్రాణములు దీసిన దుష్టజంతువును జంపవద్దనెద వేమి? ఇది వెఱ్ఱికాని వేదాంతముకాదు. దీని నెట్లును జంపక మాన. దుష్టజంతువుల నవశ్యము వధింప వలయు. గోవులు మొదలగు సాధుజంతువుల మీఁద దయఁ జూపవలెను. కాని పాములు, తేళ్ళు, పెద్దపులులు మొదలగు క్రూరజంతువుల పైకృపఁ జేయుట ధర్మము గాదు. ఇది ధర్మవిరుద్ధము. లోకకంటకుఁ డైనవృత్రాసురుని మహేంద్రుఁడు చంపఁడె? సర్వజ్ఞుఁ డైనమహేశ్వరుఁడు దక్షునియాగము ధ్వంసము చేయ లేదే? బ్రహ్మవంశజు లైన రావణాదిరాక్షసులను రాముఁడు వధియింప లేదె? దుర్జనులను దుష్టజంతువులను నాశ మొనర్చినను బాపము లే" దని దానిఁజంప నుంకించుచున్న కిరాతు నుద్దేశించి గౌతమి "మేము బ్రాహ్మణులము. మావచనములు మీరు శిరసావహింపవలయును. మేము హింసజేయఁజాలము. మాకీపామువలన మహాపద వాటిల్లినను నేను చంపుచుండఁజూడఁజాల. దానిని విడిచిపెట్టి నీదా

రింపుమని యాతఁ డెంత జెప్పినను వినక సర్పవధదీక్ష వహిం
చియున్న యాతనితోఁ దనప్రాణసంరక్షణార్థమై పామిట్లనియె.
“నే నేమి తప్పు చేసితిని. ఎవరు దోషులో యెవరు దోషులు
కారో నీవు చక్కఁగా నెఱుఁగుట లేదు. నేను మృత్యుప్రేరణము
చేత వచ్చి యీ బాలుని గఱచితిని గాని, నాకీబాలునిపై రోష
ము లేదు. మాత్సర్యము లేదు. కావున నా తప్పు లేశమును లేదు.”
ఆపలుకులు విని బోయ యిట్లనియె. “మృత్యువునకు నీవు సాధ
నమవగుటచేతనే నిన్ను ముఖ్యముగాఁ జంపవలయు. ఎన్ని
మృత్యుసాధనములు నశించిన లోకమున కంత మేలుకదా ?”
యన సర్పమిట్లనియె. “కుండఁ జేయుటలో ముఖ్యకారణము
కుమ్మరి. అట్లే మరణము సేయుటకు మృత్యువు ముఖ్యకారణము
కుమ్మరి వానికి సారెయుఁ గోలయు సాధనములైనట్లు మృత్యు
వునకు నేనును నావంటివారును సాధనము లగుచుందుము. ఇది
నాశక్యమయిన పని గా” దనుచుండ బోయ దానికిట్లనియె.
“బాణము వేయువానిది తప్పుగాని, బాణము తప్పు కా దని
బాణమును ఖండింపక యూరకుండువట్టి వెంగలి యెందైన
గలఁడె? నీకు రోషమత్సరములు లేవని చెప్పుచుంటివి. రోష
మత్సరములుండి యపకారముచేసిన పక్షమున నందు కొంత
హేతువు కలదు. ఏమియు లేక యపకారముఁ జేయునట్టి పాప
జంతువులు బ్రదుకుట లోకాపకారము. ఎవరు పంపిన వారిపక్ష

మున వచ్చి లోకనాశముఁ జేయుచుందువు. నీయందు దయఁ బూనుట లోకులయెడల నిర్దయఁబూనుట. నిన్ను బ్రదికించుట జంతువులం జంపుట. అదిగాక మీరు బాణములు, కత్తులు, కమ్మరి వారలు, మొదలుగువానివలె ప్రాణము లేని వస్తువులు కారు. మీరు బుద్ధిగల సాధనములచేత లోకమునకు మహాపద వాటిల్లు. ఇట్టిసాధనములను మొదలునీయక కదలనీయక నెక్కడ జూచిన నక్కడ నొక్కి చంపుట కర్తవ్యము.''

అని భుజంగము మాటల బలుకులు పలుకఁ జూచుచుండ మృత్యువు ప్రత్యక్షమై యిట్లాగున సంభాషించె. "ఓ సర్పము! యీబాలుని వధనిమిత్తమై నిన్ను నేను పంపినట్లే లోకజంతువుల హింసింపు మని కాలుఁడు నన్ను బంపుచుండును. ఈ చావునకు నీవు కారణముగావు. నేనును హేతువునుగాను. నాశనము సమస్తజంతువులకుం గలదు. ఏదో సాధనమున నవి నాశనము నొందవలయు. కొన్ని జంతువులు నీవంటి క్రూరజంతువులచేతఁ జచ్చు: కొన్ని రోగములచేత ద్రుంగు. కొన్ని జలముచేత, కొన్ని యగ్నిచేత, కొన్ని వాయువుచేత, కొన్ని తమబుద్ధిహీనతచేత, కొన్ని మనుష్యుఁడు కల్పించిన యాయుధములచేత కాలధర్మము నొందుచుండును. ఇది యొకనిమిత్తము కాని, జంతువులకు చావు తప్పదు. జంతువులకే కాదు. సూర్యచంద్రులకు, భూమ్యాకాశములకు, జలాగ్నులకు, వాయువునకు, మహాసముద్రములకు, మహాపర్వతములకు సైతము నాశనముకలదు.

యమునిపంపుననే జని కొన్నిటి స్వయముగాను కొన్నిటిని సాధనములచేతను నాశనము చేయుచుందును. జను లజ్ఞానముచేత నిన్నును, నన్నును నిందించుచుందురు. ఇదియెల్ల కాలునిచేష్టితమని వా రెఱుఁగరు. కాలవశమున గాని మనవశ మిందేమియు లేదు. అనవుడు బాము మృత్యువున కిట్లనియె. "నీవు చెప్పినట్లు నేను నీ ప్రేరణమున గఱచితిని గావున నావలన నేరము లేదని చెప్పుచుంటి. ఇదియెల్ల కాలుని దోషముగాని, మనదోషము కాదు. నావుడు మృత్యువు సర్పముం జూచి—"కాలునివలన దోష మున్న దని లే దని చెప్ప నే నెంతదానను. మనధర్మ మిట్టిదనియుఁ గాలునివలన మనము ప్రేరితులమైతి మనియుఁ జెప్పవలయునే గాని, దోషంబులు నిరూపించుట మనపని కాదని పలికెను. అప్పలుకులు విని పాము బోయం జూచి, వింటివా మృత్యువు మాటలు. ఇదియెల్ల నా దోష మని నీవు పలుకుచుంటివి. ఇప్పుడైనను యథార్థమరసి నన్నంటఁగట్టిన త్రాళ్ళువిప్పి నన్ను విడిచిపుచ్చు"మని వేఁడుకొనెను. బోయఁడు దానిమాట సరకుసేయక "ఓ పాపపామా! నీవును, మృత్యువును, తోడిదొంగలు. ఏవో నాలుగు పొడిమాటలు నరిది చెప్పినంతమాత్రమున నే నిన్ను విడుచుట కంతవెఱ్ఱినే? నీకు వెఱవను; మృత్యువునకు వెఱవను. నిన్ను విడువ"నని దానివధంబునందు కృతనిశ్చయుఁడై యుండ సర్పమృత్యువులు రెండును బోయ నాలోకించి నిరంకుశుఁడైన కాలునిపనుపునఁ జను

మన్న మాకు దోషము లేదనుచుండ నంతలోఁ గాలుఁడు ధర్మసందేహముం దీర్ప నచ్చటఁ బ్రత్యక్షమై యిట్లనియె. "బాలుని మరణమునకు సర్పము కారణము కాదు. మృత్యువు కారణము గాదు. నేను కారణమును గాను. అతని కర్మమే కారణము. సమస్త జంతువులు తమతమ కర్మంబుల ఫలంబులు గుడుచుచు సుఖదుఃఖంబు లనుభవించుచుందురు. ఆకర్మమే యీ బాలుని జంపెను. కర్మమే జననము కలిగించును. కర్మమే వృద్ధిబొందించు. కర్మమే నాశనమొందించును. తను గావించిన కర్మ మనుభవింపక యెవ్వనికైనం దప్పదు. తక్కిన జంతువులమాట లెక్కయేమి?" యనుచుండ నక్కాలుని పలుకులు విని గౌతమి బోయ కిట్లనియె. "అన్నా! వింటివా కాలుని పలుకులు? నేను చెప్పినట్టే యీ కాలదేవుఁడు గూడ చెప్పె. తాము చేసిన పాపఫలమె మానవులందఱుఁ గుడుచుచుందురు. తల్లిదండ్రులు చేసిన పాపకర్మము చేతనే బిడ్డలు మృతినొందుచుందురు. చేసి విచారింప నేల? కావున నీ సర్పమును విడువుము" అది విని బోయ జ్ఞానసంపన్నుఁడై సర్పమును విడిచెను. వాద ముడిగి యెల్లవారు యథేచ్ఛం జనిరి.

సప్తమహర్షులు—వృషాదర్భి.

అత్రి, కశ్యపుఁడు, గౌతముఁడు, జమదగ్ని, భరద్వాజుఁడు, వసిష్ఠుఁడు, విశ్వామిత్రుఁడు సప్తమహర్షు లనఁబడుదురు. వీరు తపోమహిమవల్ల నాకాశమున నక్షత్రరూపము ధరియించి శాశ్వతముగా నున్నారని పెద్దలు చెప్పుదురు. ఈసప్తమహర్షులు పూర్వకాలమునందు గూడ సంచరించుచుండిరి. వసిష్ఠభార్య యగు నరుంధతీదేవి మగని నెన్నఁడు విడువక నతని వెంబడి కదలిన నక్కడి కరుగుచుండును. గంట యను పరిచారిక యొకతె యరుంధతీదేవిని సేవించి యుండెను. దానిమగఁడు పశుసఖుఁడను వాఁడు సప్తమహర్షులకు నుపచారములు సేయుచు నిరంతరము వారివెంట నంటి యుండును. ఆ పదిమందియుఁ గలసి యథేచ్ఛముగ భూమండల మంతయు సంచరించుచుండ నాకాశమున వానలు లేక గొప్ప కఱవు సంభవించెను. అరుంధతీసమేతులైన సప్తమహర్షులవంటి తపోధనులు పరమపావనులు మహాత్మాలురు కాటకమువలన నింతింత యనరాని బాధ పడినప్పుడు సామాన్యమనుష్యులు లక్షోపలక్షలు కోటానకోట్లు మేరమీరిన యాఁకలిబాధ కోర్వలేక పల్లియలయందును పట్టణంబులయందును గుక్కలవలె నీఁగలం బడి చచ్చిరని వేఱె చెప్పవలయునా? ఆ ఘోరసమయమున వారు పదుగురు పేరాఁకలి

చేత మూర్ఛ వోవునంతటి దురవస్థ పాలై తినుట కేమియుం దొరకక పలువంకలం జూచిరి. చూచునప్పటికి వారి కన్నులకు శ్మశానభూమి కనుపడెను. అం దొకచితి కనుపడెను. ఆచితి మీఁద నొక్కశవము కనుపడెను. పెన్నిధిఁ గన్న పేదవలె లోకోత్తరచరిత్రులగు మహాత్ములు అరుంధతీసమేతులై సేవకులు వెంట రా మహాసంరంభితులై పరుగుపరుగున వల్లకాటికిం జని యాశవమునం దిడఁ బడియున్న ముక్కలి సమకముతోఁ గాల్చుట్టం జేరిరి. అత్తఱి వృషాదర్భి యనురాజు దైవవశమున నా దారిం బోవుచుండెను. బహుతపస్సులు ప్రకటించు బ్రహ్మతేజముతోఁ నాఁకలిచిన్నెల నూఁగిపోయిన మేనులతో పొదమూఁడునాగుటం జిక్కియున్న యాబ్రహ్మర్షులు లాతని కంటఁ బడిరి. పడుటయు నాఁడు సర్వోపదేశ యొక్కనిమనసముఁ జూచి వారిసమీపమునకుం జని నమస్కరించి వినయముఁ బడసి “మహాత్ములారా! ఏమిది? మీ రేమిచేయుచున్నా” రని యడిగెను. ఆతనికి మహర్షు లిట్లనిరి. “రాజా! ఇది మహాఘోరసమయము కదా? భూమిమీఁద పచ్చగింజ కనుపడుట లేదు. ఆఁకలి సహింపఁజాలకున్నారము. ఈశవమును భక్షించెదము.” అనవుడు రాజు నిశ్చేష్టితుఁడై ముక్కున వ్రేలు వేసికొని కొంచె మాలోచించి కిట్లనియె. “ఆహా! ఆఁకలిబాధ మనుష్యులచే నేమి చేయింపదు? క్షుధానలముచేతఁ గాలిపోవనిది లేదు. అది కడుపుం గాల్చి యూరకుండదు. సకలధర్మంబులఁ గాల్చును. సర్వనియమముల దహించును. నీతినెల్ల భస్మము

చేయును. మహానుభావులారా! యెంతదురవస్థ వచ్చెను. మీ మహామహిమ మీ రెఱుంగ రేమోగాని నేను కొంతవఱ కెఱుంగుదును. మీలో నొకఁడు విష్ణుదేవునిఁ గడుపారఁ గన్న వాఁడు. ఒకఁడు బ్రహ్మవిష్ణుమహేశ్వరుల మువ్వురకుఁ దండ్రి. ఒకఁడు కాలియందుఁ గన్నుఁజూపి ముజ్జగంబుల నాశ్చర్యరస మున ముంచినవాఁడు. ఒకండు క్షత్రియవంశనాశకుఁ డగు పరశురాముని జనకుండు. ఒకఁడు బ్రహ్మసృష్టికిఁ బ్రతిసృష్టి చేసి నవాఁడు. వసిష్ఠునిమాట చెప్ప నక్కఱయే లేదు. అతఁడు జగత్త్రయైకపూజ్యుఁడు. భరద్వాజుని మహిమ లోకవిదితమే. ఇట్టి మహానుభావు లగు మీరు రాక్షసునివలె వ్యాఘ్రాదిక్రూర జంతువులవలె మనుష్యులం దినఁ దలఁచుటయు, నందు సాదువైఁ బెట్టినపీనుఁగను బీకికొని తినఁ దలఁచుటయుఁ జూడ విధినిర్ణయ మునకు మేఱ లేదు కదా యని తోఁచుచున్నది. మీరె యిట్టి నీచకార్యము సేసిన లోకమర్యాద నిలుచునా? ధర్మములు సాగునా? మీ కాహారము లభింపదేని నాయొద్దకు రండు. అన్నము పెట్టెద. వస్త్రము లిచ్చెద. వట్టియన్నమె కాదు. పంచభక్ష్య పరమాన్నములతోఁ గడుపారఁ గుడుపుదు. వసించుటకు గృహ ములిచ్చెద. కావలయునేని నేనుఁగు లిచ్చెద. గుఱ్ఱములిచ్చెద. పశువు లిచ్చెద. పంటపొలము లిచ్చెద. ధనము లిచ్చెద. ధాన్యములిచ్చెద. కావున నతిహేయమై భయంకరమై లోక విరుద్ధమై శిష్టజనదూష్యమైన యీశవభక్షణము మానుఁడు! నామనవి వినుఁ" డని రాజు బ్రతిమాలుటయు మహర్షు లతని

కిట్లనిరి. "రాజా! మేము చేయుచున్నది హేయమనియు భయంకరమనియు లోకవిరుద్ధమనియు శిష్టజనదూష్యమనియు మే మెఱుఁగుదుము. ఎఱుఁగక యజ్ఞానముచేఁ జేయుట లేదు. చేయరానిదైనను నేఁడు దేశమున రేగియున్న గొప్పకఱవు కతమున దీనిం జేయవలసె. జంతుకోటి యాఁకలికిఁ దాళఁజాలము కదా! మానవుఁడు సైత మొకజంతువే. సాంగవేదాధ్యయనసంపన్నులైనను తపోధనులలో నగ్రగణ్యులైనను మహామహిమములకు నిధులమయినను మే మాఁకలికిఁ దక్కిన జంతువులతోఁ బాటు బానిసలమే. ఎంత యాచించిన మాకుఁ బట్టెడుపిండము దొరుకదయ్యె. జంతుమాంసము భక్షింపుదమన్న నీగొప్పకాటకమువల్ల నాహారము దొరుకక సమస్త జంతువులిదివఱకే మృతిఁ జెందినవి. అనేకయుగముల నుండి జీవించుచున్నారము కాని యింతకాటక మెన్నఁడుఁ జూచి యెఱుఁగము. విని యెఱుఁగము. ఇంద్రియముల నెల్ల జయించినారము కాని యాఁకలిని జయింపఁ జాలమయితిమి. కామక్రోధములు మొదలగు నంతశ్శత్రువుల జయించితిమిగాని, తుదకీ యాఁకలిదయ్యమునోటఁ బడితిమి. ఆఁకలి కాగలేక యన్యవస్తువులు దొరకకపోవుటచేత నీశవము నిక్కడ భక్షింపఁ దలఁచితిమి. పాపముకాని, పుణ్యముకాని, దీనిని భక్షింపక మానము. ఘటము నిలిచినపిదపఁ గలుషము మాట చూచుకొందము. ఇఁక నీ మాట నెత్తికొందము. మా కన్నవస్త్రములిచ్చెద నంటివి. ఆఁకలిబాధ తీర్చెద నంటివి. ఇది లెస్స. నీ

కభ్యుదయ మగుఁగాక ! నీమంచితలంపునకు మెచ్చితిమి. నీకు భగవంతుఁ డాయురారోగ్యములు ప్రసాదించుఁగాక ! కాని, నీ సొమ్ము మే మనుభవింపఁ జాలము. మీధనము లన్యాయార్జితములు. నిరపరాధులను దండించి దోఁచుకొని శత్రువు లని పేరు పెట్టి బహుసంఖ్య లగు జనులను వధించి సంపాదించినవి మీవిత్తములు. మీవలన దానములు గ్రహించి మేడలు మిద్దెలు గట్టుకొని సుఖించుటకంటె యడవులనుండుట మేలు. మీ రిచ్చిన యేనుఁగులగుఱ్ఱముల నెక్కి సుఖించుటకంటె కాలి నడక నే ముండ్లలో నైన నడచుట మేలు. మీ ధనములవల్ల నైశ్వర్యవంతులమై సమృద్ధిగఁ దినుటకంటె నన్నము లేక యుపవాసము చేసి మాడి చచ్చుట మేలు. వెయ్యేల? మీ సొమ్ము దినుటకంటెఁ బీనుఁగను బీకికొని తినుటయైన మేలు. ''

అట్లు సప్తమహర్షులు రాజులసొమ్ము నిందాస్పద మని నుడువుటయు వృషాదర్భి వారి కతిరోక్తులకు మిక్కిలి కోపించి కోపావిష్టహృదయుఁడై గృహంబున కరిగి వారిని వంచింప నెంచి మాయాఫలములు కొన్ని కల్పించి వానిని మంత్రుల చేతికిచ్చి "వీనినిఁ గొంపోయి మీ రా సప్తమహర్షుల కిం" డని పంపెను. మంత్రులామాయాఫలముల సంగ్రహించి యా మహామునులయొద్దకుం గొంపోయి యిచ్చిరి. మహామునులు వాని స్వరూపంబుఁ జూచియు, హస్తంబుల స్పృశియించియు నవి కృత్రిమఫలము లని తెలిసికొని యావలఁ బాఱవైచిరి. మంత్రులు సిగ్గుపడి మఱలిపోయి యావార్త రాజున కెఱిం

గించిరి. రాజు కోప మినుమడింప మంత్రవేత్తలం బిలిపించి "ఆర్యులారా! మీరు హోమంబులుచేసి కృత్తి యనురాక్షసిం బుట్టించి దానిని సప్తమహర్షులమీఁదికిం బంపుఁడు. అది వారిని జంపివచ్చునట్టు లాజ్ఞాపింపుఁ" డని యానతిచ్చెను. మాంత్రి శాస్త్రజ్ఞులు రాజుమాట దాటఁజాలక హోమంబులు చేసి కృత్తియను రాక్షసిం బుట్టించి దానిని మహర్షులమీఁదికిఁ బంపిరి. ఆసమయంబున మహర్షులు తినుటకు దుంపలు కాయలు పండ్లుగలచోటులు వెదకికొనుచు నడవులం దిరుగుచుండిరి. అప్పుడు శునస్సఖుం డనుసన్న్యాసి యొకఁడు వారిం గలిసికొని మైత్రినెఱపి వారివెంటఁ బోవ నటు పోవుచుండెను. అట్లు వారందఱుఁ గలిసి తామరతూండ్లు తిని కడుపులు నింపుకొన వలయు నని తలంచి యొక కొలనుకడకుఁ బోయిరి. ఆకొలను కట్టు వారు చేరునప్పటికి వృషాదర్భి పంపిన కృత్తి యనురాక్షసియు నచ్చోటికిఁ జేరెను. చేరి కొలను జొరఁబోవు మహర్షుల కడ్డము వోయి యేదేనివంక పెట్టి వారిని తుదముట్టింప వలయు నని వారినామధేయము లడిగెను. మహర్షులు సహజసౌజన్యముతోఁ దమపేళ్ళు వరుసగాఁ బేర్కొనిరి. శునస్సఖుఁడు తన పేరు సరిగాఁజెప్పక రక్కసికి విసుఁగు పుట్టున ట్లడ్డదిడ్డముగఁ జెప్పెను. అందు కతనిపై రక్కసి కోపించి పేరు సరిగఁ జెప్పవేమని తిరస్కారముగ నడిగెను. చెప్పు చున్నను జెప్పలే దందు వా? దురాత్మురాలా! పడుము! భస్మము కమ్మని మహాకోపమున దండముతో దానితలమీఁద వైచెను. ఆదెబ్బ

కది నేలఁ గూలి చచ్చి భస్మమయ్యెను. అనంతరము మునులు సరోవరముఁ బ్రవేశించి తామరతూఁడులు గోసి గట్టున మోపుగాఁ బెట్టి స్నానమునకై జలమున దిగిరి. స్నానములు చేసి మరల వారు గట్టునకు వచ్చునప్పటికి తామరతూఁడొక్కటి యైన లేకపోయెను. మును లొండొరుల మొగములు సూచుకొని తెల్లఁబోయిరి. ఒకరిపై నొకరి కనుమానముఁ గలిగెను. కలుగుటయు వారందఱు ప్రమాణములు చేయ సంకల్పించిరి. శునస్సఖుఁడు వారందఱికి మధ్యవర్తి యయ్యెను. అప్పు డత్రిమహాముని యిట్లు ప్రమాణముఁ జేసెను. "నేను తామరతూఁడ్లు దొంగిలించితి నేని గోవును దన్నినవాఁడు, సూర్యున కెదురుగా మూత్రపురీషములు విడుచువాఁడు, అనాధ్యాయమున వేదము జదివినవాఁడు నే దుర్గతికిఁ బోదురో యా దుర్గతికిఁ బోవుదును." అనవుడు వసిష్ఠుఁ డిట్లని యొట్టు పెట్టుకొనియె. "నే నీబిసంబులు ముచ్చిలించితి నే, వేదాధ్యయనముఁ జేయని వాఁడు, సన్న్యాసి యయ్యుండి కాముకుఁడైన వాఁడు కుక్కను వెంటఁ బెట్టుకొని యసహ్యపడక నిరంతరము తిరుగువాఁడు, పోవు నట్టిదుర్గతికి నేనుపోవుదు." మఱియుఁ గన్నకూఁతు నమ్ముకొనుట, శరణుజొచ్చిన వానిని రక్షింపక దిరస్కరించుట, దాన మిచ్చి వాఁడు దరిద్రదశఁ బొందినప్పుడు సైతము వానిని యాచించి పీడించుట, యే మనుష్యుని కే దుర్గతులు గలుగఁజేయునో నాకా దుర్గతులు గలుగుఁగాక! అంతట కశ్యపుఁ డిట్లు శపథముఁ జేసె. "వ్యర్థముగా మాంసము భక్షించుట, సభలోఁ బక్షపాతము

బల్కుట, దుర్దానములు పట్టుట, పట్టపగలు స్త్రీసంభోగ మొనరించుట, బ్రాహ్మణుడు నరకులంగొని వర్తకము చేయుట నేదోషము సంఘటిల్లునో బిసములు దొంగిలించినపక్షమున నా కాదోషము గల్గుంగాక !" యనంపడి భరద్వాజుం డిట్లనియె. "ఈతూండ్లు నేను దోచుకొంటి నేని జ్ఞాతులను, గోవులను, స్త్రీలను, క్రూరముగా హింసించుట, కార్యాతురు లయిన బ్రాహ్మణుల నుపేక్షం జేయుట, కట్టెపుల్లలతో మండుచున్న యగ్నియందు హోమముం జేయుట, గురునిరాకరణము జేసి చదువుట మొదలగు పాతకములు జేసినవారిగతి నాకుం బ్రాప్తించుం గాక !" "నే నీదొంగతనముం జేసితి నేని భార్య ముట్టయినప్పుడు దానిం గవయుట, మూత్రపురీషములు జలములో విడుచుట, స్వభావము గోనుట, మూండు దానిసొమ్ము దిని జీవించుట, యుపహారముం దైవమైరం జంపుట, చూడితో నున్న యావుం గొట్టుట మొదలగు పాతకములు జేసినవారి వలె నేనును దుర్గతికిం బోవుదు" నని జమదగ్ని శపథముం జేసెను. "ఈబిసములు నే నెత్తికొనియుండినపక్షమున వేదము వదులుకొనుట, యగ్నిహోత్రములు విడిచిపెట్టుట, శూద్రస్త్రీకి మగం డౌట, సోమలత లమ్ముకొనుట, చెడ్డగ్రామము లందు వాసము చేయుట, మున్నగుపాతకములు నేను చేసినట్లె యని గౌతముండు ప్రమాణము జేసెను. "ఈకార్యము నావలన జరిగె నేని తగినసేవకులను రక్షింపక పోవుట, తగనివారిని రక్షించుట, ధర్మాత్మునివలె కపటవేషము వేసికొని రాజుంగొల్చుట

మొదలగు పాతకములు చేసినట్లే' యని విశ్వామిత్రుఁడు ప్రతిజ్ఞ జేసెను. అప్పు డరుంధతి యల్లన నిట్లనియె. 'ఉత్తమామల నెల్లప్పుడు దిట్టినదానికి, పెనిమిటికి మోస దురాలోచనములు చేసినదానికి, ఒక్కతె కూష్మాండి పరమాన్నము దిన్నదానికి నెట్టిదుర్గతి కలుగునో నా కట్టిదుర్గతి కలుగును.' అనవుడు జనత్ర మంతయు బానిసతనముననే గడపుచున్నదనగంద యిట్లు ప్రతిజ్ఞఁజేసె. 'ఎంటి శేపినయాఁకుది ముంగుగా భుజించుట, సరిగాఁ బని చేయకపోవుట, బొంకులు పలుకుట, కూఁతుర నమ్ముకొనుట, సజ్జనుల కెగ్గు సేయుట మొదలగుదుర్గతిఁ దెమ్మనో యాతూండ్ల దొంగిలించినను గూడ నట్టి దుర్గతిఁ జెందుఁగాక!' ఏమ్మటి దానిమగఁడగు పశుసఖుఁడు మునులవంక తిరిగి, యాతూండ్లు ముట్టిచ్చిలించినవాఁడు సంతానము లేనివాని వలెను, గర్భదాసునివలెను. దరిద్రపిశునివలెను, సకల దుఃఖంబు లనుభవించుఁగాక' యని యొట్టుపెట్టుకొనియె. అట్లచట నున్నవా రందఱుఁ దనవంక దిరిగి ఘోరశపథాంబులు చేసినపిదప శునస్సఖుఁడు తానును ప్రమాణముజేయఁ దలఁచి యిట్లనియె. 'నేబిసములు దొంగిలించితి చేని వేదాధ్యయన సంపన్నునకైనను యజ్ఞములుచేసినవానికైనను దన కూఁతునిచ్చి యానందముగఁ బెండ్లి చేసినట్లే' యనిన మహర్షులందఱు విస్మితులై యిదియేమి మంచివిషయములంగూర్చి శపథముఁ బట్టుచున్నారే? దీనింబట్టిచూడ నీవే తూండ్లు దొంగిలించితివని తెలియుచున్నది. ఆఁకలికి తాళఁజాల కున్నాము. బాధ

పెట్టక సత్వరము మమ్ముని పల్కిరి. పలుకుటయు శునస్సఖుండను సన్న్యాసి యిట్లనియె. “మీ రన్నది సత్యము. మీ రొండొరుల నేమె మందురో వినుటకై యిట్లు చేసితిని. నేనే యీతామరతూండ్లు మ్రుచ్చిలించితి. వృషాదర్భి యను రాజు మీపైఁ బగఁబూని మిమ్ము జంపుటకై కృత్యయను రాక్షసిం బంచె. అది మిమ్ముఁ గడతేర్చునను భయంబున సన్న్యాసివేషముఁ బూని వచ్చిన వాఁడ. నేను దేవేంద్రుఁడ. ఇవిగో మీ తామరతూండ్లు. గ్రహించి భక్షింపుఁడు. మీపుణ్యవ్రతములచేత మీకుత్తమపదప్రాప్తి గలిగె. ఎగసి యాకాశమునకు రండు. అక్కడ చుక్కలై మెఱయుచుండుఁడుగాక !” యని పల్కుటయు మహర్షు లింద్రునితోఁ జని యాకాశంబున నక్షత్రరూపములు ధరించి దేదీప్యమాన ప్రభావంతులై వెలయుచుండిరి. రాజు వలన దానము గ్రహింపనివారికి కీర్తి మహోన్నత దశ ప్రాపించె. ఎవరివలనను దానము గ్రహింపక స్వాంత్రజీవనము సేయుట సర్వోత్తమము.

క్షత్రబంధుఁ డనునొక రాజు కలఁడు. అతఁడొకనాఁ డెక్కడకోఁ బోవు చుండ భయపడుచు నొదిగి వెళ్ళు చున్న యొక మాలవాఁడు వానికంటఁ గనుపడెను. అతఁ డామాలనిం బిలిచి ‘ఓయీ ! యిట్లు నీ వొదిగి తొలఁగి చనుటకుఁ గారణం బేమి ?” యని యడిగెను. అనవుడు మాలవాఁ డిట్లనియె. “అయ్యా ! అది యొక బ్రాహ్మణునిపొలము. బ్రాహ్మణుని పొలముమీఁదినుండి గాలి కెగిరి వచ్చు మంటిరేణువులు నా

మీఁదఁ బడునేమో యనుభయమున నేనుదూరముగఁ దొలఁగి చను చుంటిని." అనవుడు రాజు "బ్రాహ్మణక్షేత్రమునుండి గాలి కెగిరినమంటిరేణువులు మీఁద పడిన నష్ట మేమి" యని మరల నడిగెను. చండాలుఁ డతని కిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "మహాప్రభు ! నేను పూర్వమొక బ్రాహ్మణ కుమారుఁడను; మాధుకరవృత్తిం బ్రదుకుచు స్వాధ్యాయముఁ జెప్పుకొనుచుంటిని. ఒకనాఁడు బిచ్చమెత్తి తెచ్చికొన్నయన్నము పుణ్య నదీతీరమునకుఁ బోయి తినఁదలఁచు చుండ గొప్పగాలి వీచెను. ఆనదికి సమీపమం దున్నయొకబ్రాహ్మణునిపొలము మీఁదనుండి మంటిరేణువులు దట్టముగా నెగిరి వచ్చి యన్నము పైఁబడెను. ఆఁకలి తాళ లేక నేనాయన్నముఁ దింటిని. బ్రాహ్మణుని భూమిసంబంధమయినరేణువులు పడినందుచేత బ్రాహ్మణుని సొమ్ము కొంత నాకడుపులోఁ బడినది. బ్రాహ్మణధన మపహరించుట మహాపాతకము. అందుచేత నేను మాలవాఁడనై పుట్టితిని. పూర్వజన్మజ్ఞానము నాకు గలదు. నీతోడనా విషయ మై సంవాదమిప్పు డయినది. కనుక నాశాపవిమోచన మైనది. ఇంక నేను బ్రాహ్మణజన్మ మెత్తుదును. నాకు సెల విమ్ము." అని చెప్పి వెడలి పోయెను. బ్రాహ్మణులసొత్తు మంటిరేణు వయినను సరే, గడ్డిపరక యైనను సరే యపహరించుట మహాదోష మని దీని ఫలితార్థము.

గౌతముఁడు — దేవేంద్రుఁడు.

గౌతమమహాముని వనములో సంచరించుచుండఁగా తల్లి లేని యేనుఁగుపిల్ల యొకటి యాతనికంటఁ బడెను. ఆమహర్షి జాలిచేత దానిని జేరఁదీసి పెంచఁదొడఁగెను. నానాటి కది మిక్కిలి పెద్ద దయ్యెను. ఆకాలమున ధృతరాష్ట్రుఁడను రాజు, దేశమును బాలించుచుండెను. దేవేంద్రుఁ డారాజుగా వేషముఁ దాల్చి గౌతమమహాముని కడకుఁ బోయి "మహాత్మా నీవు పెంచుచున్న యేనుఁగు నా" కిమ్మని యడిగెను. అతనికి గౌతముఁ డిట్లనియె. "రాజా! యీయేనుఁగు నాయగ్ని హోత్రమునకు సమిధలు తెచ్చియిచ్చును. నేనాశ్రమమున లేనికాలమున జాగ్రత్తతో నాపర్ణశాల రక్షించును. కనిని బిడ్డను బెంచినట్లు పెంచితిని. అదియు నన్ను దండ్రిని బ్రేమించినట్లు ప్రేమించుచున్నది. అందుచేత దీనిని నీకియ్యఁజాల." అనవుడు మాయారూపముఁ దాల్చిన దేవేంద్రుఁ డిట్లనియె. "మాకు ముక్కు మూసికొని తపము చేయు మునుల కేనుఁ గెందుకు? ఎక్కనా? సౌఖ్య మనుభవింపనా? సమిధలు తెచ్చునను కారణమున నేనుఁగుల బెంచువారు గలరె! అమూల్యము లయినగోవుల వేనవేలిచ్చెద! కావలసినంత బంగారమిచ్చెద?" అన ముని చిన్ననాట దీనితల్లి చనిపోవుటచే మిక్కిలి యక్కటికముతోఁ బెంచినాఁడ. అందుచేత మక్కువ యెక్కు వైనది!

కావున విడువఁ జాల. లక్షగోవు లిచ్చినను దీని నియ్యను. కోటివరహా లిచ్చినను దీని నియ్యను. నీరాజ్య మంతయు ధార వోసినను దీని నియ్యను. నే నీయను. మొఱ్ఱోయను చుండ నీ విట్లు సార్లఁదుగుట న్యాయమా? మాఁరుమా టాడక పొమ్ము" ఆమునిపలుకులు విని కపటవేషధారి యయినమ హేంద్రుఁడు «వాహనముచేసికొనుట కై యేనుఁగును రాజ పుచ్చుకొనవచ్చు. నీవేమిసేయఁగలవు. సామమున నేనీయకు న్న బలిమిని దీనిఁ గైకొనెద. కావున విడువు" మని రాజస మునఁ బలుకుటయుఁ దపోధని యిట్లనియె. «పుణ్యాత్ముల సంతోష మెచ్చటఁ గాంచుదురో పాపకర్ములు విచార మెక్కు డనుభవింతురో యట్టిమహాజనసభకు నిపుడు రమ్ము. అచ్చట పెద్దమనుష్యులయెదుట నీ కేనుఁగు నిచ్చెద."

అప్పుడు మహేంద్రగౌతము లీవిధమున సంభాషించిరి.

మహే—నాస్తికులును బాపాత్ములును నీచెప్పినచో టికి వత్తురు గాని నే నేల వత్తు.

గౌత—యముఁడు ధర్మాత్ముఁడు కదా! అతనియొద్ద కు రాఁగూడదా?

మహే—నే నచటికి రానొల్ల.

గౌత—అట్లయిన మందాకినీ నదీతీరమునకు రమ్ము; అచ్చట హస్తినిచ్చెద.

మహే—అతిథులు తినగా మిగిలినయన్నమును దినువా రును, దానములు గ్రహింపనివారును నక్కడికిఁ బోవుదురు నేను రాఁ జాలను.

గౌత—అటులైన మేరువనమందు నీ కేనుఁగు నిచ్చెద. రమ్ము!

మహే—అక్కడ కేగువారు సత్యవంతులు; భూతదయాపరులు. అక్కడ నా కేమి పని యున్నది. మఱియొకచోటికి వచ్చెద చెప్పుము.

గౌత—నారదమహాముని విహారస్థలమునకు రమ్ము. అది మనోహరము. కిన్నరు లచ్చట సంచరించు చుందురు.

మహే—గానవిద్యావిశారదులు, నృత్యమునందు మిక్కిలి ప్రవీణులు నివసించుచోటది. అది నా కేల.

గౌత—ఉత్తరకురుభూములు మిక్కిలి కమనీయములు. అక్కడ దేవేంద్రుఁడు కోరినకోరిక లిచ్చును. అక్కడకు రమ్ము.

మహే—కామము నుపేక్షింపలేనివారి కాచోటులు చొర శక్యములు గాని నాకుఁ గాదు.

గౌత—చంద్రగ్రహమున గజము నెత్తు రమ్ము?

మహే—దానిలోనివారు పరమశాంతులు మున్నగువారా లోక మనుభవింతురు. నా కదిచోటు గాదు.

గౌత—సూర్యుని సన్నిధానమున నీ కేనుఁగు నిచ్చెద రమ్ము.

మహే—తపస్స్వాధ్యాయనిరతులు బొందగిన స్థానమద్ది; నే నేల వత్తును.

గౌత—వరుణునిపట్టణమునకు రమ్ము; అక్కడ దంతిని నీవు పుచ్చుకొనవచ్చును.

మహా—యజ్ఞములు చేయువారు, అగ్నిహోత్రములు నిలుపువారు మాత్రమే వెళ్ళదగినచోటది. అక్కడికి నేను రాను.

గౌత—అట్లయిన దేవేంద్రునిసమక్షమునకుగూరునిచ్చెద రమ్ము.

మహా—శూరులు, యజ్ఞములు చేయువారు, నక్కడికి పోవలయును గాని నే నెందుకు.

గౌత—అది యొల్లనేనిప్రాజాపత్యలోకమునకురమ్ము.

మహా—అది యశ్వమేధులస్థానము.

గౌత—అక్కడకు రా నిష్టము లేదేని గోలోకమునకు రమ్ము. ద్వీపము నందు గ్రహింపవచ్చును.

మహా—బ్రహ్మచర్యపరులు, తీర్థయాత్రలు సేవించువారు, బహుగోదానములు గావించినవారు నచ్చటికి వెళ్ళదగుదురు గాని నే రాజాల.

గౌత—అయ్యా! బ్రహ్మలోకమునకు రమ్ము. అక్కడ చలియుండదు. ఎండయుండదు. ఏదుఃఖము లుండవు.

మహా—సర్వసంగపరిత్యాగులు, కృతార్థులు, వేదాంతవిద్యాపరిజ్ఞాతులు, మొదలగువారందరుఁబోదురు. నాకు రా శక్యము కాదు.

గౌత—అహల్యా! నే నెచ్చోటికి రమ్మన్న నచ్చోటికి కేగక యొకవంక చెప్పి రాకున్నాఁడవు. నీ వాలకముం జూడ నీవు ధృతరాష్ట్రుఁడను రాజవు కానట్టు తోఁచుచున్నది. నీవు మహేంద్రుఁడవని నా బుద్ధికి పొడకట్టుచున్నది. మహేంద్రునకే లోకమునందున, నేమియెగ్గులు గలుగవు.

మహేం—మహాత్మా! సత్యముగ్రహించితివి. చేసిన యపరాధము క్షమింపుము. నీ వేమిపని చెప్పిన నట్లు చేసెద.

గౌత—దేవ! ఈ యేనుఁగు నాకు పుత్రుఁడు వంటిది. బిడ్డను పెంచినట్లు దీనిఁ బెంచితిని. దీనిని నాకడ విడిచిపొమ్ము! అదె నాకు వరప్రసాదము.

మహేం—మహాత్మా! ఈయేనుఁగు తనతొండమును జాచి నీపాదములయొద్ద నిలిచి నీకు మ్రొక్కుచున్నది. నిన్ను ముద్దుపెట్టుకొనుచున్నది. ఇంత ప్రేమగలిగిన యీ జంతువును నీకు నెడబాటు చేయుటకే నంత మూర్ఖుఁడనే? నీ యేనుఁగును నీవె గైకొమ్ము! నేను మూలరూపముఁ దాల్చినప్పుడు నన్ను సాధారణమహిమాగల మునులు తెలియఁగఁ జాలరు. నీ వఖండప్రభావవంతుఁడవు. కావున నన్నెఱింగితివి. నీప్రజ్ఞకు మెచ్చి నీకు వరమిచ్చుచుంటిని. నీవు నీ ప్రియపుత్రుఁడయిన యేనుఁగుతోఁ గూడఁ గలిసి స్వర్గమునకు రమ్ము. అక్కడ సుఖముగా నుండవచ్చును. అని గౌతముని, గజమును మహేంద్రుఁడు స్వర్గమునకుఁ దీసికొని పోయెను.

కుక్క

ఒక మహాముని యాశ్రమమునందు జంతువు లనేకములు వానిదయావిశేషమున బిడ్డలవలెఁ బెరుగుచుండెను. అందొక కుక్క యుండెను. తక్కినజంతువులతోఁబాటు ముని యాకుక్కను సైతము మిక్కిలిప్రేమతోఁ బెంచెను. అదియు నధికవిజ్ఞానము కలిగి వర్తించుచుండెను. అట్లుండ నొకనాఁడు పులియొక్కటి కుక్కను దఱుముకొని వచ్చెను. కుక్క భయంబున మహాముని శరణు జొచ్చెను. ముని దయఁ బూని తన తపోమహిమచేత శునకమును వ్యాఘ్రముగఁ జేసెను. పులిరూపు దాల్చియా కుక్క మిక్కిలి రోషముతోఁ దఱుముకొనివచ్చినపులిపైఁ బడి దాని నోడించి పాఱఁదోలెను. పిమ్మట నొకనాఁడు కుక్కను మదఁపుటేనుఁగు తఱిమి తొండముతోఁ గొట్టఁబోయెను. అపుడు మహాముని కుక్కను గొప్ప యేనుఁగను జేసెను. రెండు యేనుఁగులును బోరాడ కుక్క యేనుఁగును గెలిచెను. మఱి యొకనాఁడు కుక్కను సింహము చంపఁబోఁగా ముని కుక్కను సింహముగాఁ జేసెను. మాయసింహము నిజమయిన సింహమును బాఱఁదోలెను. వేఱొకనాఁడు శరభ మొకటి కుక్కపైఁ గవిసెను. ముని మహిమచేత కుక్క శరభ మై

విక్రమించెను. తాను పులియై, యేనుఁగై, సింగమై, శరభమై, విజృంభించుట యెల్ల దన ప్రజ్ఞయే యని లోకమునకుఁ దెలుప నెంచి యా ముని యుండినయెడఁ దన పేరు ప్రతిష్ఠలు పైకి రావని తలపోసి యా మునిని శరభరూపమున నున్న కాలమున యా మ్రుక్కడి కుక్క చంప నిశ్చయించుకొనెను. ముని తన తపోమహిమచేత దాని దుష్టభావమును గ్రహించి శరభరూపమునొంది యెప్పటి కుక్కఁగా మార్చి యడవులకుఁ దోలెను. తమ కుపకారము జేసినవారికే హాని చేయఁదలఁచు దురాత్ములు చెడిపోక బాగుపడుదురా?

—♦ పులి—నక్క ♦—

పుండ్రిక యను పట్టణము కలదు. పౌరకుఁడను రాజు దాని నేలుచు నిరంతరము పాప కార్యములు చేయుచుండెను. కొంత కాలమునకు నతఁడు మృతిఁబొంది నక్కయై పుట్టెను. పూర్వజన్మమున దానొక గొప్ప రాజై నట్టు మున్ను చేసిన మహాదోషములంబట్టి తన కీ జన్మము కలిగినట్లు నక్క యెఱింగియుండి యాజన్మమున నైన సాధువర్తనము కలిగి

బ్రతుకవలయు నని సంకల్పించుకొని జంతువులను జంపక మాయోపాయములు పన్నక మాంసముఁ దినక వ్రతముఁ బూని క్రిందరాలినయాకులు పండ్లు మాత్రమే తిని పొట్ట పోసికొనుచు నెట్టులో కాలక్షేపము సేయుచుండెను. దాని చుట్టము లగు నక్క లన్నియు విరుద్ధమైన యావ్రతముం జూచి సహింపక దానికడకుఁ బోయి ''యిది యేమిపిచ్చి! కడుపునిండ మాంసముఁ దినక యిట్లు కృశించెద వేమి? నీవు జంతువులను జంపి మాంసముఁ దెచ్చుకొనలేకపోయిన పక్షమున మేము మాంసముఁ దెచ్చి నీ కిచ్చెద'' మని వేఁడుకొనెను. ఆనక్క చుట్టముల మాటలు సరకు సేయక యెప్పటినియమముననే యుండెను. గొప్ప వ్రతమును బూని యున్న యానక్క వృత్తాంతము నచ్చటిమృగములలో నెల్ల ముఖ్యమయినపులి విని దానికడకుఁ బోయి యిట్లనియె. ''నీవు మిక్కిలి సౌమ్యుఁడవని విని నీ కడకువచ్చితిని. నాతో మైత్రి చేసి నీవు నాయొద్ద నుండుము! నేను మిక్కిలి క్రూరుఁడ నని పేరుకలదు. సాధుచరిత్రము కల నీ శిక్షలో నేను కొంతకాలము పెరిఁగితినేని నాక్రూరత్వము నన్ను విడిచిపెట్టవచ్చును. కావున నాయింట నుండుము'' అనవుడు నక్క యిట్లనియె. ''మావంటివారికి నీ వాశ్రయణీయుఁడవు కావు. నా మనస్సు భోగముల ననుభవించుట కిష్టపడకున్నది. కావున నీ మాటలు నాకు సరిపడకున్నవి'' అని నక్క పల్కుటయు బెబ్బులి దాని కివ్విధమున బ్రత్యు

త్తర మిచ్చె. 'పోనీ ! భోగముల ననుభవింప వద్దు. నాకు మంత్రి వై చేయఁ దగిన కార్యము చేయఁగూడని కార్యము నా కుపదేశించు చుండుము.' అనవుడు "అట్లు నీకు మంత్రి నై కార్యభారము వహించుచుండుచుండగా నీ మూలభృత్యులకు నాపై నసూయ వొడమును. పొడమినతోడనే వారు నీ చెవి చెంతఁ జేరి కొండెములు తండోపతండములు గా నా మీఁదఁ జెప్పుదురు. నీ కవి ప్రియములగును. అప్పుడు నన్ను నీవు చెఱుపఁ జూతువు. ఇన్నికష్టము లెందుకు ? నన్ను నీకడ నుంచుకొనఁ దలఁతువేని వారు నాపైఁ జెప్పు కొండెములు నాలకింప వనియు, వారిమాట పాటిచేయుట లేదనియుఁ బ్రమాణము సేయుము. అట్లు చేసితి వేని నీకడ నే నుండెద" నని బదులు చెప్పెను. వ్యాఘ్ర మాపలుకుల కియ్యకొని నక్క కోరినపక్కిని బ్రతిన జేసె. నక్కయు, శార్దూల మున్న నెలవునకుఁ బోయి దానికి మంత్రి యయి బుద్ధులు చెప్పుచు వసియించెను. పులియు మిక్కిలి ప్రీతితో దాని నాదరించుచు వచ్చెను. ఇట్లు కొంత కాలము జరుగు నప్పటికి వ్యాఘ్రముయొక్క మూలభృత్యులకు నక్కపై నసూయ పుట్టెను. పుట్టుటయు వా రంద ఱొక్కనాఁ డొక్క చోట జేరి యిట్లు విచారించిరి. 'ఏమిది ! ముందువచ్చిన చెవులకన్న వెనుకవచ్చిన కొమ్ములు వాఁడి యన్నట్లు చిరకాలమునుండి కనిపెట్టుకొనియున్న మనల నందఱ దిగఁ దొక్కి యీ బక్క నక్క మన ప్రభువుకడ సర్వాధికా

రము వహించి మన పైఁ గూడఁ బెత్తనము చేయవలసిన దుష్కాలము వచ్చెఁ గదా! మనప్రభువు కార్యనిర్ణయమందు దానినే గాని పిలువఁడు. దానితోనే గాని యాలోచింపఁడు. దానిమాటే గాని వినఁడు. దానిసన్నిధినే గాని కూర్చుండఁడు. దానిపై నెవ్వరేమి చెప్పిన వినఁడు. ప్రభువు చెవులలో నదేమి విషము పోసెనో తెలియదు. దాని మాటలే తనకుఁ బథ్యములు. ఏమి చేయుదుము? ఈ నక్కను నాశనము చేసినం గాని మనకు మేలు లేదు. ఏ యుపాయము చేత నైనను సరే దీనిని జెఱుపవలయును." అని యందఱు విచారించుచుండ నొక గుంట నక్క యిట్లనియె. "దీనికి నే నొక్కయుపాయము సెప్పెద. పులినిమిత్తమై దాఁచిన మాంసము మన మపహరించి నక్కబసలోఁ బెట్టి నక్క దొంగిలించుకొనిపోయె నని చెప్పుదము. అప్పుడు పులి దానిం జంపును. దానితో మనయదృష్టము పండును" అనవుడు నది లెస్సయైన మార్గ మని యందఱు సంతసించి యట్లు చేసిరి. పులియొక్క యాహారమును సంరక్షించుపని నక్కదే గావున నది యజమానుని భోజనపువేళకు మాంసము తేఁబోయి కానక యెవరో నంజుడు దొంగిలించె నని శార్దూలమునకు విన్నవించెను. అది యాదొంగతనమును విచారింపఁబూన నమాలభృత్యు లేమియు నెఱుఁగనియట్లు నలుదెసలు వెదకి నక్కయుండెడిగొందిలో నుండి మాంసమును బట్టి తెచ్చి యప్పగించిరి. అది చూచి పులి నివ్వెరపడి

నక్కపై కొంత దురభిప్రాయము బూనెను. ఆనాఁడి దల్లారకమునుపే నాలుగుసమిధలు వేయవలయు నని మూల భృత్యులు స్వామికడకుఁ బోయి యిట్లు నక్కను దూలనాడిరి. "స్వామీ! నక్కకేమి, వ్రత మేమి? ఇది యంతయు బూటకంబు; ధర్మకవచముఁ దొడుగుకొని లోకులను వంచించుచున్నది. ఇది మాంసముఁ దిన నని వ్రతముఁ బూనినదికదా! అట్టియెన మాంస మేల యిది దొంగిలింపవలయు? మాంసము దాని గదిలో దాఁచుకొనుట మీకన్నులతో మీరే చూచితిరిగద! ఇదియంట మాంసము తినదంట! వ్రతమంట! జపములంట! ఇంతకాలము మనకన్నులలో దుమ్ముకొట్టినది. పాప మెప్పటికైన బ్రద్దలుకాక మానునా? ఇది మన యొద్ద నుండఁదగదు. మీఁద దేవర చిత్తము" అనుపలుకులు విని పులి నక్కపై మిక్కిలి కోపించి దాని బట్టుకొని చంపవలసిన దని యాజ్ఞాపించెను. పులితల్లి యావార్త విని కొడుకుకడకుఁబోయి వాని నిట్లు మందలించెను. "ఎంత వెఱ్ఱివాఁడవురా కొడుకా! ఇట్టి యకార్యమెవరైన జేయుదురా? నీమూలభృత్యులు నిన్ను మోసపుచ్చిరి. ప్రభువులయొద్ద నున్న భృత్యులెన్నెన్నో కపటోపాయములు సేయుచుందురు. అవి తెలిసికొనవలదా? బుద్ధిహీనులకు బుద్ధిమంతులమీఁదను నీచులకు గొప్పవారిమీఁదను కురూపికి రూపవంతునిమీఁదను మనములో నసూయలు పుట్టుట సహజము. అవి యెఱిఁగి ప్రభువు వర్తింపవలయును.

అధర్మము ధర్మమువలెను, ధర్మ మధర్మమువలెను సాక్ష్య మిచ్చువారి నేర్పుచేఁ బట్టి కనఁబడుచుండును. రాజు నిర్మల మతితో ధర్మసూక్ష్మము గ్రహింప వలయు గాని తొందర పడవలదు. ఈనక్క వచ్చినది మొదలుకొని మనకుఁ జేసిన యుపకారము లెన్నో గలవు. అవి యైన దలఁచుకొనక నిట్లు సేయుట ధర్మమా? కుటిలచిత్తులు కపటోపాయములఁ బన్నినంతమాత్రమున నవి నమ్మి మిత్రుఁడై మంత్రియై సువ్రతుఁడై యెన్నికఁ గన్నవాని నిట్లు సేయఁదగునా? చక్కఁగాఁ బరీక్షించి కార్యము సేయవలదా? దున్నపోతీనె ననఁగానె దూడనుగట్టివేయుమందురా? కావున నిర్దోషి యైన నక్కం బిలిచి గారవింపుము!" అని తల్లి హితోపదేశముఁ జేయ శార్దూలము పశ్చాత్తాపము నొంది నక్కను రావించి కన్నీరు దొరుఁగఁ గౌఁగిలించి తన నేరంబు మన్నింపు మని వేఁడుకొనియెను. అప్పుడు నక్క శార్దూలమున కిట్లనియె. "నాఁడు సకలమృగంబులయెదుట నన్ను గౌరవించినందుకు సంతసింతునా? నేఁడు దొంగతనము నాయందు మోపి చంపఁబంపినందుకు విచారింతునా? నీవైన జ మఱచియుండిరో నేను నీకడ గొలువు కుదురునాఁడే నీభృత్యుల మాటలు విన కుండునట్లును నాచెప్పినచొప్పున నీవు వర్తించునట్లును, నీ వలన వట్టుబెట్టించుకొంటిని. అది నీకు జ్ఞాపకమున్నదా? ఎఱిఁగి యైన నెఱుఁగక యైన మొదల నొకని గట్టిగా నవ మానముచేసి పిదప నీవు సజ్జనుఁడవు క్షమింపు మని వేఁడి

కొనిన నేమిఫలము? అతఁడు దుఃఖమంతయు ననుభవించునుకదా! ఎవ్వాఁడు గాని మొదటనే గట్టిగ నరసి చూడవలయు. కావున నికడ నుండనోపను. నేఁ డనుగ్రహముఁ జేసి నిగ్రహము గలవానిని సేవించుట కష్టము" అని పలికి పక్షి తన యిచ్చవచ్చినకడకుఁ బోయెను.

భృత్యులు కపటోపాయములు గని సాధుజనుల నవమానము పాలుసేయు ప్రభువులకడ నున్నతచిత్తు లగువారు చిరకాలము కొలువు సేయనోపరు. అట్టిప్రభునిరాజ్యము దుర్మంత్రుల స్వాధీన మై యచిరకాలమున నశించును.

సువర్ణష్ఠీవి.

నారదుఁడు, పర్వతుఁడు దగ్గర చుట్టములు. నారదుఁడు పర్వతునకు మేనమామ. అల్లుఁడు మామ లిద్దఱు కలిసి ప్రపంచమంతయు సంచరింపఁ దలఁచుకొని తమలోఁ దామిట్లు ప్రతిజ్ఞ చేసికొనిరి. "ఏవిషయ మైనగాని మనలో నొకనిమనస్సులో నేమున్నదో దానిని రెండవవానికిఁ దప్పక చెప్పవలయును. మనలో మనకు రహస్యము లుండఁగూడదు. అట్లు చెప్పకొనకపోయినపక్షమున శాపముపాలు గావలసి

నదే" అనియమముఁబొప్పన వర్తించుచు వారనేక దేశములు తిరిగితిరిగి సృంజయుఁ డనురాజుకడకుఁ బోయిరి. ఆరాజు మహామునుల నిద్దఱను మిక్కిలి భక్తితోఁ బూజించి తనమందిరమున నుండుమని ప్రార్థించెను. అట్లు కాక యని మునులు సమ్మతించిరి. సృంజయుఁడు తనకూఁతురగు సుకుమారినిఁ బిలిచి బిడ్డా! యీమహామునులకు నీవు పరమ భక్తితో నుపచారములు సేయవలయు. కావలసిన భోజన పదార్థములు వేళకు సమకూర్పవలయు. ఇన్నిమాటలెందులకు? వారికే వెలితిరాకుండ చూచుభారము నీది." అని చెప్పి యప్పగించెను. ఆకుమారియు నట్లేయని బద్ధకింపక మునులకు వేళదప్పకుండ నన్నపానాదులు సమకూర్చుచు దేవపూజలకు మంచి పుష్పములు సమర్పించుచు సకలోపచారములు చేయుచుండెను. మహామునులామె యుపచారములకు మిక్కిలి సంతసించిరి. ఆసుకుమారి మిక్కిలి చక్కనిది. ఆముద్దుగుమ్మ నడబెడంగులు నవ్వులు మేను మెరపించుహొయలు సంపూర్ణ చంద్రమండలమునకు వన్నెలు దిద్దఁగల మొగము, కలువఱేకులనుమీరిన కన్నులు, నిరుపమానమైన లావణ్యమును జూచి నారదమహాముని యామె మీఁద వలపునిలిపెను. అతఁడు తావళము మునుపటివలెఁ ద్రిప్పుచుండెనుగాని మనసు పద్మాక్షునిపై నిలుచుటమాని యామీనాక్షిపై నిలువఁజొచ్చెను. అన్నముమీఁదనిష్టము దప్పెను. క్రమక్రమముగ మేను పాండించెను. బలహీనత

హెచ్చెను. ఆలక్షణములు కనిపెట్టి పర్వతుఁ డట్లుండుటకు కారణమేమని నారదుని బలుమారు గుచ్చిగుచ్చి యడిగెను. నారదుఁడు సిగ్గుపడి చెప్పక యూరకుండెను. పర్వతుఁడు తనదివ్యదృష్టిచేత నారదుని విచారకారణము తెలుసుకొని యిట్లనియె. "నారదా! నీవు చెప్పకపోయినను నీ చింతకుఁ గారణము నేను దెలుసుకొంటిని. రాచకూఁతురును వలచితివి. నేఁడో రేపో యామెను వివాహము సేయుమని రాజును నీవడుగుదువు. రాజును నీమాట త్రోసివేయలేక నీకు దానినిచ్చి వివాహముసేయును. అదినాకు సంతోషమే కాని మన మిద్దఱము చేసుకొన్న ప్రతిజ్ఞకు విరుద్ధముగా నీవు నీమనసులోనున్న భావము నాకుఁ జెప్పకుండ దాచితివి గావున నీవిప్పుడు శాపము పాలుగాక తప్పదు. వివాహమైనవెంటనే నీవు కోఁతిరూపు దాల్తువుగాక!" యని శపించుటయు నారదుఁడు "పర్వతా! నన్ను నీవు నిష్కారణముగా శపించినందుకు నీవు స్వర్గమునకు వెళ్ళకపోదువుగాక" యని ప్రతిశాపమిచ్చెను. పర్వతుఁడు నారదునివదలి యథేచ్ఛముగా సంచరించుటకు వెళ్ళెను. సృంజయుఁడు, నారదుఁడు తన కుమారికయగు సుకుమారిని వలచెనని విని యాకన్నియనిచ్చి యతనికి వివాహము చేసెను. పాణిగ్రహణము కాఁగానే నారదమహామునికి హేయమైన కోఁతిరూపు ప్రాప్తించెను. మగని మొగ మసహ్యముగా నుండినను సుకుమారి రోఁతపడక పరమపతివ్రతయై యతనికి

విధేయురాలై పరమభక్తితో నతనికి యుపచారములు సేయఁజొచ్చెను. ఇట్లుండ నారదుఁడొకనాఁడు దాపుననున్న యరణ్యమునకుఁ బోయెను. అతని కక్కడ పర్వతుఁడు కనఁబడెను. అన్యోన్యకుశలప్రశ్న లయినతరువాత నారదునిఁ జూచి పర్వతుఁడు, "మామ! స్వర్గలోకమునకు పోకుండుటచే నాకేమియు తోఁచుటలేదు. పిచ్చెత్తినట్లున్నది. కావున నా కిచ్చినశాపము, మరలింపు" మని పలికెను. అప్పుడు నారదుఁడిట్లనియె—పర్వత! కారణములేకయే మొదట శాపమిచ్చినవాఁడవు నీవు. కావున మొదట నీవిచ్చిన శాపము మరల్పుము. తరువాత నేనిచ్చిన శాపము మరల్చెద. అనఁగానే పర్వతుఁడు తానిచ్చినశాపము మరల్చెను; నారదుఁడట్లే చేసెను. ఇద్దఱుకలసి సృంజయుని మందిరమునకు వెళ్ళిరి. కోఁతిరూపు నారదునకు పోయెను. రూపమ్మాఱిన నారదుని చూచి సుకుమారి యితఁడు తన భర్త కాఁడనియు నెవరో పరపురుషుఁడనియు, భావించి పరపురుషుని జూడనొల్లనని యంతఃపురములోఁ గూర్చుండి రాదయ్యెను. సృంజయుఁడు మున్నగువారు చేరిరి. అప్పుడు పర్వతుఁడు సుకుమారికిని సృంజయునకును గలిగిన సందేహము నివారణమగునట్లు తొంటినుండియు నడచిన యావద్వృత్తాంతము దెలిపి వారల సంతుష్టులఁ జేసెను. అంతట సుకుమారి సంతసించి భర్తనెప్పటివలె గారవించెను. అనంతరము కొంతకాలము పర్వతనారదులు కలసి సృంజయుని మందిర

మునునే నసియించి "రాజా! నీవుమాకు చేసిన మహోపకా రమునకు నీకే దేనివరము నియ్యఁదలఁచుకొన్నాము. ఇచ్చవచ్చి నవరమును కోరుమని చెప్పిరి. సృంజయుఁడు సంతసించి "మహాత్ములార! పుత్రసంతానము లేక చిరకాలమునుండి వందుచున్నాఁడను. లోకోత్తరచరిత్రగల కుమారుని బ్రసా దింపుఁడని ప్రార్థించెను. అట్టిపుత్రుఁడు కలుగుఁగాకయని నారదుఁడు వరమిచ్చెను. కానియతఁడు దీర్ఘాయుష్కుఁడగు నని పర్వతుఁడు పలికెను. ఎందుచేతనని సృంజయుఁడడుగ "లోకోత్తరచరిత్రుఁడైనవాఁడు తన్ను మించునేమోయని యింద్రుఁడు భయపడుచుండును. అందుచేత నింద్రునివలన నతనికపాయము వాటిల్లఁగలదు. కావున నతనిబారిఁ బడ కుండ కుమారుని రక్షించుకొనుము. నైనవసరమున నేదేని యుపాయము వాటిల్లినఁ దపోబలమున నన్నుఁ దలఁచుకొనుము. నేను వచ్చి నీకుమారుని రక్షించెద" నని పర్వతుఁడు కార ణముచెప్పి యభయప్రదాన మొసంగెను. రాజు పరమా నందభరితుఁడై మునులను నమస్కరించి యంతిపురమునకుఁ బోయెను. సంవత్సరమయినతోడనే నతనికిఁజక్కనికుమా రుఁడు పుట్టెను. అతని యుమ్మిచొంగ మొదలగునవి బంగా రమే. అందుచేత నతనికి సువర్ణష్ఠీవియని పేరుపెట్టిరి. అట్టి యద్భుతచరిత్రగల కుమారుఁడు పూర్వ మేరాజ వంశ మునను జనియింపకపోవుటచే జననీజనకులకు బంధు వర్గమునకు ప్రకృతజనులకు నతనిచరిత్రము మహాశ్చర్య

ముగా నుండెను. అతనింగూర్చి జనులీవిధమున జెప్పకొనం జొచ్చిరి. దేవతలయంశమున జనించిన మహాత్ములనేకులు గలరు. చక్కనివారు పెక్కుఅున్నారు. మహాబలవంతులు వేనవేలున్నారు. అసాధారణ ధీమంతులుగూడ ననేకులు గలరు కానిబంగారమే యుమ్మివేయునట్టి బాలకుని బూలోకమం దెవ్వడు జూచియుండలేదు. పట్టినట్లు వినియుండలేదు." ఎల్లవారికి మిక్కిలి యాశ్చర్యము గలిగించుచున్న యా బాలునితల్లి దండ్రులు మిక్కిలి గారాబమున బెంచుచుండిరి. ఇంద్రుండేవేళ వచ్చి మచ్చరంబున వధించిపోవునేమోయని మనంబున నత్యంత భయంబునొందుచు నృజయుండతని వేయికన్నులతోం గాపాడుచుండెను. మందిరముదాటి యతని నావలకుం బోనియ్యకుండెను. అనుక్షణమతని వెంట లెక్కకు మీరిన సేనకు లుండునట్లాజ్ఞాపించెను.

ఆబాలకుం డట్లు సర్వజనంబులకు ముద్దుగాం బెరుగుచుండ ధనాశాపాతకులగు దొంగలు కొందఱు చేరి యిట్లు తలంచిరి. "ఈరాజబుడుతండు చొంగం గార్చిన నది బంగారము, ఉమ్మి బంగారము, చమట బంగారము, కన్నీరు బంగారము, మలమూత్రములు బంగారము, వీనిపొట్టనిండ బంగార ముండంం బోలును? పొట్టయేకాదు. శరీర మంతటు బంగార మున్నది. మనమందఱము వీనినెట్లైన నెత్తుకొనిపోయి వీనిం జంపి కడుపులోనున్న బంగారమంతయు నపహరింతము"

అనినిశ్చయించుకొనిసమయంబునిరీక్షించిమాయవేషంబులు వేసికొని యంతఃపురము ప్రవేశించి దాది నిద్రవోవునప్పుడు చోరులు బాలకుని దొంగిలించుకొని సమీపమున నున్న యరణ్యమునకుఁ బోయి వానిని జంపి కడుపు నోరు చీల్చిరి. కాని, వానికి బంగారమించుకేనియుఁ జిక్కదయ్యె. "అయ్యో! రాజకొడుకును నిష్కారణముగఁ జంపితిమి. మన మందభాగ్యులము! వీని కడుపులోనున్న నోటిలో నున్న బంగారము లేదు. వ్రతము చెడినను ఫలము దక్క లేదు." అని పశ్చాత్తాపము నొంది దొంగలు శవము నచ్చట పారవైచి పోయిరి. ప్రక్కలో నిద్రించుచున్న రాజకుమారుఁడు ప్రక్కలోనే మాయమైపోవుట తెలిసిన తోడనే యంతఃపురమునం దెల్లవారు మిక్కిలి యాశ్చర్యము విషాద మనసంబులఁ వెదకఁగొన పట్టణములు, పల్లెలు నూతులు, గోతులు, చెఱువులు, నదులు, తోఁటలు, దొడ్డ మహారణ్యములు వెదకిరి. అరణ్యములో నొకచోట శవము కనుపడెను. దానిని జూచి తలిదండ్రులు హాహాకారము లెసగ నేడ్చిరి. సువర్ణష్ఠీవియయిన తనకొడుకును జూచి యోర్వలేక దేవేంద్రుఁడే చంపించె నని సృంజయుఁ డభిప్రాయపడెను. వెనుకటిమాటలు జ్ఞప్తికిఁ దెచ్చుకొని పర్వతమహామునిని తలంచెను. తలఁచుటయుఁ బర్వతుఁడు ప్రత్యక్షమై యేమికావలయునని రాజు నడిగెను. జరిగినవృత్తాంతమంతయు రాజు పర్వతున కెఱింగించెను. అప్పుడు పర్వతుఁడు

రాజున కిట్లనియె. ,,రాజ! నీయభిప్రాయము తప్పు. ఈ దుష్కార్యము దేవేంద్రుఁడు చేయలేడు. దురాశగల దొంగలు చేసినపని యిది. ఎవరుచేసిన నేమి? నీవు పుత్రశోకార్తుఁడ వైతివి. నీ కిప్పుడు నీకొమారునిం దెచ్చి యిచ్చెద! వగవకుము'' అని తన తపోమహిమచేత రాజకుమారుని బ్రతికించెను. తలిదండ్రుల యానంద మేమని వర్ణింపఁగలము? చుట్టములసంతోష మెట్టిదని చెప్పఁగలము. అంత మహోపకారము చేసినందులకు సృంజయుఁడు పర్వతున కనేకవందనములు సేసి కృతజ్ఞతను దెలిపెను. పర్వతుఁడు తనయిచ్చవచ్చినట్లు పోయెను. రాజు కుమారుని మిక్కిలి శ్రద్ధతోఁ బెంచుచుండెను. అట్లు కొంతకాలము గడచెను. సువర్ణష్ఠీవియొక్క ప్రఖ్యాతి మూఁడుజగములందు వ్యాపించెను. అతనిబుద్ధి, అతని బాహుబలము, అతని సుగుణసంపద యెల్లవారు కొనియాడఁ జొచ్చిరి. దేవత లతని పొగడిరి. ముని లతనినే ప్రశంసించిరి. మానవు లతనినే కొనియాడిరి. అటువంటి బాలుఁడు పదునాలుగుజగముల లేఁడని యెల్లవారు చెప్పుకొనిరి. అట్టిబాలుని వలన తన కెప్పటికైన నపకారము కలుగకపోదని దేవేంద్రుఁడు బెంగపెట్టుకొనెను. గురువైన బృహస్పతితో నాలోచించెను. భయము లేదని బృహస్పతి ధైర్యము చెప్పెను. ఎంత ధైర్యము చెప్పినను దేవేంద్రుని మనస్సు కుదుట పడదయ్యె. మిక్కిలి ఛాందసుఁడగు బృహస్పతితో నాలోచించిన

గార్యము కాదని స్వయముగా నాతడే కార్యాలోచనము చేసికొని వజ్రాయుధమును జూచి "ఓసి! నీవు పెద్దపులిరూపముం దాల్చి భూలోకమునకు వెళ్ళి సృంజయరాజుకుమారుని జంపిరా" మ్మని యాజ్ఞాపించెను. చిత్తము! దేవా! యని వజ్రాయుధము భూలోకమునకు వెళ్ళి శార్దూల రూపము ధరించి సమయమునకొఱకు నిరీక్షించి యుండెను. అంతట నొక నాఁడు సృంజయమహారాజు సకుటుంబపరివారముగా వనవిహారము చేయుదలంచి గంగానదీతీరమునకుం బోయెను. కొందఱు జలక్రీడలు చేయుదొడంగిరి. కొందఱు పుష్పాలు కోసిరి. కొందఱాటలాడిరి. కొందఱు ముచ్చటలతో కాలక్షేపము చేసిరి. కొందఱు కాళ్లు నొచ్చునట్లు పలుతావులు దిరిగిరి. కొందఱు వేటాడిరి. సువర్ణష్ఠీవి కొందఱు మిత్రులతోఁ గలిసి యిట్లు దిఱుగుచుండెను. అప్పుడొకపొదలోనుండి పెద్దపులియొకటి యాదరుపాటున గాండ్రు గాండ్రు మనుచు వచ్చి బాలుని మీఁదఁబడి పట్టుకొని నోటికొరికి విసరివైచెను. వెంటనే బాలుఁడు ప్రాణమొందెను. ఈపనియెల్ల నిమేషమాత్రములో జరిగెను. అడవి ప్రతిధ్వనియిచ్చునట్లు హాహాకారములు చెలఁగెను. వేటకాండ్రు కోలలు బల్లెములు కత్తులు దీసికొని బెబ్బులిని జంపఁదలంచిరి. కానియదియెవ్వరికిం గనఁబడ లేదు. బాలుని శవముమాత్రమే కనుపడెను. తలిదండ్రులు దుఃఖము భరింప లేకపోయిరి. గంగానదిలోఁ బ్రవేశించి వారు ప్రాణమొందఁ దలంచిరి. బంధుమిత్రులు వారిని మిక్కిలి కష్టముతో నివారిం

చిరి. దుఃఖముయొక్క మొదటిపాలి యుడగిన తరువాత సృంజయుఁడు పూర్వవృత్తాంతము జ్ఞప్తికిఁ దెచ్చుకొని తనకు వరప్రసాదియైన పర్వతమహామునిని మనస్సులోఁ దలఁచుకొనెను. తలఁచుకొనినతోడనే పర్వానువలె పర్వతుఁ డెదుర నిలిచెను. నిలుచుటయు రాజు వానిపాదములపైఁ బడి పుత్రభిక్షను పెట్టుమని ప్రార్థించెను. పర్వతుఁడు తాను పూర్వము చేసిన యభయ ప్రదానమునుబట్టి వాని బ్రతికించి దేవేంద్రుఁడే మత్సరముచేత నట్టికార్యము చేయించెనని సృంజయునితోఁ జెప్పి యంతర్హితుఁ డయ్యెను. అనంతరము సృంజయుఁడు మహానందముతో బంధుమిత్రవర్గముల గలిసి తనపట్టణమునకుఁ బోయి పుత్రసహితముగ సుఖముగ నుండెను. కుమారునకు యుక్తవయస్సు వచ్చినతరువాత సృంజయుఁ డాతనికి పట్టము గట్టి తాను తపోవనమున కరిగెను. సువర్ణష్ఠీవి పట్టాభిషిక్తుఁడై ప్రజలందఱు తనబిడ్డలుగ భావించి ధర్మమార్గమునం బ్రవర్తించుచు ప్రజాపరిపాలనము చేసెను.

సక్తుప్రస్థుని చరిత్రము

మహాభారతయుద్ధ మైనతరువాత ధర్మరాజు జ్ఞాతులను జంపిన పాపము పోవుటకై యశ్వమేధము చేసెను. యాగము ముగిసినతరువాత బంధువులు మిత్రులు బ్రాహ్మ

ములు కొలువ ధర్మరాజు సభ తీర్చియున్నప్పుడు కొందఱు భూలోకములో నీటువంటి యజ్ఞ మెవరు చేయలే దని ధర్మ రాజును స్తోత్రము చేసిరి. అప్పు డొకముంగి బిలములోనుండి వెలుపలికి వచ్చి సభవారియెదుట నిలిచి యిట్లనియె. ‘‘మీ రందఱు అతివిధముగా స్తోత్రము చేయుచున్నారు గాని యీయ జ్ఞము సక్తుప్రస్థుని ధర్మముతో నెంతమాత్రము పోలదు. ఱత్తి ఱత్తిపొగడ్తలు పొగడక యూరకుండుఁడు.’’ అనపుడు సభాస దులయిన బ్రాహ్మణులు ముంగిని జూచి ‘‘యేమి! నీ విట్లను చున్నావు? మంత్రప్రయోగము, తంత్రగరిమ, దానధర్మములు నిరుపమానములుగా నున్నవి. లక్షలకొలఁది బ్రాహ్మణులు సంతుష్టిగ భుజించిరి. మునులు దేవతలు బ్రాహ్మణులు సంత సించిరి. సకలభూతతృప్తి యయ్యె. ఈయజ్ఞమునఁ గల లోప మేమి? సక్తుప్రస్థుఁ డెవ్వఁడు? అతనియెడలఁగల విశేషధర్మ మేమి?’’ యని పలికిరి. వారలకు ముంగిస యిట్లనియె;—అ య్యా! వినుఁడు. ధర్మక్షేత్ర మని చెప్పఁగల కురుక్షేత్రము కలదు. ఆపుణ్యస్థానములో సక్తుప్రస్థుఁడను నొకబ్రాహ్మణుఁడు భార్య కొడుకు కోడలు సేవింప తపస్సు చేసికొనుచు నుంఛవృ త్తితో నుదరపోషణము చేసికొనుచుఁ గాలక్షేపము చేయు చుండెను. అటులుండ ననావృష్టి పట్టెను. పంటలు లేక పోయెను. ఆకుటుంబమునకు జీవనము జరుగుట కష్టమ య్యెను. కుటుంబములోఁగల నలుగురు తెల్లవారుజామున లేచి యొకనాఁడు పొలములకుఁ బోయి నేలరాలిన ధాన్యపుగింజ

వేరి తెచ్చుకొని వేయించి పేలాలు చేసికొని పిండి విసరుకొనిరి. ఆ పేలాలు కుంచెడు పిండియయ్యెను. చెరిమానెడు చొప్పున పిండి నలువురు పంచుకొనిరి. తినుటకు సిద్ధముగా నుండిరి. అప్పు డొక బ్రాహ్మణుడు పేరాఁకలిగొని శోషిల్లి యన్నమన్న మని యడుగుచు వారింటికి వచ్చెను. బ్రాహ్మణుడు భార్య కొడుకు కోడలు మిక్కిలి భక్తిశ్రద్ధలతో నతిథి కెదురు పోయి యర్ఘ్యపాద్యములిచ్చి తోడ్తెచ్చిరి. సక్తుప్రస్థుఁడు తానంతట వచ్చిన మానెడు పేలపిండియు నతిథి కిచ్చి భుజింపు మని ప్రార్థించెను. పేరాఁకలిచేఁ గటకటంబడుచున్న యాయతిథి మానెడు పేలపిండి నాలుగుండలుగాఁ జేసి మ్రింగివైచెను. కాని యాతని యాఁకలి తీరినట్లు గనుపడ లేదు. సక్తుప్రస్థుఁడు వాని యవస్థ జూచి "అయ్యో! పాప మీ బ్రాహ్మణుని యాఁకలి దీరలేదు. ఏమిచేయుదు? ఎట్లీతని యాఁకలి తీరు? కటకటా! ఆఁకలిగొన్న యతిథులను సంతుష్టుఁ జేయుటకై నావద్ద రవంత యేనియు ద్రవ్యము లేకపోయె గదా" యని విచారించుచుండ మహాపతివ్రత యయిన యాతని భార్య వా గని యింగిత మెఱిగి యాతనితో నిట్లనియె. "దేవా! యీ మహాత్మున కాఁకలి తీరినట్లు లేదు. నావంతు పిండి యీతని కిచ్చి కుడువ బెట్టుడు. సగ మాఁకలి తీర్చు టుచితము కాదు" అనవుడు భార్యయౌదార్యమును మెచ్చి భర్త యిట్లనియె. "సాధ్వీ! నేను సంపాదించి నీకుఁ బెట్టుట లేదు సరిగదా తెల్లి వారుజామున లేచి యెండఁ బోఁబడి నీ వేరి తెచ్చి వేయించి

సిద్ధము చేసికొన్న పిండి నీ నోటియందరనుంచి యపహరించి నే నొరులకుఁ బెట్టఁగలనా? భార్యను బోషింపలేనివాఁ డీలోకమున నిందయుఁ బరలోకమున నరకము ననుభవించును. నీ నోటియందలి యన్నమును దీసికొనఁ జాల" ననవుఁడు మగనితో నా యిల్లాలి తెఱంగున బలికెను. "స్వామీ! ఆఁడుదానికి మగఁడే చుట్టము, మగఁడే దైవము, మగఁడే తల్లి, మగఁడే తండ్రి, మగఁడే మిత్రము. మగనికంటె నాప్తు లెవ్వరును లేరు. మగని యాజ్ఞ పట్టుఁబట్టి నడుచుటయే మగువకు ధర్మము. అదియునుఁ గాక మీ యాహారము నతిథికిఁ బెట్టి మీ రాఁకలిచే బాధ పడుచుండ నేను తిని సుఖముగా నుందునా? భర్త యుపవాసము చేసిన భార్య యుపవాసము చేయవలయు. భర్త భుజించిన భార్య భుజింపవలయు. ఇదియే యుత్తమస్త్రీధర్మము. కావున నే నిది భుజింపనొల్ల. ఇది కూడ నతిథికి సమర్పింపుఁడు" అని పలుకుటయు సక్తుప్రస్థుఁ డామెపతిభక్తికి సంతసించి యామెవంతుపిండి కూడఁ గొనిపోయి భుజింపు మని యతిథికి సమర్పించెను. అతిథి దానిం గూడ నాలుగుముద్దలుచేసి మ్రింగెను. అప్పటికిని వాని యాఁకలి తీరలేదు. అతని యవస్థ చూచి సక్తుప్రస్థుఁడు కటకటా! యీ బ్రాహ్మణునియాఁకలి యింకను దీరలేదే, యేమి చేయుదు? ఏతఁ డెట్లు తృప్తుఁ డగు నని విచారించుచుండఁ గుమారుఁడు తండ్రి యభిమతం బెఱిఁగి యాతనితో నిట్లనియె. "తండ్రీ! యీ యతిథిక్షుధానలంబు చల్లారలేదు.

పేరాఁకలితో నింటికి వచ్చిన యతిథికి నర్ధాన్నము బెట్టిపంపుట ధర్మముకాదు. కావున నావంతుపిండి వీని కిచ్చి సంతుష్టునిం జేయుము.” అని పలుకుఁ గొడుకుం జూచి తండ్రి కటకటం బడి అయ్యో! కొడుకా నీవు బాలుఁడవు. రెండుమూఁడనాళ్ళ నుండి యన్నములేక మాడిపోవుచుంటివి. కడుకష్టముమీఁద లభించినయీయాహారము తినవల దని యన్యుల కెట్లు బెట్టుదు నని జాలిపడుచుండఁ దనయుండు దండ్రి నుద్దేశించి యిట్లనియెం. “నాయనా! అతిథిపూజకంటెఁ బరమధర్మము లేదు. వయస్సుచేతను దపముచేతను మిక్కిలి కృశించినవాఁడవు నీవే నోటిముందటియన్న మతిథుల కిచ్చునప్పుడు పడుచువాఁడను నే నియ్యలేకుందునా? కావున నామనవి విని నావంతుపిండి గూడ నతిథికిమ్ము” అనవుడు సంతోసించి బ్రాహ్మణుఁ డట్లు చేసె. అతిథి దానిఁ గూడ భుజించి యప్పటికిని నిశ్శేషముగా నాఁకలి తీరనియట్లుండె. సక్తుప్రస్థుఁ డాతనివైఖరి చూచి మరల విషాదమునొందుచుండఁ గోడలు మామకడకుఁ బోయి తన వంతుమానెడుపిండి గూడ నతిథి కర్పింపవలెనని ప్రార్థించెను. మొదట బ్రాహ్మణుఁ డాపని కిష్టపడక అమ్మా! నీవు చిన్నబిడ్డవు. అన్నవస్త్రములు కలిగి సుఖపడ మాయింటికి వచ్చితివి. ఆఁకలిచేత బాధపడుచు నీవు లేవలేక మాటలాడలేక యున్నదానవు. అట్టియవస్థలో నున్న నిన్ను భుజింపవలదని చెప్పి నీయాహార మితరుల కెట్లు పెట్టింపఁగల వని పలికెను. అనవుడు మామమాటలకుఁ గోడలిట్లనియెం.

“మహాత్మా! మహనీయులయిన మీరును, మా యత్తగారును, నా పాలిటి పరమదైవమైన నాభర్తయుఁ దమకడుపులు గట్టిపెట్టుకొని యెంతో స్వార్థత్యాగము చేసి యతిథిపూజలు సేయుచుండ నేను నా ప్రాణము రక్షించుకొందునా? ఉన్నప్పుడు నలుగురము తిందము, లేనప్పుడు కడుపులో కాళ్ళు పెట్టుకొని నలుగురము పడుకొందము. ఆఁకలిగొన్న యతిథిని విడిచిపెట్టి కుడుచుట జంతువులధర్మము గాని మనుష్యులధర్మముగాదు. కావున నిది తప్పక వారి కొసంగుఁడు” అనవుడు మామ కోడలి మాటకు సంతసించి యామె వంతు పిండికూడ నతిథికిచ్చెను.

కోడలి వంతు పిండిఁగూడ భుజించి యా యతిథి సంతుష్టిఁ జెంది గఱ్ఱుమని త్రేనిచి ముఖమున సంతోష మచ్చుపడఁగ సక్తుప్రస్థునిఁ జూచి యిట్లు ప్రశంసించెను. “ఓ బ్రాహ్మణుఁడా! నే నెవరో యెఱుఁగుదువా? నేను యమధర్మరాజును నీనిష్ఠ యెట్టిదో, నీశీల మెట్టిదో పరీక్షింపవలయు నని వచ్చినాఁడను. నీ గుణసంపత్తికి మెచ్చితిని. భక్తి వినయము శ్రద్ధ శాంతము కరుణ నీయందే సుస్థిరత్వము నొందెను. అతిథులకు నభ్యాగతులకు నీవు చేసినచందంబున నుపచారము మఱెవ్వరు చేయఁజాలరు. నీవే కాదు. నీభార్యయు నీయట్టిదే. సకలధర్మంబులు నేర్చి పురుషుఁడు పుణ్యశీలుఁడు కావచ్చును. కాని స్త్రీయు నట్టిదే యగుట మిక్కిలి ప్రశంసనీయము. దంపతు లెట్టివారో కుమారు లట్టివారగుట యరుదు. అతిథులయెడ జనకునికంటె నెక్కువ వినయము

నెక్కువదయ గలకుమారునిఁ జూచి నీ వెక్కువగర్వపడ వచ్చును. నీకొమారుఁడు మిక్కిలి యోగ్యుఁడు. తండ్రిగుణములు యీతనియందుఁ బ్రవేశించినవి. కొడుకునకుం దగిన కోడలు లభించుట కూడ మీ పూర్వపుణ్యము. గయ్యాళిగాక కలహప్రియగాక స్వార్థపరురాలుగాక పతివ్రతయై కరుణాసమేతయై వివేకినియై నీకోడలు భూలోకమందలి కోడండ్రకు మార్గప్రదర్శకురాలై యుండుఁగాక! నీయిల్లాలు నీకొడుకు నీవలెనే ధర్మమనుష్ఠించుట గొప్పకాదు. పెఱచోటఁ బుట్టి పెఱచోటఁ బెరిగి చెట్టఁ బట్టి పురుషునితో సుఖ మనుభవింపఁదలఁచి వచ్చినకోడలు ధర్మానుష్ఠానతత్పర యై మామగారిని మగనిని మెప్పింపఁ దలఁచుట గొప్పయాశ్చర్యము. నీకుటుంబము వంటి కుటుంబము నే నెందుఁ జూడలేదు. అందఱు లోకధర్మపథమున నడచువారగుట యరిది. సదాచారంబు నీస్వార్థత్యాగముఁ జూచి దేవతలు మహాశ్చర్యరసమున మునిఁగి బహువిధముల నిన్ను మెచ్చుచున్నారు. ,, అని యతిథివేషము దాల్చినధర్ముఁడు వానిం బ్రశంస చేయుచుండ నంతలో దేవేంద్రుఁడు పుష్పవర్షము గురిపించెను. ఆకాశము మీఁద దేవదుందుభులు మ్రోసెను. నిన్నును నీకుటుంబమును జూచుటకు సప్తమహర్షులు మున్నుగు కుతూహలపడుచున్నవి. కావున కొడుకుఁ గోడలు భార్య వెంట రా నీవు స్వర్గమునకు రమ్ము! స్వర్గము నీవంటివాని నిమిత్త మేర్పడినదే. ఈవిధముగా

నీ వతిథిపూజ చేసినందుకు నీకు రెండువరము లిచ్చెద. సమస్త ప్రజల నడుగుటఁ జేయునదియు, సకల నీచకర్మము లకు నోడఁబడఁ జేయునదియు సమస్తపాపములఁ జేయుచు నదియు నైనయాఁకలి నీకుఁ గలుగదు. ఆఁకలిరోగాదు. దప్పి కయుఁ గూడఁ గలుగదు. నీవంటిమహాత్ముఁ డూర్ధ్వలోకము లకు వచ్చుచున్నాఁడని విని బ్రహ్మ నీకొఱకై యొకవిమాన ము పంపును. ఆవిమాన మెక్కి నీవు బ్రహ్మలోకమున కరిగి పర మేష్ఠిని సందర్శించి ధన్యుఁడవుకమ్ము! భూదానములు గోదాన ములు హిరణ్యదానములు కన్యాదానములు యజ్ఞములు మొదలగునవి నిజముగా నాఁకలి గొన్నవానికి వేళ మెఱిఁగి యన్నదానము సేయుట వంటివి కావు. కష్టపడి సంపాదించిన పదార్థము కొంచె ముగానో గొప్పగానో పాత్ర మెఱిఁగి కాల మెఱిఁగి యతిథు లకు నభ్యాగతులకు సమర్పించుట పరమధర్మములలో నెల్ల పరమధర్మము. అని పలికి ధర్ముఁడు తననిజరూపముఁ జూపెను. అంతలో బ్రహ్మ పంపిన సువర్ణవిమానము గగనవీథిని గనఁబడెను. అంతట సత్త్వప్రస్థుఁడు భార్యయుఁ గొడుకును గోడలు ధర్మునకు నమస్కరించిరి. అతఁ డంతట నిట్లనియె:— "నీవు సకుటుంబముగా బ్రహ్మవిమాన మెక్కి యాక్షణమె పొమ్ము! బ్రహ్మర్షులు దేవతలు నిన్నుఁ జూడ నెంతో కుతూహలపడుచున్నారు." అనవుడు సత్త్వప్రస్థుఁడు ధర్ముఁడు చెప్పినట్లు విమాన మెక్కిపోయెను.

అని ముంగి సక్తుప్రస్థుని వృత్తాంతమంతయు సభ
వారికిఁ జెప్పి వెండియు నిట్లనియె. "అయ్యా! నేను ముంగి
నైనను మహానుభావుఁ డైన సక్తుప్రస్థుఁడు బంగారువిమాన
మెక్కి బ్రహ్మలోకమునకుఁ బోవుట నాబిలములోనుండి యెం
తయు సంతోషముతోఁ జూచి యానందము పట్టఁజాలక కలు
గులోనుండి యావలకుఁ బోయి యతిథి కాళ్ళుకడుగుకొన్న
చోట సంచరించితిని. ఆబురద నామేను నంటుకొనియె. అంతట
నాతలయు శరీరమందు సగముభాగము సువర్ణమయ మయ్యెను.
ఇది సక్తుప్రస్థుని మాహాత్మ్యముచేత నయ్యెను గాని, యాబురదవల్ల
గాదు. పట్టిబురదలో నెంతదొర్లిన నిట్లగునా? నాఁడు మొద
లుకొని నాశరీరముయొక్క రెండవభాగముకూడ సువర్ణమయ
ము చేసికోవలె నని మహానీయులైన తపోధనుల యాశ్రమ
ములకరిగితిని. ఎన్నో యజ్ఞశాలలకుఁ బోయితిని. అన్న
దానము జరుగు దేశము లెన్నో చేరి చూచితిని. సిద్ధవనము
లెన్నో ప్రవేశించితిని. నాకోరిక యెక్కడను నెఱవేరలేదు.
పాండురాజకుమారుఁ డైన యుధిష్ఠిరునిపేరు జగత్ప్రసిద్ధమై
యున్నది. ధర్మరాజను నామధేయ మీతనియందు సార్థక
మయినది. కురువంశ మీతనివల్ల పావనమైనది. అందుచేత
నితఁడు సేయు యశ్వమేధము లోకోత్తరమైనదిగా నుండునని
తలంచి నాశరీరముయొక్క రెండవభాగ మిక్కడ తప్పక
సువర్ణమయ మగునని నిశ్చయించుకొని ఈయజ్ఞమునకు వచ్చి
తిని. బ్రాహ్మణులు భోజనము చేసినచోట్ల చేతులు కడుగు

కొన్నిచోట్ల పాదప్రక్షాళనము చేసినచోట్ల సంధ్యలు వార్చిన చోట్ల స్నానములు చేసినచోట్ల నెంతోసేపు దొర్లి దొర్లి విసిగితిని. మేను బాడియగుటయే కాని, బంగారము కాలేదు. అందుచేత సక్తుప్రస్థుని దానముకంటె ధర్మరాజుగారి యశ్వమేధము తక్కువదని పలుకుటకు నేను సాహసించితిని. మాయ మర్మము లెఱుఁగని జంతువను గనుక మనసునందుఁ దోఁచిన యభిప్రాయము సభామధ్యమున నిర్భయముగా వెల్లడిపుచ్చితి నావల్ల నేరమున్న క్షమింపుఁడు. ఇట్లు వెల్లడింపవలసిన యవసరమేమని మీ రందురేమో వినుండు. అశ్వమేధము చేసినందున ధర్మరాజును మీరు నేకవిధములఁ బొగడుచున్నారు. అతఁడు బొగడ్తకుఁ దగినవాఁడే కాని మీరు చేసినంత పొగడ్తకుం దగఁడు. గుణము లున్నంతవఱకే పొగడవలయును కాని లేని గుణము లారోపించి పొగడరాదు. అట్లు పొగడుటవలన మనుష్యులు తమంతవారు లేరని గర్వింతురు. గర్వము మనుష్యుంకి నాశము తెచ్చును. తగని పొగడ్త యెంతవానికైన ననర్థదాయకము. పొగడ్త చేసినవారు చేయించుకొన్నవారు కూడ నల్పులగుదురు. అందుచేత ధర్మరాజు గర్వోన్మత్తుఁడు గాకుండుటకును మీ రింక మీఁద యథార్థమునే చెప్పి పొగడుటకును నే నిట్లు సక్తుప్రస్థుని చరిత్రము చెప్పవలసె. కాకున్న నాకేమిపని? మీరు వేదవేదాంగవేత్తలు. సకలజన్మపరిజ్ఞాతలు. కావున నింక మీఁద మీ రెన్నఁడు వట్టిపొగడ్తలు పొగడవలదు" అని పలికి యాముంగి యెవ్వరికిం గనఁబడకుండ

నేదో కలుగులో దూరిపోయెను. ధర్మరాజు విస్మితుఁడయ్యెను. సభాసదు లచ్చెరువడిరి. తగని పొగడ్త సర్వానర్థములు దెచ్చు ననియు, సత్పురుషులవంటి లోకోత్తరచరిత్రుఁడు భూమి కలం కార మనియు నెల్లవార లభిప్రాయపడిరి.

—* కౌశికుఁడు. *—

కౌశికుఁడను బ్రాహ్మణుఁడు వేదాధ్యయనము చేసి కొనుచు నొక గ్రామసమీపమున నొక చెట్టుక్రింద వసియించు చుండెను. అతనియొద్ద సుగుణములు లేమియు లేవుగాని యతని స్వభావము కొంచెము కోపస్వభావము. ఒకనాఁ డతఁడు వేద ములు గుణించు కొనుచుండఁగా వృక్షశాఖమీఁదఁ గూర్చుం డిన యొకకొంగ వానిపై రెట్టవైచెను. అందుకు మిక్కిలి కోపించి కౌశికుఁడు కన్నులెఱ్ఱజేసి కొంగవంక జూచెను. తక్షణమే యది నేలఁబడి చచ్చెను. కౌశికుఁడు దానిఁజూచి మిక్కిలి జాలినొంది "అయ్యో! నాపాపమేమి కాల్పనా! తగినంత కారణములేక యీపిట్టం జంపితి. ఈపాపము నాకెత్తెఱంగునఁ బోవు"నని పలుతెఱంగుల విచారింపఁ దొడఁగెను. అంతలో మిట్టమధ్యాహ్న మయ్యెను. బ్రాహ్మణున కాఁకలి విశేష

ముగా నయ్యెను. అతఁడు మొదటినుండియు మాధుకరవృత్తిచేత జీవించుచుండిన వాఁడగుటచేత భిక్షాన్నము దెచ్చికొనుటకై గ్రామమున కరిగి యందొక్క గృహంబునకుం జని భిక్షాం దేహి యని యడిగెను. ఆయిల్లాలు బ్రాహ్మణునకు భిక్షము పెట్టుటకై పాత్రిక మాత్రము వెదకుచునుండ నంతలో నామె భర్త యెండఁబడి వచ్చెను. అతని కాఁకలిబాధ మెండుగా నుండెను. శరీరమంతట చెమట గారుచుండెను. మహాపతివ్రతయైన యాయిల్లాలు వెంటనే పీఠమువేసి భర్తను గూర్చుండఁబెట్టి చెమట పోవునట్లు విసరి చన్నీట స్నానము చేయించి మేను దుడిచి పరిశుద్ధవస్త్రములు గట్టనిచ్చి వంటశాలకుఁ గొనిపోయి సుఖాసీనుఁ జేసి చక్కగా నతనికి భోజనము పెట్టెను. భుజించిన పిమ్మటఁ దాంబూలమిచ్చి పాన్పుమీఁదఁ బండుకొనఁబెట్టి నిద్రపట్టువఱకు విసరి బైటకు వచ్చెను. కౌశికుఁ డంతవఱకు నబ్బ్రాహ్మణుఁ డింటిదరనే నిలిచియుండెను. మగఁడాఁకలిచే బడలివచ్చినందున సతినిం జూడఁగనే యాపడఁతి కౌశికుని మాటమఱచి మనస్సంతయు పెనిమిటిమీఁదనే నిలిపి యతని కుపచారములు చేయుటలోనే కాలమంతయుఁ గడపెను. మగఁడు నిద్రించినవెనుక నామెకు బ్రాహ్మణునిమాట జ్ఞప్తికివచ్చెను. వచ్చినతోడనే యొకపాత్రమున నన్నము కూరలు బెట్టుకొని యామె కౌశికునకుఁ బెట్టవచ్చెను. వాఁకిలి ముందర తన్నంతసేపు నిలువఁబెట్టినందుకు బ్రాహ్మణుఁ డాయిల్లాలిపై మిక్కిలి కోపించి యిట్లనియె. „అమ్మా! నేను

వచ్చినతోడనే నన్ను బ్రాహ్మణునిచో మఱియొకయింటికిఁ బోయి యుండుము. నీగుమ్మముముందర నన్ను జాముసేపు నిలువవేసితివి. ఇంత నిర్లక్ష్యమా? గృహకృత్యములు కాఁగానే నీకు లోకవృత్తి మఱకాఁబోలు! నీయిల్లు కాకపోయిన మఱియొకయిల్లాయె. పట్టెడన్నము పెట్టుటకో లేకో, యొకపూట నిలువఁబెట్టితివి. నీవెంత, నీయున్నయెంత? యనుచుండ నాయిల్లాలు వినయమున "బ్రాహ్మణుఁడా! నీయెడ నాకు నిర్లక్ష్యము లేదు. నీకు భిక్ష పెట్టుటకు నేను ప్రయత్నించుచుండ నింతలో నాభర్త కడు డస్సివచ్చె. ఆతని సేవ చేసి యన్నము పెట్టి వచ్చునంతలో నింత యాలస్యమయ్యెఁ గావున క్షమియింపవలయు" నని చెప్పెను. అదివిని బ్రాహ్మణుఁడు మఱింత మండిపడి "నీమగఁ డంత యెక్కువ, వేదార్థసంపన్నులైన మేమింత తక్కువా? భర్తకుపచారమని పేరు పెట్టి యింటికివచ్చిన బ్రాహ్మణుల నవమానింపఁదలఁచుచున్నావు కాఁబోలు! బ్రాహ్మణమాహాత్మ్యమెఱుఁగవా? బ్రాహ్మణుఁడలిగినా పర్వతములు భస్మపటలంబులగును. పట్టణంబులు మహారణ్యంబులగును. మహాసముద్రంబులు నామావశిష్టములగును. బ్రహ్మాండము తల్లక్రిందులగును. అట్టి బ్రాహ్మణుల బుద్ధిపూర్వకముగా నవమానించిన వారి గతి యేమియగునో తెలిసికొనుము. బ్రాహ్మణుల కోపమును నీమగఁడుగాని, నీమగనిని పుట్టించిన జేజేలుగాని నివారింపఁజాలరు. పతివ్రతవైనందుకు నీవు బ్రాహ్మణాపరాధమమా చేయుచున్నావు?" అని కఠినముగాఁ బలికెను. అన

వుడు నాపరమసాధ్వి యిట్లనియె ‹‹ అయ్యా ! బ్రాహ్మణుల మహిమ నేనెఱుంగక పోదునా ? అంత మూర్ఖురాలనుగాను. ఒక బ్రాహ్మణుఁడు సముద్రమాపోశనముగఁ బట్టి జలమంతయు నాపోశనముగఁ ద్రాగె. ఒకఁ డింద్రద్యుమ్న మహారాజును నూసరవెల్లిఁగమ్మని శపించె. ఒకమహాముని త్రిశంకుని స్వర్గభ్రష్టునిఁ జేసె. ఇంతమాత్ర మెఱుఁగకపోలేదు. నాతెఱంగుఁ జెప్పెద వినుము. పతియే నాకు దైవము. పతియే నాకు బంధువు. పతియే నాకు ప్రాణము. పతియే నాకు ధనము. పతియే నాకు సర్వము. అట్టిపతి కుపచారము సేయుటకంటె నాకు ముఖ్య కర్తవ్యము లేదు. అతనికి తరువాతనే బ్రాహ్మణులు. అతని తర్వాతనే తలిదండ్రులు. అతని పూజ సేసినతర్వాతనే దేవతాపూజ. కావున నేను భర్త్రుపచారము సేయుచు నీమాట మఱచియుంటిని. అయినను నేను విద్యాగంధము లేని యాఁడుదానను గదా ! ప్రపంచజ్ఞానము లేనిదానను గదా ! మీరు మగవారు. చదువుకొన్నవారు. అనుభవజ్ఞానసిద్ధులు మీరు మావంటి యబలలు చేసిన తెలివిమాలిన పనులను సహించి మమ్మనుగ్రహింపవలయును. నాపై నలుగకయుందువేని నీకు హితోపదేశముచేసెద ! నీవు కోపస్వభావము గలవాఁడవు. శాంతమే బ్రాహ్మణుని సొమ్ముగా నుండవలయును. కోపముగలవాఁడు నశించును. కోపము విషముకంటెను నగ్నికంటె దారుణమైనది. బ్రాహ్మణున కెంతమాత్రము కోపముండఁగూడదు. కోపమును బరమశత్రువుగ నెంచి దానిం దూరముగఁ

దోలవలయు. అట్లు పారదోలక పోవుట చేతనే నీవు నేఁటియుద యమున నీపై రెట్టవేసిన దను కారణమున నొక కొక్కెరను జంపితివి. ఇది నే జూడక పోయినను నా పతివ్రతామహాత్మ్యము వలనఁ దెలిసికొంటిని. కోపస్వభావముగల వానికి భూతదయా స్థాన ముండదనుమాట కీచరిత్రమే యుదాహరణము. ఈకోప మును నీవు పరిత్యజింపవలయు. ఇట్టినీతులు చెప్పుటకు నేనె వర్తను? నేను విద్య యెఱుంగని మూఢురాల నని యిదివ ఱకే మనవిచేసి యుంటిని. నీకోపము పోవునట్లు, నీకు సకల సద్గుణములు గలుగునట్లు ధర్మోపదేశము చేయఁగల మహాను భావుఁ డొక్కఁడు గలఁడు. అతఁడు మిథిలానగరములో నున్నాఁడు. కులమున నతఁడు కటికవాఁడు. అతని పేరు ధర్మ వ్యాధుఁడు. అతనికడకు నీవు పొమ్ము! సకల ధర్మరహస్యములు నీవతనివద్ద నెఱుఁగుదువు. ఆమాటలు విని కౌశికుఁడు మిక్కిలి యక్కజపడి చేతులు జోడించి నమస్కరించి యిట్లనియె. ‘‘అమ్మా! నీవు మహాపతివ్రతవు, నేను పరమమూర్ఖుఁ డనై నీమహాత్మ్య మెఱుఁగక నిన్ను నిందించితిని. నాదుండగము నీవు సైరింపవలయు. నీవన్నట్లు నిజముగా నేను కోపస్వభావుఁడనె. నానిమిత్తమున నొక్కకొక్కెర చచ్చినమాట నిజము. కాని కిరాతుఁడు నాకు నుపదేశము చేయునంటివి; బ్రాహ్మణుఁడను. శ్రోత్రియుఁడను; కులీనుఁడను. వేదాధ్యయనసంపన్నుఁడను. పరమ నైష్ఠికుఁడను. మాంసవిక్రయము చేసి జీవించు కిరాతుని కడకుఁ బోయి నేను ధర్మములు నేర్చుకొనవలసినదా ?

ఇది నాకు మిక్కిలి కష్టముగా నున్నది. కాదు కూడదు నీవు వెళ్ళుమందువా తప్పక వెళ్ళెదను. ఉపదేశము నిమిత్తము మఱియొకనికడకుఁ బంపుదువా మిక్కిలి సంతోషింతును." అనవుడు బ్రాహ్మణునియిల్లాలు కౌశికునితో నిట్లనియె. "అయ్యా! నీవు బ్రాహ్మణుఁడవనియు, శ్రోత్రియుఁడ వనియు నే నెఱుఁగుదును. ధర్మవ్యాధుఁడు కులముచేతఁ గిరాతుఁడైనను, విద్యావినయసంపత్తిచేత బ్రాహ్మణుఁడే. అతఁ డనేకవేదవేత్తల కుపదేశము చేయ సమర్థుఁడు. అతనియొద్దకే శీఘ్రముగఁ బొమ్ము. సందేహింపకుము. గుణము ప్రధానముగాని కులము ప్రధానముకాదు" ఆమాటలు విని కౌశికుఁడు పరమానందభరితుఁడై సందేహము విడిచి తత్క్షణమే బయలుదేరి యడవులు గడచి నదులుత్తరించి, పట్టణంబులు పల్లియలు దాటి విదేహ దేశమున కరిగి దానికి రాజధాని యైనమిథిలానగరముం జొచ్చెను.

అట్లు మిథిలఁ జేరి ధర్మవ్యాధునియి ల్లెక్కడ నని విచారించి యాబ్రాహ్మణుఁడు పౌరులవలన వానియున్నచోటెఱిఁగి యాతావునకుఁ జని చూచునప్పటికి ధర్మవ్యాధుఁడు మాంస మమ్ముచుండెను. ఆతని ముందట నల్పమృగములమాంస ముండెను. మాంసము కొనుటకై వచ్చువారు, వచ్చి బేరమాడువారు, బేరంబు దొరకక వెళ్ళిపోవువారు, బేరము కుదిర్చికొని కొనువారు, విశేషముగ నుండిరి. మాంసపుప్రోగులు చూడఁగానే బ్రాహ్మణుఁ డేవగించుకొని

ధర్మవ్యాధునికడకుఁ బోఁ జాలక దూరముగా నొకచెట్టు క్రింద నిలువంబడి చూచుచుండెను. బుద్ధిమంతుఁడైన ధర్మవ్యాధుఁ డతనివృత్తాంతము నెఱింగి యంగడి విడిచి యతని కడకుఁ బోయి "బ్రాహ్మణుఁడా! కుశలమా నీకు. ప్రయాణము సుఖముగాఁ జేసితివా? ధర్మంబులు నేర్చుకొనునాసక్తి నీకు మెండుగఁ గలదు. పతివ్రతాతిలకమైనయాబ్రాహ్మణస్త్రీ నాకడకు నిన్నుం బంపఁ బరమభక్తుండవై నీవును వచ్చితివి. ఇంక నాలస్య మేల? మా యింటికిఁ బోదము రమ్ము." అని పలికి వానిని దనగృహంబునకుం దోడ్కొని పోయెను. కౌశికుఁడు వానిజ్ఞానమునకచ్చెరువడి తనలో నిట్లు తలంచెను. "నే నక్కజము మీఁద నక్కజము కనుఁగొనుచున్నాఁడను. నేను కొక్కెరం జంపినట్లు తనంతటఁ దానే యాబ్రాహ్మణస్త్రీ తెలిసికొనియె. ఇది మొదటి యక్కజము. ఆమె నన్నిక్కడికిఁ బంపె నని యీకిరాతుఁడు దనంతట తానే తెలిసికొనియె. ఇది రెండవ యక్కజము. పరమపతివ్రత యగుటచే నామెకు శక్తి గలిగియుండ వచ్చును. విజ్ఞానవంతుఁ డగుటచే నితని కిట్టిశక్తి గలిగియుండ వచ్చును. ఈతఁడు పూజనీయుఁడు. ఈతనివలన ధర్మరహస్యంబు లెఱింగి కృతార్థుఁడ నయ్యెద" నని నిశ్చయించి యాతని గృహంబునకుం జని యతనిచేఁ బూజితుం డై యి ట్లనియె. "అయ్యా! నీవు సకలధర్మంబుల నెఱుఁగుదువు. జంతువులను జంపి మాంస

మమ్మునట నీకు ధర్మమే? అహింస పరమధర్మం బని యార్యులు చెప్ప వినియుంటి. ఇంతటి జ్ఞానసంపన్నుఁడవు నీవిట్టిదుష్కర్మమునందుఁ దగుల్కొని యుంటఁ జూచి నా మనంబు మిక్కిలి చింతనొందుచున్నది. ఇంత నీచవృత్తి నీ వేల చేయవలయు?" అనవుడు ధర్మవ్యాధుఁ డతని కిట్లనియె. "బ్రాహ్మణుఁడా! విప్రులకు వేదాధ్యయన మెట్టిదో, రాజులకు దండనీతి యెట్టిదో, వైశ్యులకుఁ గృషి, వాణిజ్య, గోరక్షణంబు లెట్టివో, శూద్రులకు బ్రాహ్మణశుశ్రూష లెట్టివో, కిరాతులు మైనమాకు వేఁటయు, జంతుహింసయు నట్టిపరమధర్మంబులు. అదియునుఁగాక యిది నాకు వంశక్రమాగత మైనవృత్తి. నాతండ్రితాతలు వారిపూర్వులుఁగూడ నట్టివృత్తియందే జనయాత్రఁ జేసిరి. ఈ దేశమునకు జనకుఁడు రాజు. అతఁడు వర్ణాశ్రమధర్మముల మిగుల జాగరూకతతోఁ బరిపాలించుచుండును. కులవృత్తి నతిక్రమించినవాఁడు తనపుత్త్రుఁడైనను వానిని నిష్కరుణముగాఁ బట్టి దండించును. అందుచేత విదేహదేశంబున జన్మించినవా రందఱును దమ కుచితములయిన వృత్తులయందే ప్రవేశింతురు. కావున నేను బ్రహ్మజ్ఞానసంపన్నుఁడనయ్యు నాపితృపితామహులు చేసిన కులవృత్తియందె జీవితకాలము గడపుచుంటిని. ఈవృత్తియం దున్నప్పటికి నా చేతితో నే నొక్కజంతువునైనఁ జంపి యెఱుఁగ. చంపుచుండఁగా నేను జూడలేదు. ఇతరులు దూరమున జంపి

తెచ్చిన జంతువుల మాంసములు వారలదగ్గఱ వెలకుఁ గొని తిరిగి వానిని విక్రయించి పొట్టపోసికొనుచుంటిని. దురాశ చేత వస్తువులను ప్రియముగా విక్రయింపను. అబద్ధమాడను. పనికిమాలినపనులకు లంటఁగట్టను. కుళ్ళిపోయిన మాంస మెవరి కియ్యను. న్యాయముగా వచ్చిన ధనమునే యనుభవింతును. అతిథుల భుజియింపఁజేతును. అభ్యాగతుల నాదరింతును. శిష్టబ్రాహ్మణుల సేవింతును. పండితుల బహూకరింతును. సజ్జనుల సన్మానింతును. వృద్ధుల గౌరవింతును. దేవతల నర్చింతును. సత్యశౌచములను విడువను. పరదూషణ నేను చేయను. ఒరులు చేయుచుండఁగా నేను వినను. నన్ను స్తుతించినవారియందు నిందించినవారియందు సమానభావము వహింతును. ఏకపత్నీవ్రతుఁడను. ఇట్లు చేయుటం జేసి హీనకులంబున జన్మించినవాఁడనయ్యు బ్రహ్మజ్ఞానసంపన్నుఁడనై గౌరవార్హుఁడనై యుంటి. నీవు నాకడకు ధర్మంబుల నేర్చుకొనుటకై వచ్చితివి గావున నాకుఁ దోఁచిన ధర్మంబులఁ గొన్నిటి నెఱింగించెద. సావధానుఁడవై వినుము. తనకుం ధర్మమందుఁ బ్రవర్తిల్లుట యుత్తమోత్తమము. శాంత మన్నిటియందుఁ బ్రధానము. ఓరిమివంటిది మఱియొకటి లేదు. విషయములయందు వాంఛ విడువవలయును. వాంఛాపరిత్యాగమువంటి ధర్మము మఱియొకటి లేదని మహాత్ములు పలుకుదురు. స్వార్థత్యాగుల కసాధ్యమైనది లేదు. క్రోధలోభములు ముఖ్య

ముగా విడువవలయును. ఏకారణంబున నైన నేరిమీఁద నైనఁ గ్రోధంబు గలిగినయెడల దాని నన్నివిషయములం దుఁ బ్రసరింపఁజేయుట న్యాయముగాదు. క్రోధము మనంబునం బెట్టుకొని ధర్మము తప్పఁగూడదు. అపకారము చేసినవారికి నుపకారముసేయుట లెస్స. ఇతరుల కపకారము జేయువాఁడు తనదోషంబునఁ దానె నశించిపోవును. వానికి వేఱుకీడు జేయనక్కఱలేదు. ధర్మాత్ములు చేయుసత్కా-ర్యములయం దసూయగలిగి కొందఱు దురాత్ములు వానిం జెరుపం గోరుదురు. అట్టి దురాత్ములకు జడిసి యాధర్మంబు లపైఁ బ్రీతి విడువరాదు. ధర్మమే జయము నొందును. అధర్మము జయించునట్లు కొంతకాలము పైకగపడినను దుట్టతుద కది జయింపలేదు. మనుష్యులు పాపముచేయక మానరు. చేసినపాపములకుఁ దగిన ప్రాయశ్చిత్తము జేసి కొనవలయును. అట్టి యుత్తమ ప్రాయశ్చిత్తమునకు విధాన మిది. అయ్యో! యీపాప మేల చేసితినని వగచినందున సగముపాపము పోవును. ఇఁక ముం దెన్నఁడు నిట్టిపాపము చేయనని ప్రతిన చేయుటచేతఁ దక్కినపాపము నశించును. ఈప్రాయశ్చిత్తము పేరు పశ్చాత్తాపము. పశ్చాత్తాపము నకు మించిన ప్రాయశ్చిత్తము లేదు. పాపము లన్నిటిలోఁ గ్రోధలోభము లధికములు. వాని జయించినవాఁడె ధర్మ శీలుం డనం బఱఁగు. నేను జేయునది హింస యని నీవు మొట్టమొదటఁ బల్కితివి. హింస తెఱఁగు గొంత జెప్పెద

వినుము. హింసచేయక మనుష్యుఁడు జీవింపలేఁడు. మనుష్యుఁడే యననేల? హింసజేయక యేజంతువులును బ్రదుకలేవు. కొన్నిటికిఁ జెట్లు మొక్కలాహారమై యున్నవి. కొన్నిజంతువులకు జంతువు లాహారమై యున్నవి. మఱికొన్ని జంతువుల కాకులలములు లాహారములై యున్నవి. పులియు సింగము మాంసమే గాని భక్షింపవు. ఏనుఁగులు మేకలు శాకములే గాని యారగింపవు. మనుష్యుఁడు మాంసముల శాకములఁ గూడ నారగించును. ఆహారమునిమిత్తముద్భిజ్జములను జంతువులను హింసింపక వలనుపడదు. హింస చేయక పోయినపక్షమున క్షణమాత్రమైన జీవింపలేఁడు. అందుచేత హింస యావశ్యకము. హింస లేకపోయినపక్షమున పులి యెట్లు జీవించును? మనుష్యుఁడు మాంసము వర్జించినను శాకములనిమిత్తమైనను వృక్షములు హింసింపవలయు. ఒక్క భోజనమునిమిత్తమే గాక నెలిసియుం దెలియక మనుష్యుఁడు సదా హింస చేయుచుండు. మనము నడచునప్పుడు కాలిక్రిందఁ బడి దున్నునప్పుడు నాగలిక్రిందఁ బడి యనేక జంతువులు చచ్చుచున్నవి. నీటిలో జంతువు లున్నవి. వాయువులో జంతువు లున్నవి. నీరు ద్రాగునప్పుడు గాలి పీల్చునప్పుడు మన యిచ్ఛలేకయే యనేకజంతువులు నశించును. అది నివారింతుమన్నను మనవశము కాదు. ఇది ప్రపంచప్రకృతి. ఐనను మాంసము మొదలగునవి వర్జించుట పరమధర్మము. శాకముల హింసించుట తప్పకపో

యినను జంతుహింస లేకపోవుటవలన గొంతమేలు. ఇట్టి ధర్మంబు లనేకములుగలవు. ధర్మసూక్ష్మంబు దెలిసికొనుట మహాత్ములకైనఁ దరము గాదు. ముఖ్యముగాఁ గామక్రోధలోభముల వర్జించి ప్రతిదినము దేవతాప్రార్థన చేసికొనుచు సజ్జనులతోడ మైత్రి నెరపి యాపత్కాలంబున నైతము ధర్మమార్గము దప్పక జీవించుచుండును. అందువలన నీకు నిహపరంబులు గలుగు" నని చెప్పిన విని కౌశికుండు మిక్కిలి సంతసించి యాతనికి నమస్కరించి తన గృహంబునకుం జనియెను.

హంస—కాకి.

ఒకపట్టణమున ధనవంతుఁడగు వైశ్యుఁడొకఁడుండెను. అతనిబిడ్డలొక్కచోఁ జేరి యాడుకొనుచుండఁగా నొక కాకిపిల్ల వారిసమీపమున బడెను. దానిని సంతోషమునఁ దీసికొని యాబిడ్డలు దినదినము తమయెంగిళ్ళు పెట్టి దానిం బెంచిరి. అదియు మిక్కిలి క్రొవ్వి గర్వించి ప్రపంచమునఁ దనసాటిపక్షులు లేవనియు, బ్రహ్మదేవుఁడు సృష్టించిన సమస్తపక్షిజాతములకుఁ దాను సార్వభౌముఁడ'ననియు భావించి యెవ్వరిని సరకుసేయక యుండెను. అటు

లుండ నొక్కనాఁడు గరుత్మంతునకు సాటి యని చెప్పఁ దగిన హంసలుకొన్ని సముద్రతీరమున వ్రాలియుండ వైశ్య పుత్రులు కాకికి హంసలంజూపి యిట్లనిరి. ఓపక్షిరాజ! నీవు పక్షులకన్నిటికిఁ జక్రవర్తివి. నీవలె శ్రావ్యముగాఁ గూయఁ గలపక్షి లేదు; నీవంటి యందమైన పులుఁగు లేదు. నీలాగున నెగిరి పరువెత్తఁ గలవిహంగము లేదు. ఈహంసలం జూడుము. లోకులు మూర్ఖులై హంసలే పక్షులలో శ్రేష్ఠములని భావించుచున్నారు. నీగుణములు జనులెఱుఁగ కిట్లు భావించుచున్నారు. ఇప్పుడీహంసలతోఁ బందెమువైచి పరుగున వానిం గెలిచి లోకమునకు నీయమేయసామర్థ్యముం దెలుపుము. పెంచి పెద్దదానిని జేసినందుకు మాకు గొప్ప కీర్తిఁదెమ్ము" అనవుడు వాయసము నిజముగాఁ దాను పక్షులకెల్లఁ జక్రవర్తియని స్తోత్రముచేత నుబ్బిపోయి తనశక్తి నెదుటివారిశక్తి నరయఁ జాలక యాహంసల సమీపమునకుఁ జని యందు బలమైన హంస నొకదానిఁ బిలిచి యిట్లనియె. "హంసలు గగనమార్గమున మిక్కిలి నేర్పుతోఁ బరువెత్తఁగలవని వినుచుందును. ఏదీ మీచమత్కార మొక్కసారి జూపుఁడు ? నాతోఁ బరువెత్తి నన్ను గెల్చినపక్షమున మీరట్టిపేరునకుఁ దగినవారు. లేనియెడ మీ కాపేరు తగదు. మాకాకిజాతిని లోకు లధర్మపరులై నిందించుచున్నారు. ఆనింద నేఁడు బాపెద. ధైర్యమున్నపక్షమున నీవు నాతోఁ బరు

గెత్తుము. నీవు జాలకపోయినపక్షమున మీలో బలమైన దానిని రానిమ్ము. ఎవరు వచ్చినను సరె? హంసల పేరు నేఁటితో సరి. మీజాతిలో నొకటి బ్రహ్మదేవునకు వాహనమైనదని మీరు గర్వసమ్మత్తులై మిన్నుమన్ను గానకయున్నారు. ఆగర్వమంతయు నడఁగించెద. బలమున్నచో నాతోఁ బరుగెత్తుఁడు! లేదా నాకుఁ బ్రదక్షిణముజేసి నమస్కరించి లేచిపొండు?" అని పలుక దాని కోతలు విని హంసలు నవ్వి యిట్లనియె. "మేము మానససరస్సున నుందుము. బ్రహ్మదేవునకు మాజాతిలో నొకటి వాహనమైనమాట నిజము. గరుత్మంతుని తరువాత జవసత్త్వములుగల పక్షులము మేమనుట నిజము. ఈమూఁడు కారణములచేత గర్వించుటలేదు. ఐనను నీతోఁ బరువెత్తుటకు భయములేదు. మాలో మిక్కిలి బలహీనమైన దానితోఁగూడ నీవు బరుగెత్తఁ జాలవు. అట్లుండియు మిక్కిలి బలము గలదానవే యని యనుకొంటివి. ప్రపంచము పుట్టినది మొదలు నేఁటివఱకు ననేకపక్షుల వృత్తాంతము మేము విని కనియుంటిమి కాని హంసలతోఁ బందెము వైచిన వాయసములు మే మెఱుఁగము. నీసాహసము మాకు మిక్కిలి యాశ్చర్యము గలిగించుచున్నది. రూపమునందా మసిబొగ్గువలె నుందువు. మేము శుభ్రమైన జంతువులము. నీకంఠధ్వని కర్ణకఠోరము. మాధ్వని శ్రావ్యము. నీవు విశేషజవము లేనిదానవు. మేము మహాజవసంపన్నుల

ము. ఇట్టిమాత్రోడ నీవు పంతగించి పరుగెత్తఁదలఁచుట మహాశ్చర్యకరము." అని హంసలు పలుక నక్కాకి వాని కిట్లనియె. "హంసలారా! ఈలోకమున గొప్పతనము సాధారణముగాఁ బ్రజ్ఞనుబట్టి రాదు. పరుగురు జేరి యభిమానముచేత గోరంతలైన యొకని గుణంబులు కొండంతలు చేసి సమయమగునప్పుడు కానప్పుడు పొగడి వానిని గొప్పవానిం జేయుదురు. కొందఱు ప్రజ్ఞ లేకపోయినను నదృష్టవశమున గొప్పవారగుదురు. అదృష్టము లేనప్పుడు, ప్రజ్ఞాధురంధరులయ్యు గొప్పవారు కాఁజాలరు. హంసలు రూపముచేతను శబ్దమాధుర్యముచేతను, బలముచేతను, గొప్పవి కాకపోయినను, దేవతాపక్షపాతముచేత గొప్పతనము వహించినవి. ఆపక్షపాతము లేకపోవుటచే మేమధముల మైతిమి. దానికేమి? అది యటుండనిండు! నేను నూఱువిధములుగాఁ బరుగెత్తఁగలను. అడ్డముగాను నిలువుగాను గుండ్రముగాను వంకరగాను మూలగాను పక్కగానునధోముఖముగను నూర్ధ్వముఖముగను నే బరువెత్తినట్లు వేయేండ్లు మీరు తపస్సుచేసినను మీరుబరుగెత్తఁజాలరు. ఇంక నెన్నో చిత్రవిచిత్రగతులు నాకడ గలవు. అవి చెప్పుటకంటె చేసి చూపుట మంచిది. కావున గమనకాలమున మీకవి జూపెద! నాపరుగు జూచి మీహంసము లెల్ల మొదట భయంపడును. పిమ్మట సిగ్గు జెందును. కాకికులము మహానందము నొందును" అన మున్న కాకి యేరు

కొన్ని హంసము ముందుకువచ్చి వాయసమా ! ఇన్నిగతు లక్కరలేదు. పక్షులన్నియు సామాన్యముగా నెగురు నట్టి విధమున మన మెగురుదము రమ్ము ! అని పిలిచెను. అప్పుడు కాకి చుట్టములన్నియు దానిచుట్టునుండెడి హంసం జూచి ,,హంసమా ! నీకు పిచ్చిమెత్తినదా ? నూరుగతుల నెఱిగిన నీకాకితో నొక్కగతిమాత్రమే యెఱిగిన నీవేమి? పరుగెత్తుటేమి? మార్గమధ్యంబునంబడి చచ్చెదవు. ఇంతకు నీసాహసము పండినది. పోపొమ్మ'ని పరిహసించెను. అంతట కాకియు హంసము నాకసంబున కెగిరి సముద్రముపైc బరువెత్తcజొచ్చెను. రాజహంస మునుముందు మందగతిం బరువెత్తెను. కాకి తన ప్రజ్ఞయంతయు నొక్కమారుగc జూపవలయునని మిక్కిలి ప్రయాసపడి కడువేగంబునం బరువెత్తి హంసం గడచి చని హంసవచ్చునంతకు నిచ్చటనాగి దానిని నెక్కిరించుచు మిక్కిలి యాయాసపడెను. అట్లు కొంత దూరము పరుగెత్తునప్పటికి వాయస మలసిపోయెను. అది కనిపెట్టి హంస తనబలమంతయు జూపి మహావేగమున బరుగెత్తసాగెను. కాకి పరుగెత్తలేక వెనుక మెల్లమెల్లన రాcజొచ్చెను. ,,అయ్యో ! నూరుగతులు నేర్చినదానవు. ఇప్పుడొకగతియైనది. మఱి యేగతిలోc బరుగెత్తుదమని హంస కాకి నడుగుచుండ నావాయసము ఱెక్కలపటుత్వముదప్పి సముద్రమునంబడి హంసనుజూచి ,,హంసరాజమా! నన్ను రక్షింపుము ! బుద్ధినేరక నేనిట్టిసాహసమునకుం

దోఁగొంటిని నాకాకులతోఁ' నన్ను గలుపుము; నీకెంతో పుణ్యముగలదు" అని దీనముగాఁ బ్రార్థించెను. ఆవేడుకోలు విని హంస జాలినొంది యిట్టి చేతగానిపనులెన్నడు చేయకుమని బుద్ధిచెప్పి దానిని తోడికాకులయొద్దకుఁ దీసికొనిపోయి యొప్పగించెను.

అంబ.

కాశీరాజునకు ముగ్గురు కూఁతులు కలరు. అంబయనునది పెద్దకూఁతురు. అంబికయనునది రెండవకూఁతురు. అంబాలిక యనునది తృతీయపుత్రిక. ఈముగ్గురుపుత్రికలు యుక్తవయస్కలై వివాహయోగ్యలై యుండుటంగని తండ్రి వారికి స్వయంవరము చాటించెను. ఆనాఁటి రాజకుమారులందఱు కాశీరాజపుత్రికల వరింప నిండువేడుకతో నచ్చోటికి వెళ్ళిరి. శంతనుమహారాజపుత్రుఁడును గాంగేయుఁడునైన భీష్ముఁడు తండ్రి చనిపోయినప్పటికి తన తమ్ములగు చిత్రాంగదుఁడు విచిత్రవీర్యుఁడు బాలకులైనందున వారిపక్షమున తాను భూభారమువహించి న్యాయముగా నేల యేలుచుండెను. చిత్రాంగదుఁడు చిత్రాంగదుఁడను గంధర్వునితో యుద్ధముచేసి మృతినొందెను. భీష్ముఁడు

విచిత్రవీర్యునకుఁ బట్టముఁగట్టి యతనికి వివాహము చేయవలెనని సంకల్పించి కాశీరాజకుమారికా స్వయంవరమునకుఁ దమ్ముని వెంటఁబెట్టుకొనిపోయెను. అక్కడ రాజులనేకులు చేరిరి. భీష్ముఁడు వారినందఱ సంగ్రామమున జయించి కాశీరాజపుత్రికల ముగ్గురను తన రథముమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని జయజయధ్వనులతో హస్తిపురమునకుఁ బోయి కన్యకల ముగ్గురను సత్యవతీదేవికిఁ జూపి యామె యాజ్ఞప్రకారముగా వారిని విచిత్రవీర్యునకిచ్చి వివాహము చేయ నిశ్చయించెను. అప్పుడు వారిలో నంబ భీష్మునితో నిట్లనియె. ,,రాజకుమారా ! నిరంతర ధర్మాచరణమునకుఁ బ్రసిద్ధికెక్కిన చంద్రవంశమున జనించినవాఁడవు. సజ్జనగరిష్ఠుండగు శంతనుని పుత్రుండవు. తండ్రిసుఖము నిమిత్తమై రాజ్యాధికారము వదలుకొని వివాహముపై కామముమానుకొని బ్రహ్మచర్యదీక్షాపరతంత్రుఁడవై మహాఋషులయొక్కయు దేవతలయొక్కయు మెప్పునకు పాత్రమైనవాఁడవు. ధర్మపరాయణుఁడైన నీయట్టి మహనీయునితో నా మనోగత మైన యభిప్రాయము చెప్పుట సమంజస మని నేనుమనసిచ్చి మాటాడుచుంటిని. నేను యుక్తవయస్కురాలనైనదిమొదలుకొని సాళ్వునియందు మనసు నిలిపియుంటిని. అతని చక్కఁదనము నామనసునకు నచ్చినది. ఆతనిరూపము నాకనులపండువొనర్చినది. అతని గుణసంపద నావీనులవిందొనర్చినది. అతనిసౌజన్యత నాహృదయము నాకర్షిం

చినది. అతఁడే నామన్మథుఁడు; అతఁడే నాప్రాణనాయకుఁడు. అతఁడే నావలపుఁరాశి. అతనిమీఁద నాచిత్తము లగ్నమై యున్నది. మీకెఱుఁగుదు చక్కనివాఁడే. సత్కులప్రసూతుఁడే. గుణసంపన్నుఁడే. విశాలహృదయుఁడే. దయామయుఁడే. రాజవంశాంకుఁడే. ఐనను నామనస్సు విచిత్రవీర్యునియందుఁ దగులలేదు. సాల్వునిమీఁదనుండి మరలలేదు. కావున నాయందనుగ్రహించి నన్ను సాళ్వునియొద్దకుం బంపుము. మాయిరువురమనంబులలో నూతనముగఁ బొడమిన యనురాగాంకురమును నశింపఁజేయుట నీవంటివానికి భావ్యము కాదు. దంపతుల మనస్సులు కలసినప్పుడే కాని దాంపత్య మనుకూలము కాదు. దంపతుల కొండొరులపై ననురాగము కుదిరినగాని సంసారచక్రము సరిగా నడువదు. నాకు విచిత్రవీర్యునిపై ననురాగము లేదు. అట్టిమొదల నే నాయన కిల్లాలినై యుంటినా నాకు సుఖములేదు. ఆయనకు సుఖములేదు. మాయిరువురజీవనము దుఃఖభాజనమగును వివాహమాడఁ దలఁచితినా సాల్వునే వివాహమాడెదను. లేదా నీ వలె జన్మాంతమువఱకును బ్రహ్మచర్యదీక్షనే బూనెదను. ఎన్నఁడు సాళ్వనృపాలు ముఖారవిందదర్శన మగునో, ఎన్నఁడాతని చరణారవిందసేవ లభించునో, ఎన్నఁడాతని గాఢాలింగనభాగ్యము పట్టునో, ఎన్నఁడాతని పట్టపుదేవి ననిపించుకొను పుణ్యము సంప్రాప్తించునో, ఎన్నఁడాతని శిరోభాగంబున ముత్యాల

తలంబ్రాలు పోసి నా హస్తములు ధన్యములు చేసికొందునో, యని యుత్సహించుచుంటిని. అందుచేత నామనోరథము భగ్నము చేయవలదు. ప్రాకుచున్న నాకోరికతీగలను ద్రుంపివేయవలదు." అని చేతులు రెండును శిరస్సున జేర్చి మ్రొక్కెను. ఆమాటలు విని విచిత్రవీర్యునితల్లియైన సత్యవతీదేవి కరుణార్ద్రహృదయయై భీష్మునికిట్లనియె. "కుమారా! ఈ బాలికపలుకులు మన కాదరణీయములు. ఒకని యందు నిగ్నచిత్తయైయున్న యువతిని మఱియొకనికిచ్చి వివాహము సేయుట యధర్మము. ఈమె మనసులో నెన్నో కోరికలున్నవి. హృదయమున నెన్నో ముచ్చటలున్నవి. సాళ్వుని చెట్టబట్టవలెంగాని యవియెల్ల సఫలము కావని యామెయభిప్రాయము. అందుచేత నీమెను విడిచిపుచ్చుట పరమధర్మము." అనవుడు భీష్ముండు సవతితల్లి నుద్దేశించి యిట్లనియె. "అమ్మా! సనాతనార్యుల ప్రాదుర్భావకాలంబున యువతీజనంబుల మనంబులు గుర్తించు కోరికల తెఱంగు నే నెఱుంగనిదికాదు. అన్యోన్యానురాగము లేని పెండ్లి బొమ్మల పెండ్లి. మనంబులు పొసగని దంపతులు చిత్తరువులందు లిఖింపబడిన దంపతులు. అందుచేత నీమెను విచిత్రవీర్యున కిచ్చి పెండ్లి చేయుట యధర్మము. అధర్మమేగాక హానికరము. అందుచేత నే నీమెను విడిచిపుచ్చెద. పురూరవచక్రవర్తి మొదలగు లోకోత్తరచరిత్రులు ప్రభవించిన చంద్రవంశమున జన్మించి శంతనమహారాజపుత్రుండనై, నే నధర్మము

చేయుదునా? నీయాజ్ఞప్రకారము నామెను సాళ్వునియొద్దకే పంపెద." నని యంబికను నంబాలికను జూచి కన్యలారా! మీయభీష్ట మెట్లున్నదని యడిగెను. ఆబాలికలిద్దఱు సిగ్గు నందలవంచి మేము విచిత్రవీర్యునే వివాహమాడెద మని మృదుమధురస్వరంబున బలికిరి. పలుకుటయు భీష్ముఁడు తత్క్షణంబ యంబను రథమెక్కించి సగౌరవముగ సపరివారముగ, సబహుమానముగ నామెను సాళ్వునియొద్దకుఁ బంపెను.

అనంతరము మంచిముహూర్తము నిశ్చయించి యంబికను నంబాలికను విచిత్రవీర్యునకు మహావైభవముతో వివాహముచేసెను. కురువంశము మహోన్నతదశనందునని భీష్మాదులందఱు సంతసించిరి. అంబ హస్తిపురము విడిచి సాళ్వునియొద్దకుఁ జని యాతనిదర్శనము చేసి తన్ను వివాహమాడుమని కోరెను. అనవుడు సాళ్వుఁ డిట్లనియె. "కళ్యాణీ! నిన్ను వలచినమాట నిజము. నీవు నాపైఁ గూర్మి నిలిపిన మాట యథార్థము. కాని నానారాజకుమారులు జూచుచుండ భీష్ముఁడు నిన్ను విచిత్రవీర్యున కిచ్చి వివాహము చేయవలెనని రథముపైఁ గూర్చుండఁబెట్టికొని తీసికొని పోయెను. ఆతని యింట గొన్నినాళ్లుంటివి. అచ్చటనుండి యేలవచ్చితివో నే నెఱుంగను. పరునే వివాహమాడఁ బోయి పరగృహవాసము చేసివచ్చిన పడతిని వివాహమాడ నేనంత వెంగలినా? నిన్ను నేను వివాహమాడను.

అట్లుచేయుట నాకు రాజకులములో నప్రతిష్ఠ కావుటం బోము౹౹

అట్లు సాళ్వుఁడు తన్ను వివాహమాడుట కిష్టము లేక నిరాకరించుటకు విషాదసముద్రమగ్నమానసయై యంబ యాతని నుద్దేశించి యిట్లనియె. "రాజకుమారా! జ్ఞానము వచ్చినది మొదలు మనంబున నిన్నే వరించికొంటిని. నీహస్తమే కాని మఱియొకనిహస్తము పట్టఁదలఁచుకొనలేను. ఈయాపనము నీపాలుగావలసినదే కాని యన్యులపాలు కాఁగూడదని నాసంకల్పము. ఇట్టిదానిని నన్ను నీయందే బద్ధచేతస్కురాలనైన నన్ను గతిలేనిదాన్ని ద్రోసిపుచ్చుట న్యాయముకాదు. నాయంతట నేను వచ్చి ముగ్ధభావము విడిచి నోరుతెఱచి యిట్లు యాచించినందుకే నన్ను స్వీకరింపవచ్చును. పీటలమీఁది పెండ్లిఁ జెడఁగొట్టుకొని వచ్చితిని. భీష్ముఁడు కురుకులప్రదీపకుఁడును దయతముఁడు నగువిచిత్రవీర్యున కిచ్చి నన్ను బెండ్లి చేయ సిద్ధముగానుండఁగా నేను సాళ్వునిఁ దక్క మఱొక్కని వివాహమాడనని యాతనిమాట కెదురాడి పట్టుపట్టి వాని చేత సగౌరవముగా విముక్తురాలనై పుట్టెడాసతో నీతావునకు వచ్చితిని. తోఁబుట్టువులలో నేనే జ్యేష్ఠురాలనగుటం జేసి విచిత్రవీర్యునిపట్టపు దేవినై కురురాజగృహలక్ష్మినై సత్యవతీదేవికి ముద్దుకోడలనై సామంతరాజపత్నులు పరిచర్యలు సేయుచుండ నిందాద్రిని మించిన వైభవముతో నుండి యుందును. నీనిమిత్తమవియెల్ల జెడఁ గొట్టుకొని వచ్చితిని.

వచ్చినందుకు నామనోరథము భగ్నము చేసితివి. నాయాశ లడుగంటం జేసితివి. నాకోరికలతీగలు కోసివేసితివి. కౌరవుల గృహంబున నేనొక్కరాత్రియైన నిద్రపోలేదు. పట్టెడన్నమైన దినలేదు. పుడిసెడునీరైనం ద్రాగలేదు. భీష్మునియింట నేనుంటినని యనుమానించితి వేమో? భీష్ముఁడు నాకు తండ్రివంటి వాఁడు. నాశరీర మపవిత్రము కాలేదు. నాచరిత్ర కళంకితము కాలేదు. నామనస్సు మలినముకాలేదు. ఇందుకు భీష్ముఁడు సాక్షి. సత్యవతీదేవిసాక్షి. కావున నన్ను స్వీకరింపుము." అని వేఁడుకొన సాళ్వుఁడిట్లనియె. "సుందరీ! నీవేల నన్ను బాధించెదవు! నీవు నన్నుఁ గామించినట్లే నిన్ను నే గామించితిని. కాని దైవ మన్యథా తలంచెను. నీవు చెప్పినయుక్తులు నామనంబునకు నచ్చలేదు. నీవు పవిత్రచరిత్రవే కావచ్చును. నీవు యోగ్యురాలవేయై యుండవచ్చును. కాని రాజకుమారులందఱుఁ జూచుచుండ నిన్నును నీచెల్లెండ్రను బట్టుకొని భీష్ముఁడు రథముపైఁ గూర్చుండఁ బెట్టుకొని తీసికొని పోయినదానిని పరపురుషునిచేతఁ జిక్కినదానిని, పరపురుషునియింటఁ గొంత కాలమైన నున్నదానిని, నేనెట్లు వివాహమాడఁ గలను. నేనును నలుగురురాజులలోఁ దల యెత్తుకొని తిరుగుచున్న వాఁడను. నా గౌరవము నావంశగౌరవముఁ బాటింప వలదా? నేను నిన్నుఁ బాణిగ్రహణము చేసికొనను. ఇది యంతఃకరణ శుద్ధితోఁ జెప్పినమాట. వేఁడుకొనుట విలపించుట నిష్ప్రయోజనము. ఇంక నీ యిచ్చవచ్చిన తెఱంగునఁ బొమ్ము! నా నన్ని

ధిని క్షణకాలమైన నిలువవలదు." ఆకర్తినోక్తులు వినఁగానే యంబ కొంతసేపు కదలఁజాలక యెట్టకేలకు రాజసన్నిధిని బాసి యూవలకుఁబోయి తన్ను మున్ను తెచ్చిన రథ మెక్కి మరల భీష్మునిపాలికిఁ జనియెను. భీష్ముఁడామెను సగౌరవముగ నాదరించి మరల వచ్చినపని యేమియని యడిగెను. అనవుడు నామె యిట్లనియె. "రాజకుమారా! నీవద్ద శలవు పుచ్చుకొని నేను సాళ్వునిసన్నిధి కరిగి నన్నంగీకరించుకొని చిరకాలప్రేమబంధముఁ దెలిపి వివాహమాడుమని కోరితిని. నీవు నన్నుఁ బట్టుకొని హస్తిపురమునకుఁ గొనిపోవుటచేతను నీయింట నేను గొన్నిగడియలసే పుండుటచేతను నన్నతఁడు పాణిగ్రహణము చేసికొనుటకు సమ్మతింపలేదు. నీవలన నాకీయపకారము జరిగినది. చిరసంకల్పము భగ్నమైనది. కావున నన్ను నీతమ్మునకుఁ బెండ్లి సేయుము. అప్పుడు నా మన స్సూరటఁ బొందును." అనవుడు భీష్ముఁడు మొగమున చిఱునగ వంకురింప నామెతో నిట్లనియె. "కన్యాక! నీవు చెప్పినదెన్నటికిం బొసఁగ నేరదు. నిన్ను నేను దెచ్చినప్పుడు సాళ్వుఁడే నీ ప్రాణనాయకుఁడని సాళ్వుఁడే నీ మన్మథుఁడని యతనినే కాని వరింపఁ దలఁచుకొనలేదని విస్పష్టముగాఁ జెప్పితివి. పరపురుషునిమీఁద మనసుదగులుకొనినదానిని నా తమ్మున కిచ్చి యెట్లు వివాహము చేయఁ గలుగుదును? అంతకంటె నవివేక మొండుగలదె! అట్టియిల్లాలు యున్న సంసార మెన్నటికైన బాగుపడఁగలదె? భర్తకు సుఖ ముండునె? చిత్తము సాళ్వునివద్ద

శరీరము విచిత్రవీర్యునివద్ద నున్నదానితోఁ గాపురము సేయుటెట్లు? ఇది హాస్యాస్పదము కాదా? నే నెంతో గౌరవముతో సత్యవతీదేవిసమక్షంబున విచిత్రవీర్యునకు నిన్నును నీ చెల్లెండ్రనిచ్చి వివాహము చేయుదునని సంకల్పింప నా మాటఁ ద్రోసిపుచ్చి సాళ్వునిసన్నిధి కరిగితివి. అట్టిదానిని నిన్ను నే నెట్లు మాతమ్మునికి వివాహము చేయుదును? కురుకులము నగుబాట్లపాలు సేయుట నా కిష్టము లేదు. కావున నీవు మాతమ్ముని వివాహ మాడవలయు ననునాస విడిచి యథేచ్ఛముగఁ బొమ్ము. ఇది నీ స్వయంకృతాపరాధము గాని మా దోసము గాదు. ఇందు నిన్ను నీవే నిందించుకొనవలయును. లేదా నీకర్మమును దూరుము. ఇఁకఁ బొమ్ము!" అని భీష్ముఁడు పలుక నంబ తన మనోరథము లెల్లవిధముల భగ్నమైనందుకు బిట్టువగచి వివాహములేక యల్లరిపాలైన బ్రతుకు ప్రపంచంబున బ్రతుకుటకంటె యరణ్యంబున కేగి తపోనిష్ఠమైయు కాలక్షేపము చేయుట సముచితమని విచారించి యడవికరిగెను.

నారచీరలుకట్టి జడలుదాల్చి యాభరణములు ద్రోసిపుచ్చి యంబ యడవికరిగి యచ్చట నొక యాశ్రమమునకుఁ బోయి తపంబు జేయుట కుద్యమించుచుండ నచ్చట నదివఱకే తపము చేయుచున్న వానప్రస్థుఁడొకఁడు కడువృద్ధుఁడు దానిం జూచి, బిడ్డా! నీవృత్తాంత మేమి? రూపముజూడ రాజకన్యకవలె కనఁబడుచున్నదానవు. సకలభోగములకు నాశ్రయమైన యౌవనంబున నుండియు నీ విధంబున తపంబు సేయఁదలంపేల? నీకు

సంభవించిన యాపదయేమి" యని యడిగెను. అంబ యత నికి నమస్కరించి తనవృత్తాంతము సవిస్తరముగఁ జెప్పెను. అతఁడా బాలిక యుదంతమువిని యానందబాష్పములు కన్నుల నుండి స్రవింపఁ గౌఁగిలించి "అమ్మా! కాశీరాజపుత్రికవా నీవు. అంబవా? నీతల్లి నాకూఁతురు. నీ తండ్రి నాయల్లుఁడు. నీవు నా మనుమరాలవు. నీవుపుట్టకమునుపే నేను తపోవనంబునకు వచ్చియుంటిని. నాటనుండియు గాశీరాజకుటుంబ వృత్తాంత ములు నాకుఁ దెలియుటలేదు. నాయాశ్రమమే నాప్రపంచము. నాపర్ణశాలయే నాస్వర్గము. నాయాశ్రమజంతువులే నాకుటుం బము. నావృక్షములే నామిత్రములు. అమ్మా! భీష్ముని కతమున నీకింత యిక్కట్టు సంభవించినది. అతని నెట్లయిన నొడంబరచి నిన్ను విచిత్రవీర్యునకిచ్చి వివాహము చేయించెద. ఎట్లుచేయించెదవందువో వినుము. భీష్ముఁడు పరశురాముని శిష్యుఁడు. భార్గవుఁడతనికి ధనుర్విద్యాగురువు. పరశురాముఁడు నాకుఁ బ్రాణమిత్రుఁడు. క్షత్రియులలోకెల్ల నేనే యతనికి నిజ మైన మిత్రమును; అతఁడు నామాట తలదాల్చును. నేను స్వయముగ నిన్నతనికడకుఁ దీసికొనిపోయి చెప్పవలసినమాటలు చెప్పి యతనిచేత భీష్మునకుఁ జెప్పించి నీమనోరథసిద్ధి జేయించెద. సాళ్వుఁడు మనకు సాధ్యుఁడుగాఁడు. అతనిమీఁది మక్కువ విడువు" మని మనోవికాసము గలుగునట్లు పలికెను. అంబ వానిమాటల కియ్యకొని యాసలు పెంచుకొని మరల తనకు భర్తృయోగ మున్నదని నమ్మి విచిత్రవీర్య సమాగమమున

కువ్విళ్ళూరుచుండెను. ఆవానప్రస్థుఁడు దర్భనాఁడు తన ముద్దు మనుమరాలును వెంటఁబెట్టుకొని క్షత్రియాంతకుఁడని బిరుదం దిన పరశురాముని సన్నిధికిఁ బోయి యతనిచేత పూజితుఁడై నీవేలవచ్చితివని యతఁడడుగ నిట్లనియె. "దేవా! ఇది నాదౌహిత్రి కాశీరాజపుత్రిక. భీష్మునికతమున నిది వివాహము లేక బ్రహ్మచారిణి కావలసివచ్చె" నని కడచిన యావద్వృత్తాంతము వినిపించి యిట్లు వేఁడుకొనియెను. "మహాత్మా! భీష్ముఁడు నీకు శిష్యుఁడు. ఆకారణమున విధేయుఁడు. ప్రాణంబులైన విడుచునుగాని నీయాజ్ఞమీరఁడు. అతనికి శస్త్రవిద్యాభిక్షము బెట్టిన మహాత్ముఁడవు నీవేకావా. నీయాజ్ఞమీరి యతఁడు జీవింపలేఁడు. కావున నాతనికడకు నామనుమరాలిని దోడ్కొని పోయి దీనిని విచిత్రవీర్యునకిచ్చి వివాహము జేయునట్లు భీష్మునితోఁ జెప్పవలయును. భర్తృభిక్షము బెట్టి దీని నొకయింటి దానిని జేయవలయును. చక్కఁదనమెల్ల స్త్రీరూపము దాల్చె నదో యన్నట్లున్న యీసుందరాంగి యౌవనము వనముపాలు గాకుండ జేయుము. ఈపూఁబోఁడి తపోనిష్ఠమై నెండ కెండి వానకుఁ దడిసి చలికి మోటబారి మేనివికాసము బాయకుండఁ జేయుము. ఈమెకు సంసారసుఖము గల్పింపుము. ఈమె దురవస్థఁజూచి నామనంబు దుఃఖభాజనమై తపోనిష్ఠకుఁ జొరకున్నది. అన్యశరణంబు లేని దీనికి నీచరణంబె శరణంబు. కావున రక్షింపుము."

అని యావృద్ధుఁడు వేఁడికొనుటయు భార్గవరాముఁడు కృపాధీనమనస్కుఁడై యిట్లనియె. "అయ్యా! యిది యెంత

పని! యిది నాచేతిలోనిదె. నాశిష్యులలోకెల్ల భార్గవుఁడె పరమ ప్రియుడు. ఈపాటి చిన్నకార్య మతనిచేతఁ జేయింపఁజాలనా? అతఁడొప్పుకొనకున్న శిక్షించియైన నీపని యతనిచేతఁ జేయింతును. అని యభయమిచ్చి వారిరువురను వెంటఁబెట్టుకొని పరశురాముఁడు భీష్మునిపాలికిఁ బోయెను. ధనుర్విద్యాగురువైన పరశురాముని రాక వినగానె భీష్ముఁడు భయభక్తులతో నెదురుగాఁబోయి యర్ఘ్యపాద్యము లిచ్చి పూజించి రాకకుం గారణ మడిగెను. పరశురాముఁడు తానవచ్చినపని యామూలాగ్రముగఁ జెప్పి యంబను విచిత్రవీర్యునకు వివాహముజేయు మని యాజ్ఞాపించెను. అపుడు గురువునకు శిష్యుఁడు చేతులుజోడించి యిట్లనియె. "దేవా! నేను మీశిష్యుఁడను. గురువునాజ్ఞ శిష్యుఁడెల్లవిషయములలో శిరసావహింపవలసి యుండును. కాని యీవిషయములో మీయాజ్ఞ నే నుల్లంఘింపవలసివచ్చినందుకు నేను మిక్కిలి చింతించుచున్నాఁడను. నన్ను మీరు క్షమింపవలయు. కావలసినపక్షమున నాశరీరము గోసి యిచ్చెద. నా శిరము ఖండించి నీపాదములఁ బూజించెద. నిర్విచారముగఁ బ్రాణము లర్పించెద. అంతె కాని పరపురుషునిపైఁ దనమనంబు నిల్చియున్నదని బహిరంగముగ నాతోఁ జెప్పిన యీబాలికను నాతమ్మునకిచ్చి నేను వివాహముజేయను. మీద మీయిష్

అనపుడు భార్గవరాముఁడు "నీవు నాయాజ్ఞాప్రకార

వేని యుద్ధమునకు సిద్ధముక"మ్మని పలికెన

మునఁబుట్టి యుద్ధమునకు వెరతునా

యుద్ధసన్నద్ధుఁడయ్యెను. అప్పుడు భీష్మపరశురాముల కిరువది యొక్క దినములు మహాయుద్ధ మయ్యెను. భీష్ముఁడు ప్రాయమున నుండుటచేతను పరశురాముఁడు వృద్ధుఁడగుటచేతను భీష్ముఁడే గెలిచెను. పరశురాముఁడు దెబ్బలుతిని చావునకు సిద్ధమయ్యెను. అప్పుడు కొందఱు మహర్షులు మధ్యవర్తులై వచ్చి గురువధము జేయఁగూడదని భీష్మునకు బోధించి పరశురాముని గాచి యంబను నామెకుఁ దోడ్కొనిపోయిరి. పరశురాముఁ డంతవాఁడు నా పక్షము వహించినను దన మనోరథము నెఱవేర లేదని యంబ చింతిలి తపోవృద్ధురాలై యగ్ని కల్పించుకొని మారు యొక జన్మమెత్తి భీష్ముని వధింపవలయునని మానంబున సంకల్పించుకొని యగ్నిలోఁ బడి మృతినొందెను. మృతినొంది రెండవజన్మమున ద్రుపదరాజునకు మొదటికొడుకుగా పుట్టి పిమ్మట మగతనము దాల్చెను. మొదట నాఁడుదైన కారణమున పేడిమొగముగలవాఁడై యుండెను. అతని పేరు శిఖండి. పేడివారిం జూపనని భీష్ముఁడు ప్రతిజ్ఞపట్టెను. కాఁబట్టి పాండవులు శిఖండిని ముందుఁ బెట్టుకొని భారతయుద్ధమున భీష్మునిమీఁదికిఁ బోయిరి. భీష్ముఁడు శిఖండిమొగము జూడక వెనుకకుఁ దిరిగెను.

అర్జునుఁడు భీష్ముని బాణములతోఁ గొట్టి నేలం బడవైచె.

వజన్మమున శిఖండియై భీష్ముఁ జంపి ప్రతిజ్ఞ నెఱ

— రాజమహేంద్రవరము. —: 1919